నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం మన పత్రిక

NAMASTE TELANGANA

శుక్రవారం FRIDAY 20.9.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4 | సంపుటి (Volume): 14 ॥ సంచిక (Issue): 106 ॥ వెల (Price) రూ.6.50

తదియ

శుక్రవారం, సూర్యోదయం: 6-05, సూర్యాస్తమయం: 6-14. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు భాద్రపద మాసం కృష్ణ పక్షం తిథి: తదియ రాత్రి 9-15 వరకు. నక్షత్రం: అశ్విని రాత్రి 2-43 వరకు. వర్జ్యం: రాత్రి 11-09 నుంచి రాత్రి 12-34 వరకు. రాహుకాలం: ఉదయం 10-38 నుంచి పగలు 12-09 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 8-31 నుంచి ఉదయం 9-19 వరకు, పునర్ దుర్ముహూర్తం: పగలు 12-33 నుంచి పగలు 1-21 వరకు. అమృతకాలం: రాత్రి 8-16 నుంచి రాత్రి 9-42 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

మరణం చివరి చరణం కాదు!



- చావు తర్వాత కూడా మూడో దశ ఉంది
- జీవి మరణించినా ప్రాణంతోనే కణాలు
- పరిశోధనలో అమెరికా శాస్త్రవేత్తల గుర్తింపు

› 10

పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ' ఈ పేపర్‌లో..



కౌలురైతుకు భరోసా ఇవ్వలేం

- పెట్టుబడి సాయంపై రైతు, కౌలురైతు తేల్చుకోవాలి
- ఎవరో ఒకరికే రైతు భరోసా
- కుండబద్దలు కొట్టిన మంత్రి తుమ్మల › 2
- మరో మ్యానిఫెస్టో హామీకి కాంగ్రెస్ సర్కారు మంగళం

2 నుంచి దసరా సెలవులు

- అక్టోబర్ 14 వరకు వరుసగా 13 రోజులు తాతీల్
- మళ్లీ అక్టోబర్ 15న పాఠశాలల పునఃప్రారంభం › 6

స్తంభించిన 'మీ సేవ'

- డాటా కేంద్రంలో సాంకేతిక లోపం
- 10 రోజులుగా నిలిచిన సర్టిఫికెట్ల జారీ
- నష్టపోతున్న విద్యార్థులు, ఉద్యోగార్థులు › 7

తిరుమల లడ్డూపై వివాదం › 6

- గతంలో తయారీలో జంతు కొవ్వు వాడారన్న బాబు
- చంద్రబాబు వ్యాఖ్యలు దుర్మార్గం
- కుటుంబంతో సహా ప్రమాణానికి సిద్ధం : సుబ్బారెడ్డి
- బాబును దేవుడు క్షమించడు: భూమన కరుణాకర్‌రెడ్డి

జానీమాస్టర్ అరెస్ట్

- గోవాలో అదుపులోకి › 6
- నేడు రాజేంద్రనగర్ కోర్టులో హాజరుపర్చనున్న పోలీసులు

అక్టోబర్ 22న మహాధర్నా

ఆటో జేఏసీ సమావేశంలో నాయకుల నిర్ణయం › 7

త్వరలో కరెంట్ షాక్!

- వినియోగదారులపై 1200 కోట్ల చార్జీల భారం!
- ఎల్‌టీ క్యాటగిరీలో రూ.10 నుంచి 50 వరకు ఫిక్స్‌డ్ చార్జీల పెంపు
- హెచ్‌టీ క్యాటగిరీలో ఫిక్స్‌డ్ చార్జీలతోపాటు బిల్లుల పెంపు
- టీజీఎస్ఈఆర్సీకి డిస్కంల ప్రతిపాదనలు › 6



ప్రజాభవన్ ముందు పోలీస్ కంచె

- ముట్టడి పిలుపుతో బలగాల మోహరింపు
- రైతులను అరెస్ట్ చేసి వ్యానులో తరలింపు
- అన్నదాతలను అడ్డుకోవడంతో ఉద్రిక్తత
- ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదంటూ రైతన్నల ఆగ్రహం › 2



రుణమాఫీ కాని రైతులు చేపట్టిన 'చలో ప్రజాభవన్'పై ప్రభుత్వం పోలీసులను ప్రయోగించింది. ఎక్కడికక్కడ ముందుగానే అరెస్టులు చేపట్టింది. గురువారం హైదరాబాద్‌లో పలువురు రైతులను అరెస్టు చేస్తున్న పోలీసులు

ఠాణాల్లో రైతు 'బందీ'

రుణమాఫీ కోరితే రైతులపై ఉక్కుపాదం.. ఎక్కడికక్కడ అరెస్టులు

- రైతుల పోరుకు బీఆర్ఎస్ సంఘీభావం
- రైతులంటే సీఎంకు భయమెందుకు:కేటీఆర్
- ఆంక్షలు లేవంటూనే అరెస్టు చేస్తరా: హరీశ్
- రుణమాఫీ కోరితే సంకెళ్లా?: నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): చేనులో ఉండాల్సిన రైతును కాంగ్రెస్ ప్రభుత్వం ఠాణాల్లో కుక్కింది. పట్నంలో సర్కార్‌ను కలుద్దామని బస్సు ఎక్కిన రైతన్నను పోలీసు జీపు ఎక్కించింది. పొలం పనుల్లో ఉండాల్సిన తమను పోరుబాట పట్టేలా చేసిందెవరు? రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి ఎగ్గొట్టిందెవరు? అని రైతాంగం నిలదీస్తున్నది. మరో వైపు రైతాంగానికి సంఘీభావం ప్రకటించిన బీఆర్ఎస్ పార్టీ నేతలను పోలీసులు ఎక్కడిక్కడ అరెస్టు చేశారు. అక్రమంగా అరెస్టు చేసిన రైతులను › 2వ పేజీలో

బిగ్-బ్రదర్స్

ఫోర్త్ సిటీ.. 'ఫ్యూచర్' ట్రేడింగ్!

బెదిరింపులు!

కుందారం భూ దందా.. వందల ఎకరాలు చెర!

ప్రత్యేక కథనం 3




- నయీం అనుచరులను దింపి రైతులకు బెదిరింపులు
- భూపోరాట నేల అజలాపురంలో నేడు అల్లకల్లోలం
- కొత్త చౌరస్తా వేదికగా బేరసారాలు-ఒప్పందాలు
- రైతుల నుంచి ఇప్పటికే వందెకరాలకు పైగా కొనుగోలు
- 400 ఎకరాలే లక్ష్యంగా కొనసాగుతున్న సెటిల్‌మెంట్లు
- కుందారం సమీపం నుంచే ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్
- ఈ భూముల కోసమే 300 ఫీట్ల గ్రీన్‌ఫీల్డ్ రహదారి

రంగారెడ్డి జిల్లా వెల్దండ, మాడ్గుల మండలాల్లోని కుందారం భూములపై అరాచకకాండ రాజ్యమేలుతున్నది. మారిన ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌తో లబ్ధి పొందేందుకు వీలుగా 400 ఎకరాలను చెరపట్టడమే లక్ష్యంగా దళారీ దందా సాగుతున్నది. ఓ కీలకనేత సోదరులు, సంబంధీకులూ వీరిలో ఉన్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

'భూములిస్తారా.. మేమే లాక్కోవాల్నా' అని రైతులను బెదిరించి ఇప్పటికే అడ్డికి పావుసేరుగా వంద ఎకరాలు కొనేశారు. 'కబ్జా స్వాధీనపత్రం' అంటూ ప్రపంచంలో ఎక్కడా లేని పత్రాలపై సంతకాలు చేయించుకుని ప్రైవేటు ఒప్పందాలు చేసుకుంటున్నారు. నయీం అనుచరులను దింపి మాట వినని రైతులను బెదిరిస్తున్నారు. అజలాపురం నుంచి కుందారం తండా దాక ఇదే భయానక వాతావరణం! రైతుల నుంచి గ్రామస్తుల వరకు ఒకే భీతిల్లిన దృశ్యం!

(నమస్తే తెలంగాణ నెట్‌వర్క్)

అజలాపురం... దశాబ్దమున్నర కిందటివరకు సమైక్య రాష్ట్రంలో ఈ గ్రామం పేరు వింటేనే ఉలిక్కిపడే పరిస్థితి. చైతన్యానికి పెట్టింది పేరుగా ఉన్న ఈ గ్రామం అనతికాలంలోనే మావోయిస్టులకు అడ్డాగా మారింది. కమ్యూనిస్టులు చెప్పే భూపోరాటాలకు నికార్సయిన వేదికగా నిలబడింది. ప్రాణత్యాగాలు చేసి భూపోరాట జెండాను రెపరెపలాడించింది. ప్రభుత్వ, అధికార యంత్రాంగం కదిలివచ్చి అధికారికంగా భూములను పంపిణీ చేసేదాకా అజలాపురం విశ్రమించలేదు. అలా వందలాదిమంది భూమిలేని నిరుపేదలకు భూ హక్కులు కల్పించిన ఈ అజలాపురం చుట్టుపక్కల గ్రామాలు ఇప్పుడు అల్లకల్లోలంగా మారాయి. నాడు పోరాడి సాధించుకున్న భూముల్లో నేడు దళారీ దందాల ప్రకంపనలు › 3వ పేజీలో



ఈ భూదందాకు సంబంధించిన వివరాలు మీ దగ్గర ఉంటే మాకు వాట్సాప్ చేయండి **91827 77711**



ఈ ఊరు మాయమైతున్నది!


- గుడితండా గుండెపై ట్రిపుల్ ఆర్ పిడుగు..!
- ఆ పేరు ప్రస్తావిస్తేనే తండావాసుల కన్నెర్ర › 3
- పెద్దోళ్ల కోసం ఊరిని నాశనం చేస్తారా? అని ఆగ్రహం
- నెల రోజులుగా నిద్రపోతలేమని ఆవేదన

ఆమనగల్లుకు 300 ఫీట్ల రోడ్డు!



- ఓఆర్ఆర్-ఆర్ఆర్ఆర్ లింకుకు రేడియల్ రోడ్ల ఏర్పాటుకు సర్కారు ప్రతిపాదన › 5
- 916 ఎకరాల భూ సేకరణకు ప్రణాళికలు
- అంత భారీ వెడల్పు రోడ్లెందుకన్న ప్రశ్నలు
- రియల్ ఎస్టేట్ ప్రయోజనాలేనన్న వాదనలు

దొంగరాత్రి డ్రోన్ల సర్వే



- అర్ధరాత్రి వేళ పల్లెల మీదికి సర్వే డ్రోన్లు
- రైతులకు తెలియకుండా పొలాల్లో హద్దురాళ్లు
- జాగారం చేస్తున్న ట్రిపుల్-ఆర్ సమీప గ్రామాలు › 3



గూండాగిరీకి పోలీసుల అండ

- రాష్ట్రం ప్రశాంతంగా ఉండాలనే ఓపిక పడుతున్నాం
- శాంతిభద్రతలు అదుపు తప్పడానికి కారణం సీఎం
- బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలపై దాడులు ఇకనైనా ఆపండి
- ఇప్పటికే చాలాసార్లు జరిగాయి.. 4 సార్లు ఫిర్యాదు చేశాం
- స్టేషన్లలో కాంగ్రెస్ నేతల పుట్టినరోజు వేడుకలా?
- మీడియాతో బీఆర్ఎస్ నేతలు జగదీశ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి
- వరస ఘటనలపై డీజీపీకి మాజీమంత్రుల ఫిర్యాదు › 7

గాంధీ దవాఖానపై నిజనిర్ధారణ కమిటీ



- నిపుణుల కమిటీ ఆధ్వర్యంలో అధ్యయనం చేస్తాం
- బాధ్యత గల ప్రతిపక్షంగా ప్రభుత్వానికి సూచనలిస్తాం
- మాతాశిశు మరణాలపై సర్కారు స్పందన అమానవీయం
- ప్రశ్నించిన వారిపై ఎదరుదాడి మాని చక్కదిద్దుకోవాలి
- ఒకవేళ బీఆర్ఎస్ ప్రైవేట్‌కు కొమ్ముకాసిఉంటే రాష్ట్రంలో తెల్లకోటు విప్లవం సాధ్యమయ్యేదా?: కేటీఆర్ › 7



తొర్రూరులోని ఎర్రకుంట

అల్లుడా మజాకా!

- తొర్రూరులో ఎర్రకుంట అలుగు వివాదాస్పదం
- ఉన్నచోట కాకుండా స్థలం మార్చి నిర్మాణం?
- దీనివెనుక మతలబేంటని ప్రశ్నిస్తున్న రైతులు
- విల్లాల కోసమే నీటి మళ్లింపు అని అనుమానాలు
- ఎమ్మెల్యే అల్లుడితో ప్రాణభయమంటూ ఆరోపణలు
- తమ భూములు మునుగుతాయని ఆందోళన
- ఆరు రోజులుగా రైతు కుటుంబాల నిరసన




టెంటు వేసుకొని నిరసన తెలుపుతున్న బాధిత రైతులు

రంగారెడ్డి, సెప్టెంబర్ 19(నమస్తే తెలంగాణ)/ తుర్కయంజాల్: నిన్నమొన్నటి వరకు ఆదరువుగా ఉన్న ఆ నీటివనరే ఇప్పుడు కొందరి నిర్వాకం మూలంగా అక్కడి రైతుల పాలిట శాపంగా పరిణమించబోతున్నది. ఓచోట కట్టాల్సిన అలుగును మరోచోట కట్టడం వల్ల జీవనాధారమైన తమ పొలాలు నీట మునుగుతాయని బాధిత రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. కుంటలో నీటిని దారి మళ్లించడం వెనుక మతలబేంటని? స్థానిక రైతులు ప్రశ్నిస్తున్నారు. కుంట ఎగువ ప్రాంతంలో ఉన్న స్థానిక ఎమ్మెల్యే అల్లుళ్లకు సంబంధించిన పొలాలను ఎఫ్‌టీఎల్ పరిధి నుంచి తప్పించేందుకే చోటు మార్చి అలుగు నిర్మిస్తున్నారని ఆరోపిస్తున్నారు. విల్లాల నిర్మాణం కోసం తమ జీవితాలను పణంగా పెడుతున్నారని, అలుగు నిర్మాణం పూర్తయితే తమ పొలాలు ముంపునకు గురై జీవనాధారం కోల్పోతామని › 6వ పేజీలో

కేసీఆర్ హయాంలో భారీగా కొలువుల సృష్టి

- స్వరాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు పెద్ద ఎత్తున తోడ్పాటు
- 40 ఏండ్లతో సమానంగా పదేండ్లలో ఉద్యోగాల కల్పన
- రాష్ట్రంలో భారీగా విస్తరించిన ఐటీ, ఆహార, ఔషధ పరిశ్రమలు
- ఎంఎస్ఎంఈ పాలసీ సందర్భంగా వెల్లడించిన ప్రభుత్వం
- 12 రంగాల్లో 40 ఏండ్లలో లభించిన ఉద్యోగాలు 67 లక్షలు
- ఇందులో పదేండ్లలో లభించిన ఉద్యోగాలు 30 లక్షలు



హైదరాబాద్, సెప్టెంబర్ 19(నమస్తే తెలంగాణ): పదేండ్లలో కేసీఆర్ సర్కారు భారీగా ఉద్యోగాలు సృష్టించిందనే విషయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన నివేదికే స్పష్టం చేస్తున్నది. గత పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వ తోడ్పాటుతో ఐటీ, సేవల రంగంతోపాటు 12 ప్రధాన రంగాలు భారీగా విస్తరించిన విషయాన్ని ఈ నివేదిక కండ్లకు కట్టింది. గడచిన 40 ఏండ్లలో వచ్చిన ఉద్యోగాలతో సమానంగా గత పదేండ్లలో ఉద్యోగాలు లభించాయనే విషయాన్ని తాజా నివేదిక నిర్ధారిస్తున్నది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమ (ఎంఎస్ఎంఈ) పాలసీని బుధవారం ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం.. రాష్ట్రంలో 12 ప్రధాన రంగాల్లో ఎంఎస్ఎంఈలు సాధించిన ప్రగతిని, కల్పిస్తున్న ఉద్యోగాల వివరాలను వెల్లడించింది. దీని ప్రకారం 12 › 7వ పేజీలో



గురువారం ప్రజాభవన్ వద్ద ధర్నా చేసేందుకు వచ్చిన రైతులను అరెస్టు చేస్తున్న పోలీసులు




సూర్యాపేటలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్‌ను గృహ నిర్బంధం చేసిన పోలీసులు



రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేసి ఠాణాకు తీసుకెళ్తున్న పోలీసులు

లోకం పోకడ



రాణాల్లో రైతు 'బందీ'



నల్లగొండ జిల్లా చిట్యాల పోలీస్‌స్టేషన్‌లో నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పస్రా పోలీస్‌స్టేషన్‌లో నినాదాలు చేస్తున్న రైతులు



అరెస్టు చేసిన బీఆర్ఎస్ నేతలను నారాయణపేట జిల్లా కోస్గి పీఎస్‌కు తీసుకొచ్చిన పోలీసులు



కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు పూర్తిస్థాయిలో రూ.2 లక్షల రుణమాఫీ చేసేలా చూడాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు గురువారం రెండో రోజూ అన్నదాతలు ఉత్తరాలు రాశారు. మంచిర్యాల జిల్లా నెన్నెల మండల కేంద్రంతోపాటు మైలారం, ఆవుడం పోస్టాఫీసుల్లో దాదాపు 100 మంది రైతులు గవర్నర్‌కు ఉత్తరాలు పోస్టు చేశారు. కొందరు రైతులు రిజిస్టర్ పోస్టు చేయగా.. మరికొందరు సాధారణ పోస్టు చేశారు.

▶ మొదటిపేజీ తరువాయి...

విడిచిపెట్టాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. రుణమాఫీ అమలు కాని రైతులు చలో ప్రజాభవన్‌కు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో పోలీసులు బుధవారం అర్ధరాత్రి నుంచే రైతులను, వారికి సంఘీభావం ప్రకటించిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను ఎక్కడికక్కడ అరెస్టులు చేయడం ప్రారంభించారు. కొన్నిచోట్ల పొలం పనుల్లో ఉన్న రైతులను సైతం పోలీసులు నిర్బంధించారు. రైతుల అక్రమ అరెస్టులతో రాష్ట్రం అట్టుడికింది.

ఎక్కడికక్కడ అరెస్టులు

రాష్ట్రవ్యాప్తంగా అన్ని బస్‌స్టేషన్లు, రైల్వే స్టేషన్లలో పోలీసు నిఘా పెట్టారు. రైతు అని అనుమానం వచ్చిన ప్రతీ ఒక్కరిని అదుపులోకి తీసుకొని సమీప పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తల ఇండ్ల ముందు అర్ధరాత్రి నుంచే గస్తీ తిరిగారు. ఏ కారణం చేత బయటికి వచ్చినా పట్టుకెళ్లి పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించారు. హైదరాబాద్ ప్రధాన రహదారులపై నిఘా పెట్టారు. ఇక ప్రజాభవన్ పోలీస్ క్యాంపును తలపించింది. వందలమంది పోలీసులతో ప్రజాభవన్ పరిసరాలు కిక్కిరిసిపోయాయి.

దొంగలమా? టెర్రరిస్టులమా?

శాంతియుతంగా నిరసన చేస్తామని తెలిపినా ప్రభుత్వం తమపై కర్కశంగా వ్యవహరించిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం రాత్రి నుంచి ఉదయం వరకు ఎక్కడికక్కడ అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్లలో పెడతారా? అని ప్రశ్నించారు. తామేమైనా దొంగలమా? టెర్రరిస్టులమా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాంటి షరతుల్లేకుండా ఇచ్చిన మాట ప్రకారం రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తే తాము ప్రజాభవన్‌కు వచ్చేవాళ్లం కాదనే విషయాన్ని ప్రభుత్వం గుర్తిస్తే మంచిదని పేర్కొన్నారు.

రుణమాఫీపై పోరాటం ఆగదు

రుణమాఫీపై పోరాటం ఆగదని రైతాంగం స్పష్టం చేసింది. షరతులు లేకుండా రూ. 2 లక్షల రుణమాఫీ చేసేవరకు పోరాటం చేస్తామని రైతులు తేల్చి చెప్పారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని అణచివేయలేరని పేర్కొన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో అక్రమ అరెస్టులా? అని ప్రశ్నించారు.

జెండా మోసినందుకు ఇదా ప్రతిఫలం?

భుజం కాయలు కాసేలా కాంగ్రెస్ జెండా మోసిన తమకు సీఎం రేవంత్‌రెడ్డి మంచి గుణపాఠం చెప్పారని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. తమను అవమానాలకు గురిచేసిన కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటా అరెస్టులా అని మండిపడ్డారు. ప్రజాభవన్ అని పేరుపెట్టుకోవటం ఎందుకని? ప్రజల్లో తాము లేమా? అని నిలదీశారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం రూ. 2 లక్షల రుణమాఫీ అయ్యేవరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. రుణమాఫీ విషయంలో రేవంత్‌రెడ్డి సర్కార్ తమను మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఇప్పటివరకు రుణమాఫీ' అనే వాట్సాప్ గ్రూపులో ఉదయం నుంచి రాత్రి వరకు ప్రభుత్వ తీరుపై దుమ్మెత్తి పోశారు.

రైతు ముందు సర్కారు తలవంచక తప్పదు: కేటీఆర్



రుణమాఫీపై ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని 'చలో ప్రజాభవన్'కు పిలుపునిచ్చిన రైతులను అరెస్ట్ చేస్తారా? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమంగా అరెస్ట్ చేసిన రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం రాత్రి నుంచి రైతులను, రైతు సంఘాల నాయకులను అక్రమంగా అరెస్టు చేసి పోలీసు స్టేషన్లలో నిర్బంధించడం దారుణమని ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులేమైనా దొంగలా? ఉగ్రవాదులా? అని నిప్పులు చెరిగారు. అప్రజాస్వామిక చర్యలను ప్రభుత్వం వెంటనే ఆపాలని కోరారు. పోలీసుల నిర్బంధకాండతో రైతుల కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రైతులంటే సీఎంకు భయం ఎందుకని ప్రశ్నించారు. అధికారంలోకి వస్తే ఏకకాలంలో రూ. 2 లక్షలు రుణమాఫీ చేస్తామని హామీనిచ్చి మోసం చేసినందుకే రైతులు ఆందోళన బాట పట్టారని గుర్తుచేశారు. ఏ రాజకీయపార్టీతో సంబంధం లేకుండా తమకు తామే సంఘటితమై మొదలుపెట్టిన ఈ రైతు ఉద్యమం ఇంతటితో ఆగదని, రైతుల సంఘటిత శక్తి ముందు దగాకోరు కాంగ్రెస్ ప్రభుత్వం తలవంచక తప్పదని కేటీఆర్ హెచ్చరించారు.

మాఫీ చేయమంటే అరెస్టులా? : నిరంజన్‌రెడ్డి

రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని అడిగిన రైతులను అరెస్టులు చేస్తారా? అని మాజీమంత్రి నిరంజన్‌రెడ్డి మండిపడ్డారు. రాష్ట్రంలో ఇంతవరకు రూ. 2 లక్షల రుణమాఫీ జరగలేదని పేర్కొన్నారు. అరచేతిలో వైకుంఠం చూపి అధికారం దక్కించుకున్న కాంగ్రెస్ పార్టీ రైతులను మోసం చేసిందని ధ్వజమెత్తారు. తమకు రెండు లక్షల రుణమాఫీ కావాలనే ఆత్రుతతో అంతకు మించి ఉన్న అప్పును వడ్డీలకు తెచ్చి కట్టారని, ఆ రైతులకు కూడా రుణమాఫీ చేయకపోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తంచేశారు.

రైతుల అరెస్టు అప్రజాస్వామికం : కొప్పుల

ఇచ్చిన మాట ప్రకారం రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తే రైతులు రోడ్డు ఎందుకు ఎక్కుతారని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రశ్నించారు. రైతుల అరెస్టు అప్రజాస్వామికమని పేర్కొనారు. నమ్మించి మోసం చేయడమే ఇందిరమ్మ రాజ్యం ధ్యేయంగా మారిందని దుయ్యబట్టారు. పోలీసు యాక్ట్ పేరుతో గొంతు నొక్కే ప్రయత్నం చేస్తే సహించేది లేదని కొప్పుల హెచ్చరించారు.

ఆంక్షల్లేవు.. కంచెల్లేవా?: హరీశ్‌రావు



రైతులంటే సీఎం రేవంత్‌రెడ్డికి వణుకు ఎందుకని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. రైతుల అరెస్టులను ఆయన తీవ్రంగా ఖండించారు. రుణమాఫీ కాలేదన్న ఆవేదనతో రైతులందరూ సంఘటితమై 'చలో ప్రజాభవన్'కు పిలుపునిస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి వణుకుపుట్టిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు, రైతు సంఘాల నాయకులను నిర్బంధిస్తూ వారిపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష తీర్చుకుంటున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీ కోసం పోరుబాట పట్టిన రైతన్నల అరెస్టులు దుర్మార్గమని మండిపడ్డారు. 'మాది ఆంక్షలు లేని ప్రభుత్వం, కంచెలులేని ప్రభుత్వం, ప్రజా పాలన అంటూ డబ్బా కొట్టుకునే రేవంత్‌రెడ్డి ఇదేంది? ప్రజాభవన్ చుట్టూ ఎందుకు ఇన్ని బారికేడ్లు, ఎందుకు ఇన్ని ఆంక్షలు? ప్రజాభవన్‌కు రైతులు తరలివస్తున్నారంటే సీఎంకు ఎందుకు అంత భయం?' అని నిప్పులు చెరిగారు. రుణమాఫీపై రేవంత్‌రెడ్డి మాట తప్పారని మండిపడ్డారు. మాట తప్పడమే ప్రభుత్వానికి ఉరితాడు కాబోతున్నదని హెచ్చరించారు. రాజకీయ పార్టీల ప్రమేయం లేకుండా మొదలైన రైతుల ఉద్యమాన్ని ఎదుర్కోవడం అంటే రాజకీయంగా వెకిలి మకిలి, చిల్లర వ్యాఖ్యలు చేసినంత సులువు కాదని విమర్శించారు. నర్సంపేటలో మెడికల్ కాలేజీ, జనరల్ దవాఖానను మంత్రులు ప్రారంభిస్తున్నారన్న కారణంతో పెద్ది సుదర్శన్‌రెడ్డి సహా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను హౌస్ అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని హరీశ్‌రావు గురువారం ఎక్స్ వేదికగా తెలిపారు. తెలంగాణ రాష్ట్రం గత పదేండ్లలో సాధించిన పురోగతిని తెలుపుతూ ప్రధానమంత్రి ఆర్థిక సలహామండలి తాజా నివేదికలో స్పష్టంగా చెప్పిందని హరీశ్‌రావు తెలిపారు. ఇది దాచేస్తే దాగని సత్యమని, దివాలా అని దివాలాకోరు మాటలు మాట్లాడినంత మాత్రాన అబద్ధం నిజం కాదని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	39.7°c	22.7°c
మెదక్	36.8°c	20.5°c
రంగారెడ్డి	36.5°c	18.8°c
ఖమ్మం	35.0°c	24.0°c
నిజామాబాద్	34.0°c	23.5°c
వరంగల్	34.0°c	25.0°c
హైదరాబాద్	33.6°c	22.9°c
నల్లగొండ	33.0°c	25.0°c
మహబూబ్‌నగర్	32.1°c	21.2°c
కరీంనగర్	32.0°c	26.0°c

ప్రజాభవన్ ముందు.. పోలీసుల కంచె

రైతులను అరెస్ట్ చేసి వ్యానులో తరలింపు

హైదరాబాద్, సెప్టెంబర్ 19(నమస్తే తెలంగాణ): రుణమాఫీ కాని రైతులు గురువారం 'చలో ప్రజాభవన్'కు పిలుపునివ్వడంతో రాష్ట్రం నలుమూలల నుంచి రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వీరిని అడ్డుకునేందుకు ప్రభుత్వం ప్రజాభవన్ ముందు పోలీసులను పెద్ద ఎత్తున మోహరించింది. పెద్దపెద్ద బారికేడ్స్, ముళ్లకంచెలు ఏర్పాటు చేసింది. సీఆర్‌పీఎఫ్ బలగాలతో రైతులను ఎక్కడికక్కడ అడ్డుకున్నది. కనిపించిన వారిని కనిపించినట్టు అరెస్ట్ చేసి వ్యాన్ ఎక్కించి అక్కడి నుంచి తరలించారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొన్నది. ఉదయమే ప్రజాభవన్‌కు చేరుకున్న రైతులు సాయంత్రం వరకు ముట్టడికి ప్రయత్నించారు. అప్పుడు ఇనుప కంచెల్ని బద్దలు కొట్టానని ప్రకటించావు కదా.. ఇప్పుడు మళ్లీ ఇనుప కంచెలు ఎలా వచ్చాయని సీఎం రేవంత్‌రెడ్డిని రైతులు ప్రశ్నించారు. తమపై నిరంకుశంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు.

రేవంత్‌పై చర్యలు తీసుకోండి

సీఎం వ్యాఖ్యలు రాజ్యాంగ విలువలకు విరుద్ధం

మల్లికార్జున్ ఖర్గే, రాహుల్‌గాంధీకి మాజీ మంత్రి హరీశ్‌రావు లేఖ

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): మాజీ సీఎం కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉపయోగిస్తున్న అసభ్యకరమైన భాష, నేరపూరిత వ్యాఖ్యలపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి హరీశ్‌రావు కాంగ్రెస్ పార్టీని డిమాండ్ చేశారు. సీఎం వ్యాఖ్యలు రాజ్యాంగ విలువలకు విరుద్ధమని, మహాభారతంలో దుర్యోధనుడి క్రూరత్వంలా రేవంత్‌రెడ్డి ప్రవర్తన ఉన్నదని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీకి హరీశ్‌రావు గురువారం బహిరంగ లేఖ రాశారు. కాంగ్రెస్ పార్టీ తానే ప్రవచించిన ప్రమాణాలను పాటించకపోవడం ఆ పార్టీ ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమని పేర్కొన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌పై దూషణలు, కించపరచే వ్యాఖ్యలు చేయడం రేవంత్‌రెడ్డి దిగజారుడు తనానికి నిదర్శనమని మండిపడ్డారు. కేసీఆర్, ఆయన కుటుంబంపై రేవంత్‌రెడ్డి అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయడం సీఎం స్థాయిని దిగజార్చడం కాదా? కేసీఆర్‌ను రాళ్లతో కొట్టి చంపాలంటున్న రేవంత్ వ్యాఖ్యలను కాంగ్రెస్ హైకమాండ్ సమర్థిస్తుందా? అని ప్రశ్నించారు. రేవంత్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ సమాధానం చెప్పాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.హింసాత్మక వ్యాఖ్యలు, జర్నలిస్టులపై దాడులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామని చెప్తున్న రాహుల్‌గాంధీ ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు.

సర్కార్‌కు రైతుల ఉసురు తగులుతది

- వెంటనే రైతుబంధు, రుణమాఫీ నిధులివ్వాలి
- దేశంలో తెలంగాణ నంబర్ వన్‌గా ఉంటే కాంగ్రెస్ నేతల ఏడుపుగొట్టు మాటలు
- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మండిపాటు



హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ) : రైతుబంధు, రుణమాఫీ నిధులు వెంటనే విడుదల చేయాలని, లేదంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల ఉసురు తగులుతుందని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫైర్ అయ్యారు. దేశంలోనే తెలంగాణ అన్నిరంగాల్లో ముందున్నదని ప్రధానమంత్రి ఆర్థిక సలహామండలి నివేదిక స్పష్టం చేస్తే కాంగ్రెస్ నేతలు రోజూ ఏడుపుగొట్టు మాటలు మాట్లాడుతున్నారని ఎద్దేవాచేశారు. మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య, బీఆర్ఎస్ లీగల్ సెల్ నాయకుడు కల్యాణ్‌రావుతో కలిసి తెలంగాణ భవన్‌లో గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను తెలివి తక్కువవారిగా చూస్తున్నదని, పార్టీలకు అతీతంగా రుణమాఫీ కాని రైతులు చలో ప్రజాభవన్‌కు పిలుపునిస్తే వారితో పాటు బీఆర్ఎస్, బీజేపీ, కమ్యూనిస్టు కార్యకర్తలను కూడా పోలీసులు అరెస్ట్ చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో నిర్బంధ పాలన కొనసాగుతున్నదని విమర్శించారు. ఎలాంటి షరతులు లేకుండా రైతు బంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు కూడా ఇస్తామన్న డబ్బులు ఏవని ప్రశ్నించారు. రైతుబంధు కోసం 70లక్షల మంది రైతులు ఎదురుచూస్తున్నారని చెప్పారు. రైతు బంధు నిధులపై శుక్రవారం నాటి క్యాబినెట్‌లో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ అడిగిన రైతులను పోలీసులు అరెస్ట్ చేస్తున్నారని, వారిని వెంటనే విడుదల చేయాలని, రైతు బీమా, ఫసల్ బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కేసీఆర్ విధానాలతోనే తెలంగాణ నంబర్ వన్

ఆర్థిక అంశాల్లో అన్ని రాష్ట్రాలను తలదన్నేలా తెలంగాణ నంబర్ వన్ స్థానంలో ఉన్నదని పల్లా తెలిపారు. ఐటీ, వ్యవసాయం, పరిశ్రమలు ఇలా అన్ని రంగాల్లో ముందున్నదని, గత సీఎం కేసీఆర్ అనుసరించిన విధానాలతోనే ఇది సాధ్యమైందని స్పష్టంచేశారు. రాష్ట్రం అప్పుల పాలైందంటూ, దివాలా తీసిందంటూ సీఎం, మంత్రులు ఏడుపుగొట్టు మాటలతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆక్షేపించారు. ఇకనైనా అలాంటి చేతగాని మాటలను ఆపాలని సూచించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం పది నెలల పాలనలో ఒక్క పాలసీగాని, కొత్త పథకం గాని అమలు చేయలేదని, అయినా రూ.75 వేల కోట్ల అప్పు చేశారని విమర్శించారు. 2014-15లో తెలంగాణ తలసరి ఆదాయం రూ.1.24 లక్షలు ఉన్నదని, 2023-24 నాటికి రూ.3.47 లక్షలకు చేరిందని చెప్పారు. దేశ తలసరి ఆదాయం కేవలం రూ.1.83 లక్షలేనని గుర్తుచేశారు. వృద్ధి రేటులో దేశం కంటే తెలంగాణ 193 శాతం ముందున్నదని తెలిపారు. జీడీపీలో తెలంగాణ వాటా 3.8 శాతం ఉండగా 2023-24 నాటికి 4.9 శాతానికి చేరిందని, 2014-15లో తెలంగాణ జీఎస్‌డీపీ రూ.5.05లక్షల కోట్లు ఉండగా 2023-24 నాటికి రూ.14.62 లక్షల కోట్లకు చేరిందని వివరించారు. ఐటీలో ఉద్యోగుల సంఖ్య, ఎగుమతులు భారీగా పెరిగాయని, వీటికి ప్రధాన కారణం కేసీఆరే అని స్పష్టం చేశారు.



ఆర్మూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతు జేఏసీ నేతలు

రుణమాఫీ చేయాలని రైతుల ధర్నా

తహసీల్దార్ ఆఫీసుల ఎదుట అన్నదాతల నిరసన

నందిపేట్, సెప్టెంబర్ 19: కాంగ్రెస్ పార్టీ చెప్పినట్టు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని రైతులు గురువారం నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్ డివిజన్ వ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేపట్టారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రైతులను మోసం చేసిందని మండిపడ్డారు. రూ.2 లక్షల రుణమాఫీ, రైతుభరోసా, వరికి రూ.500 బోనస్ అమలు చేయకపోతే రైతుల సత్తా ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు. అనంతరం రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు.

రైతు, కౌలురైతులే తేల్చుకోవాలి

- రైతుభరోసా ఎవరికి ఇవ్వాలో వాళ్లే నిర్ణయించుకోవాలి
- కుండబద్దలు కొట్టిన మంత్రి తుమ్మల
- ఇద్దరికీ రైతుభరోసా ఇస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

'రైతులకు, కౌలురైతులకు ఎకరానికి రూ.15 వేల చొప్పున రైతుభరోసా ఇస్తాం'

- ఇదీ కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో రైతులకు ఇచ్చిన హామీ.

'రైతులకు, కౌలు రైతులకు ఎవరికి ఇవ్వాల్సిన పెట్టుబడి సాయం వాళ్లకు ఇస్తాం'

- ఇదీ ఎన్నికల సమయంలో పీసీసీ అధ్యక్షుడిగా ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ.

'రైతుభరోసా పెట్టుబడి సాయం ఎవరో ఒకరికే ఇస్తాం. దీనిపై రైతులు, కౌలు రైతులు మాట్లాడుకోవాలి'

-ఇదీ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తాజా ప్రకటన.



హైదరాబాద్, సెప్టెంబర్ 19(నమస్తే తెలంగాణ): రైతులకు, కౌలురైతులకు ఇద్దరికీ రైతుభరోసా ఇస్తామంటూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ఒట్టిదేనని తేలిపోయింది. ఇద్దరికీ ఇవ్వడం కుదరదని, ఎవరో ఒకరికి మాత్రమే రైతుభరోసా ఇస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కుండబద్దలు కొట్టారు. గురువారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. రైతుభరోసాపై కీలక వ్యాఖ్యలు చేశారు. కౌలు రైతులకు రైతుభరోసా ఇస్తారా? అని మీడియా అడిగిన ప్రశ్నకు మంత్రి తుమ్మల స్పందిస్తూ.. 'అది రైతులు, కౌలు రైతులు మాట్లాడుకోవాలి అని స్పష్టంచేశారు.

సీఎంది ఒకమాట.. మంత్రిది మరోమాట

విధానపరమైన నిర్ణయాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, మంత్రులకు సఖ్యత కుదరడం లేదనే అంశం ఇప్పటికే ప్రచారంలో ఉన్నది. రైతుభరోసాపై మంత్రి తుమ్మల వ్యాఖ్యలతో ఇది మరోసారి నిరూపితమైంది. కౌలు రైతులకు రైతుభరోసాపై సీఎం రేవంత్‌రెడ్డి ఒక విధంగా చెబితే.. ఆ శాఖ మంత్రి తుమ్మల అందుకు భిన్నంగా చెప్పడం గమనార్హం.

కేసీఆర్ చెప్పిందే నిజమైంది

కౌలు రైతులకు రైతుబంధు అంశంపై 2019లో ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ చెప్పిందే ఇప్పుడు నిజమైంది. 2019లో రైతుబంధు పెట్టుబడి సాయాన్ని రూ.4 వేల నుంచి రూ.5 వేలకు పెంచే సందర్భంలో కౌలురైతులకు పెట్టుబడి సాయంపై కేసీఆర్ అసెంబ్లీలో మాట్లాడుతూ.. 'నేను బాధ్యత గల ముఖ్యమంత్రిగా చెప్తున్నా.. రైతులకు మేము సాయం చేస్తున్నాం కాబట్టి.. మీరు (రైతులు) మానవీయ కోణంలో ఆలోచించి కౌలురైతులకు సాయం చేయాలి. ఇది రైతులు, కౌలు రైతుల మధ్య జరగాల్సిన విషయం. ఆ ఇద్దరి మధ్య సమస్యతో ప్రభుత్వానికి సంబంధం లేదు' అని నిక్కచ్చిగా చెప్పారు.

200% పంట వేసిన వారికే రైతుభరోసా

రైతుభరోసా పంట సాగు చేసిన రైతులకు మాత్రమే అందిస్తామని మంత్రి తుమ్మల తేల్చి చెప్పారు. '99% కాదు... 200% చెప్తున్నా.. పంట వేసిన రైతులకు మాత్రమే రైతుభరోసా ఇవ్వాలని కోరుకుంటున్నారు. ప్రభుత్వం కూడా అదే అమలు చేయబోతున్నది' అని స్పష్టంచేశారు. దీంతో రైతుభరోసాలో కోతలు తప్పవని తేలిపోయింది.

జింబాబ్వే దుస్థితి మనకు రావొద్దు

'గ్రీన్ ఇండియా చాలెంజ్'లో భాగంగా మొక్కలు నాటుదాం

ఎక్స్‌లో రాజ్యసభ మాజీ సభ్యుడు జోగినపల్లి సంతోష్



హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ) : జింబాబ్వేలో ప్రస్తుతం కరువు తాండవిస్తున్నదని, అందుకు ప్రధాన కారణం చెట్లను నాటి, సంరక్షించకపోవడమేనని రాజ్యసభ మాజీ సభ్యుడు జోగినపల్లి సంతోష్ తెలిపారు. చెట్లు నాటడం వల్ల కలిగే ప్రయోజనాలను, జింబాబ్వే దుస్థితిని గుర్తు చేస్తూ ఆయన గురువారం ఎక్స్‌లో పోస్టు చేశారు. 'జింబాబ్వేలో అడవులను నిర్మూలించడం తీవ్రమైన వాతావరణ సంక్షోభం, పర్యావరణ క్షీణతకు కారణమైంది. అందుకే నేను కూడా మన గురించి ఆందోళన చెందుతున్న. అలాంటి దుస్థితి మనకు రాకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ నా 'గ్రీన్ ఇండియా చాలెంజ్'లో చేరి, మొక్కలు నాటాలని విజ్ఞప్తి చేస్తున్న. మనమంతా కలిసి మన దేశ సుస్థిర భవిష్యత్‌ను సృష్టిద్దాం' అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. జింబాబ్వేలో ప్రస్తుత తాండవిస్తున్న కరువుపై డెక్కన్ హెరాల్డ్ రాసిన కథనాన్ని ఈ పోస్టుకు ఆయన జత చేశారు.

బిగ్-బ్రదర్స్ బెదిరింపులు!



➤ మొదటిపేజీ తరువాయి...

కొనసాగుతున్నాయి. బెదిరించో, భయపెట్టో భూములు గుంజుకుంటున్నారు. దిక్కుతోచని స్థితిలో భూములపై తమ హక్కులను రైతులే గుగ్గిళ్లకు గుర్రాలను అమ్ముకున్నట్టు అర్పించుకోవాల్సిన అగత్యంలోకి నెడుతున్నారు. భూ రికార్డుల్లోని గందరగోళాన్ని అడ్డుపెట్టుకొని అధికారపార్టీకి చెందిన ఓ కీలక నేత సంబంధీకులు, సోదరులు కుందారం భూములను చెరపడుతున్నట్టు ఆ గ్రామాల్లో ప్రచారం జరుగుతున్నది. అందుకోసం గతంలో నయీం అనుచరులుగా వ్యవహరించినవారినీ రంగంలోకి దింపి భీతావహ వాతావరణాన్ని సృష్టిస్తున్నారని వివిధ గ్రామాల ప్రజలు చెప్తున్నారు.

కుందారం భూములంటేనే తెలంగాణవ్యాప్తంగా ప్రసిద్ధి. గతంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా.. ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా పరిధిలోకి వచ్చే వెల్దండ మండలంలోని అజలాపురం, భైరాపూర్, మాడ్గుల మండలంలోని అంతిరెడ్డిపల్లి, దిలావార్‌ఖాన్‌పల్లి, ఇర్విన్, కుందారం తండా, లాల్‌తండాల్లో ఈ భూములు విస్తరించి ఉన్నాయి. ప్రస్తుతం ఈ భూములన్నీ రంగారెడ్డి జిల్లా ఇర్విన్ గ్రామ పరిధిలోకి వస్తున్నాయి. పూర్వం ఈ భూముల వనపర్తి సంస్థానం రంగనాయకమ్మకు చెందినవి. అనంతరం నిజాం కాలంలో భూశిస్తు అమలులో ఉండేది. ఒకవేళ ఎవరైనా తమ భూములకు శిస్తు చెల్లించనట్టయితే ఇతరులు ఎవరైనా ఆ భూములకు వాస్తవ మొత్తంలో సగం చెల్లించినా అవి వారి పేరిట కొనసాగేవి. అలా సగం శిస్తు ఇతరులు చెల్లించిన భూములను మక్త భూములు అంటారు. అలా అజలాపురం గ్రామానికి చెందిన కుందారం వంశీయుల ఆధీనంలోకి ఈ మక్త భూములు వెళ్లాయి. ఇలా ఇర్విన్ గ్రామ పరిధిలోని సర్వే నెంబరు 1003 నుంచి 1053 వరకు దాదాపు 700 ఎకరాలకు పైగా భూములు రెవిన్యూ రికార్డుల్లో రఘుమారెడ్డి, గీతారెడ్డి, సీతారెడ్డి, మోహన్‌రెడ్డి పేర్ల మీద వస్తున్నాయి. వాస్తవానికి కుందారం వంశీయులు ఈ భూములను సాగు చేయకపోవడంతో గ్రామంలోని నిరుపేద రైతులు సాగు చేసుకుంటూ వస్తున్నారు. కుందారం వంశీయులు చాలామంది ఏండ్ల కిందటే విదేశాల్లోను, హైదరాబాద్‌లోనూ స్థిరపడ్డారు. ఈ నేపథ్యంలో తమ భూములను సాగు చేసుకుంటున్న వారిని అందులో నుంచి వెళ్లిపోవాలని కుందారం వంశీయులు హెచ్చరించడం, తమకు గత్యంతరం లేదు.. భూములను సాగు చేసుకుంటామని వాళ్లు వేడుకోవడం... ఏండ్ల తరబడి ఇదే కొనసాగుతూ వచ్చింది. ఈ క్రమంలోనే 90వ దశకంలో నక్సల్స్ ప్రాబల్యం ఈ గ్రామంలో మొదలవడం జరిగింది.

పతాకస్థాయిలో భూ పోరాటం

అజలాపురానికి చెందిన పాతతరం వారు చెప్తున్న వివరాలు ఒళ్లు గగుర్పొడిచేలా ఉన్నాయి. ఉస్మానియా యూనివర్సిటీలో ఎమ్మెస్సీ బీఎడ్ చేసిన ఆ ప్రాంతానికి చెందిన కూన నిరంజన్ అనే యువకుడు కుందారం భూములపై పేద రైతులకు హక్కు కల్పించాలనే లక్ష్యంతో నక్సల్స్ వైపు ప్రభావితం అయ్యాడు. అనంతరం ఇలా గ్రామంలో ప్రతి ఇంటి నుంచి ఒకరిద్దరు యువతీ యువకులు ప్రభావితులై అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఇలా అప్పట్లో పీపుల్స్‌వార్‌కు అజలాపురం గ్రామ పరిసరాల్లో గణనీయమైన పట్టు వచ్చి, సేఫ్టీ జోన్‌గా కూడా మారింది. ఈ క్రమంలో కుందారం వంశీయులు ఒక్కరు కూడా గ్రామంలో ఉండే పరిస్థితి లేకుండా పోయింది. కనీసం పోలీసులు సైతం ఆ గ్రామాల పరిసరాల్లోకి వెళ్లే పరిస్థితులు ఉండేవి కావని కొందరు గ్రామస్థులు తెలిపారు. ఇలా పీపుల్స్‌వార్ ఆధ్వర్యంలోనే కుందారం భూములు నిరుపేద రైతులకు పంపిణీ చేశారని చెప్తున్నారు. ఇక్కడ విశేషమేమిటంటే... 700 ఎకరాల్లో ఒక్క ఎకరా కూడా ఇప్పటికీ రాళ్లు, రప్పలు లేకుండా సాగవుతున్నదంటే ఆదినుంచీ రైతులు నిరంతరాయంగా ఈ భూములను సాగు చేశారని అర్థమవుతున్నది. అయితే పేద రైతులు ఆ భూములను సాగు చేసుకుంటున్నప్పటికీ రెవిన్యూ రికార్డుల్లో మాత్రం కుందారం వంశీయుల పేర్లే కొనసాగాయి.

రంగంలోకి నయా నయీంలు

భూరికార్డుల గందరగోళం కుందారంలో భూదందాకు దారితీస్తున్నది. ఆ రికార్డులను అడ్డుపెట్టుకుని, అధికారం అండచూసుకుని.. సదరు సోదరులు రైతుల భూములను చెరపడుతున్నారు. తెలంగాణకు నయీం పీడ విరుగడైందనుకుంటున్న తరుణంలో.. మళ్లీ నయా నయీంలను సృష్టిస్తున్నారు. గతంలో నయీంకు అనుచరులుగా వ్యవహరించినవారు కొందరు కుందారం భూముల దందాలోకి దిగారు. ఒకటీ అరా కాదు... ఏకంగా నాలుగు వందలకు పైగా ఎకరాలే లక్ష్యంగా ఈ బలవంతపు కొనుగోళ్లు కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు వంద ఎకరాలకు పైగా ఒప్పందాలు పూర్తయ్యినట్టు సమాచారం. 'ఉన్న భూమిని అమ్ముతవా? లేదా??' అన్న రీతిలో ఈ దౌర్జన్యకాండ కొనసాగుతున్నది. ఈ గ్రామాల్లోని ఏ ఒక్క రైతును కదిలించినా.. హడలెత్తిస్తున్న భూదందా మీదనే గోడు వెల్లబోసుకుంటున్నాడు. ఏ ఒక్క రాజకీయ నాయకుడిని కదిపినా.. నయీం అనుచరుల పేర్లు ఉచ్చరిస్తూ వణికిపోతున్నారు. అంతేకాదు... కుందారం భూములకు సమీపంలోనే ట్రిపుల్ ఆర్ వెళ్లేలా అలైన్‌మెంట్ మార్పు జరగడంతో పాటు ఆమన్‌గల్-రావిర్యాల 300 ఫీట్ల గ్రీన్‌ఫీల్డ్ రహదారి సైతం ఈ భూముల లక్ష్యంగానే నిర్మాణం అవుతున్నదంటే.. కుట్రకు ఏ స్థాయిలో ప్రణాళికలు రచించారో అర్థం చేసుకోవచ్చు.



ఎకరానికి 40 లక్షలు..
4 లక్షలకే కొనుగోలు!

ఈ భూములపై కన్నేసిన 'బిగ్-బ్రదర్స్' వ్యూహాత్మకంగా అడుగులు వేశారు. ఇందులో భాగంగానే ఒకవైపు ట్రిపుల్-ఆర్ దక్షిణ భాగం అలైన్‌మెంట్‌లో మార్పు చేశారు. దీంతోపాటు ఆమనగల్-రావిర్యాల గ్రీన్‌ఫీల్డ్ 300 ఫీట్ల రహదారిని కూడా దీనికి సమీపంలోనే ప్రతిపాదించారు. ఈ నేపథ్యంలో మరోవైపు కొందరు వ్యక్తులను రంగంలోకి దించి పెద్దఎత్తున భూములను కొనుగోలు చేస్తున్నారు. ఇందులోనే నయీం అనుచరులు కీలకపాత్ర పోషిస్తున్నట్టు గ్రామస్తులు కొందరు తెలిపారు. ముఖ్యంగా ఓఆర్‌సీ, పాసు పుస్తకాలు లేకుండా కబ్జాలో ఉన్న రైతులను ముందుగా టార్గెట్ చేశారు. 'ఎలాగూ మీకు డాక్యుమెంట్లు లేవు... ఎంతోకొంతకు అమ్ముకుంటే ఇప్పుడు పైసలొస్తయి. లేదంటే భూమి నుంచి వెళ్లగొడ్తరు. మేం ఎలాగోలా సీసీఎల్‌ఏలో రికార్డుల్లో నమోదు చేసుకుంటాం' అని చెప్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. భూములియ్యబోమని మొండికేసినవారిని బెదిరిస్తున్నారు. వాస్తవానికి ఇక్కడ ఎకరా రూ.30 లక్షల నుంచి 40 లక్షల వరకు ధర పలుకుతుండగా... కేవలం రూ.3-4 లక్షలకే కొనుగోలు చేసుకొని, ప్రైవేటు ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఆపై ఓఆర్‌సీ ఉండి, భూమిపై ఉన్న వారిని కూడా బెదిరిస్తున్నారు. రికార్డుల్లో తక్కువ ఉండి, కబ్జాలో ఎక్కువ ఉన్నందున మొత్తానికి ఒక రేటు నిర్ధారించి కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటివరకు సుమారు వందెకరాలకు పైగా భూమిని ఇలా కొనుగోలు చేసినట్టు సమాచారం. అయితే ఓఆర్‌సీ ఉండి పాసు పుస్తకాలు లేకుండా, కబ్జా మీద లేనివారు ఇప్పుడు వీరిచుట్టూ తిరుగుతున్నారు. మాకు ఓఆర్‌సీ ఉంది.. పైసలు మాకియ్యాలి అంటూ వేడుకున్నా కనికరించడంలేదని కొందరు రైతులు 'నమస్తే తెలంగాణ'తో ఆవేదన వ్యక్తం చేశారు.



బెదిరింపులకు ఇంకేం సాక్ష్యం కావాలి?!

రైతుకు, భూమితో ఉండేది అవినాభావ బంధం. డాక్యుమెంట్లు లేకున్నా, ప్రభుత్వ రికార్డుల్లో పేరు లేకున్నా.. ఏండ్ల తరబడి భూమిని నమ్ముకొని సాగు చేస్తున్న రైతులు ఎప్పటికైనా తమను ప్రభుత్వం గుర్తించకపోతదా! పట్టా ఇయ్యకపోతదా!! అని ఎదురుచూస్తరు. అంతేకానీ భూమిని వదిలిపెట్టిపోడు. మరి అలాంటిది దశాబ్దాలుగా రెండు, మూడు తరాలు సాగు చేసిన భూమి నుంచి రాత్రికి రాత్రి పొమ్మంటే ఆ రైతు ప్రాణం ఎంత తండ్లాడుతది? కుందారపు భూముల్లో ఇప్పుడు అదే జరుగుతున్నది. ప్రపంచంలో ఎక్కడైనా భూమి అమ్మేందుకు, కొనేందుకు ఒప్పంద పత్రాలు చూశాం! కానీ రైతు భూమిని అడ్డికి పావుశేరులా కొని ఆ రైతును వెళ్లగొట్టేందుకు 'కబ్జా రద్దు ఒప్పంద పత్రం' ఎక్కడైనా చూశామా?! ఇది అదే! వందల ఎకరాలపై కన్నేసిన కొందరు వ్యక్తులు ఇలా బెదిరింపులకు దిగి.. భూమిని సాగు చేస్తున్నా, ప్రభుత్వ రికార్డుల్లోకి ఎక్కేది లేదు. ఆపై వెళ్లగొడితే వచ్చే నాలుగు పైసలు కూడా రావంటూ బెదిరించి ఇలా కబ్జా నుంచి వెళ్లగొడుతున్నారు. ఆ భూములను స్వాధీనం చేసుకొని చుట్టూ కడీలు పాతుకుంటున్నారు.

వైఎస్ హయాంలో భూ హక్కులు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2004లో ఏర్పడిన వైఎస్ ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరపడం.. తదనంతర పరిణామాల తర్వాత ఈ గ్రామంపై ప్రత్యేకంగా దృష్టిపెట్టింది. 1972 ల్యాండ్ సీలింగ్ యాక్టు ప్రకారం 2006లో అప్పటి ప్రభుత్వం అందులోని 493.10 ఎకరాలను స్వాధీనం చేసుకుంది. మిగిలిన భూములు కుందారం వంశీయుల వద్దే ఉన్నాయి. కానీ ఆ భూములు తమవేనంటూ అప్పట్లోనే కుందారం వంశీయులు న్యాయస్థానాలను ఆశ్రయించారు. కాగా సీలింగ్ యాక్టు ప్రకారం సేకరించిన భూములను.. భూమిలేని నిరుపేదలకు అధికారికంగా పంపిణీ చేసేందుకు అప్పటి మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ ఉషారాణి నేతృత్వంలో పెద్దఎత్తున కసరత్తు జరిగింది. 306 మంది రైతులకు ఈ భూములను పంపిణీ చేసేందుకుగాను వారికి ఓఆర్‌సీ (ఓనర్‌షిప్ రైట్ సర్టిఫికెట్) కూడా జారీ చేశారు. కానీ ఇందులో 138 మంది రైతుల పేర్లు మాత్రమే రెవిన్యూ రికార్డుల్లోకి ఎక్కి.. వారికే పట్టా పాసుపుస్తకాలు జారీ అయ్యాయి. ఈ లోగా కుందారం వంశీయులు కోర్టుల నుంచి స్టేలు తెచ్చుకోవడంతో మిగిలిన వారికి పాసు పుస్తకాలు జారీ అయ్యేందుకు అధికారులు కోర్టు కేసును సాకుగా చూపారు. అయినప్పటికీ సీలింగ్ యాక్టు కింద సేకరించిన భూములన్నింటినీలోనూ రైతులు కబ్జా మీద ఉండి సాగు చేసుకుంటూనే ఉన్నారు. ఇలా కుందారం భూముల్లో సాగు చేసుకుంటున్నవారు మూడు రకాలుగా ఉన్నారు.

1. ప్రభుత్వం జారీ చేసిన ఓఆర్‌సీ ఉండి.. క్షేత్రస్థాయిలో భూ కబ్జాలో ఉన్నవారు. వీరిలోనూ కొందరు ఓఆర్‌సీ, పాసు పుస్తకాల్లో ఉన్న దాని కంటే ఎక్కువ విస్తీర్ణంలో (కొంతమంది 7-10 ఎకరాల్లో) సాగు చేసుకుంటున్నారు.
2. క్షేత్రస్థాయిలో భూమిని సాగు చేసుకుంటున్నప్పటికీ ఆ రైతులకు ఓఆర్‌సీగానీ, పాసు పుస్తకాలుగానీ లేవు.
3. 2006లో 306 మంది రైతులకు ఓఆర్‌సీలు జారీ కాగా.. వీరిలో 168 మందికి ఓఆర్‌సీలు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో భూ కబ్జాలో లేరు. కేవలం ఓఆర్‌సీలు మాత్రమే ఉన్నాయి.



దొంగరాత్రి డ్రోన్ల సర్వే!

అర్ధరాత్రివేళ పల్లెల మీదికి సర్వే డ్రోన్లు

రైతులకు తెలియకుండా పాలాల్లో హద్దురాళ్లు

'దొంగ రాత్రివేళ పల్లెల మీద డ్రోన్లు తిరుగుతున్నయ్. పంట పొలాల్లో కొత్త మనుషులు తిరుగుతున్నరు. పొద్దున లేచి చేనుకు పోతే హద్దు రాళ్లు పాతి, వాటి మీద 'X' ఆకారంలో ఎర్ర రంగు గుర్తులు పెట్టి ఉంటున్నయ్. ఇది ఎవడు పెట్టిండో.. ఎందుకు పెట్టిండో.. దొంగోని పనో? దొరోని పనో? జర పట్టుకొని జెప్పండ్రి సారు' అని ప్రతిపాదిత రీజినల్ రింగ్ రోడ్డు సమీపంలోని గ్రామాల రైతులు, ప్రజలు ఇటీవల పోలీసు స్టేషన్లకు వరుసకట్టారు. పోలీసులు ఫిర్యాదు తీసుకున్నారు కానీ ఇప్పటి వరకు ఏమీ తేల్చలేదు. తాజాగా డ్రోన్ల గుట్టు బయటపడింది. అవి రీజినల్ రింగ్ రోడ్డు అక్రమ అలైన్‌మెంటు కోసం సర్వే శాఖ నుంచి ఎగిరిన డ్రోన్లు అని తేలింది.

(నమస్తే తెలంగాణ నెట్‌వర్క్)

ప్రజాప్రయోజనాల కోసం ప్రభుత్వం భూ సేకరణ చేస్తే అధికారులు ముందుగా ఫీల్డ్ విజిట్ చేయాలి. రైతులతో మాట్లాడాలి. సంబంధిత గ్రామాల్లో సభలు, సమావేశాలు పెట్టి ప్రజాభిప్రాయ సేకరణ చేయాలి. ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారంపై రైతులను చైతన్యం చేయాలి. ఇది రాజ్యాంగ బద్ధంగా ఆమోదించబడిన భూ సంస్కరణ చట్టం రైతులకు కల్పించిన హక్కు. ఇప్పటివరకు నగరం ఉత్తర దిక్కు వైపు ఇదే రీజినల్ రింగ్ రోడ్డు కోసం చేసిన భూ సేకరణలో భూ సంస్కరణ చట్టం నిబంధనలనే పాటించి అప్పటి కేసీఆర్ ప్రభుత్వం భూ సేకరణ చేసింది. కానీ ఇప్పుడు రీజినల్ రింగ్ రోడ్డుకు ఏ చట్టమూ లేదు. అధికారుల ఫీల్డ్ విజిట్ లేదు. రైతులకు సమాచారం లేదు. సర్వే అధికారులు దొంగల తీరున అర్ధరాత్రి, అపరాత్రి వేళ పంట పొలాల మీద పడిపోతున్నారు. సర్వే కోఆర్డినేట్ మిషన్ చూపిన చోట హద్దు రాళ్లు పాతుతున్నారు. వాటికి రంగులు వేసి వెళ్లిపోతున్నారు. మరో దొంగ రాత్రి వేళకు డ్రోన్లను పంపి అలైన్‌మెంటు చేస్తున్నారు. నగరానికి దక్షిణం దిక్కు రింగు రోడ్డు ప్రతిపాదిత అలైన్‌మెంటు కాదని ఒక ముఖ్యనేత కనుసన్నల్లో పంట పొలాల్లో పాము తిరిగినట్టు అష్టవంకర్లు తిరుగుకుంటూ వెళ్లిపోతున్నది. ఇటు మంచాల, యాచారం మండలాల నుంచి మొదలు వెల్దండ, మీదుగా ఇటు పూడూరు మండలంలోని గ్రామాల వరకు ఇదే తంతు.

వరుసగా నాలుగు రాత్రులు..

ఈ నెల ఎనిమిదో తేదీ రాత్రి నుంచి వరుసగా నాలుగు రాత్రులు అంటే 12వ తేదీ వరకు యాచారం, చింతపట్ల మండలాల్లో డ్రోన్లు తిరిగాయి. యాచారం మండలం చింతపట్ల, మొండిగౌరెల్లి గ్రామాలు, మంచాల మండలంలోని చీదేడు, రంగాపూర్, జాపాల, మంచాల, కాగజ్పట్ గ్రామాలపై డ్రోన్లు తిరిగాయి. రాత్రి 9 గంటల ప్రాంతంలో పంట పొలాల్లోకి కొత్త మనుషులు వచ్చే వారని, 11 గంటలకు డ్రోన్లు లేచి తెల్లవారుజాము వరకు చెలకల మీద తిరిగాయని, 4 నుంచి 7 గంటల వరకు కొద్దిపాటి వ్యవధితో డ్రోన్లు ఒకదాని వెంట ఒకటి వచ్చేవని, దేనికది పది నుంచి పదిహేను నిమిషాల పాటు స్థిరంగా ఒక చోటే ఉండేదని గ్రామస్థులు చెప్పారు. 'మొదట పశువుల దొంగలు డ్రోన్ల తోటి గొర్రెలు, బర్రెలు, మేకల జాడలు గుర్తించటానికి వాడుతున్నారేమో అనుకున్నాం. డ్రోన్ల కదలికలపై నిఘా పెట్టి పట్టుకునేందుకు రాత్రంతా జాగారం చేశాం. కొందరం గుట్టల చాటున కాపు కాశాం' అని దాట్పల్లి గ్రామస్థులు చెప్పారు. మరి కొద్ది రోజులకే పంట పలాల్లో హద్దురాళ్లు పాతినట్టు గుర్తించామని, ఏమి జరుగుతుందో తెలియక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రంగాపూర్ గ్రామస్థులు తమ అనుభావాలను వివరించారు. హద్దు రాళ్లు పాతిన చోటు నుంచి జియో కేబుల్ లైన్ పోతున్నదని, రైతుల భూమికి ఎటువంటి ఇబ్బంది ఉండదని, పైగా నష్టపరిహారం కూడా ఇస్తారని తమ ఊరి వాళ్లే కొందరు ప్రచారం చేశారని మేడిపల్లి గ్రామానికి చెందిన రైతు చెప్పారు.

గుడితండా గుండెపై ట్రిపుల్ ఆర్ పిడుగు!

ఆ పేరు ప్రస్తావిస్తేనే తండావాసుల కన్నెర్ర

పెద్దోళ్ల కోసం ఊరిని నాశనం చేస్తారా? అంటూ ఆగ్రహం

నెల రోజులుగా నిద్ర పోతలేమని తీవ్ర ఆవేదన

ఆమనగల్లు, తలకొండపల్లి: ఆమనగల్లు మండల పరిధిలోని మేడిగడ్డ తండా (గుడి తండా) గ్రామపంచాయతీలోని గుడి తండా సమీపంలో ట్రిపుల్‌ఆర్ మార్కింగ్ తండావాసుల గుండెల్లో మంటలు రేపుతున్నది. రింగు రోడ్డుకు మార్క్ పడింది మొదలు.. తండావాసులు తమ భూములు, ఇండ్లు పోతాయంటూ భయందోళనలకు గురవుతున్నారు. తండాలోకి కొత్తవారు ఎవరు వచ్చినా.. ట్రిపుల్‌ఆర్ గురించేనా? అంటూ ఆందోళనతో వాకబు చేస్తున్నారు. ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్పు విషయమై గురువారం 'నమస్తే తెలంగాణ' బృందం తండాకు వెళ్లి గిరిజనులతో మాట్లాడేందుకు ప్రయత్నించింది. ఒకరిద్దరితో మాట్లాడుతుండగానే తండావాసులు గుంపుగా వచ్చి.. 'మా తండాకు ఎవరెవరో కొత్తవాళ్లు ఎందుకు వస్తున్నరు? వెళ్లిపోండి..! భూములు, ఇండ్లు అన్నీ పోతయ్. నెలరోజుల నుంచి తండాలో అందరం సరిగా నిద్ర కూడా పోతలేము' అని ఆగ్రహం వ్యక్తంచేశారు. ట్రిపుల్ ఆర్ గురించి మాట్లాడటానికి తండాకు ఎవరు వచ్చినా ఊరుకునేది లేదని హెచ్చరించారు. అలైన్‌మెంట్ గురించి రోజుకో కొత్త కథ చెప్తున్నారని అగ్రహం వ్యక్తంచేశారు.

సన్న, చిన్నకారు రైతులే అధికం

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగంలో ప్రతిపాదించిన అలైన్‌మెంట్‌ను మార్చడంతో ఆమనగల్లు, తలకొండపల్లి మండలాల ప్రజలు, రైతులు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం ప్రకటించిన కొత్త అలైన్‌మెంట్‌లో అధిక శాతం సాగు భూములే ఉండగా.. అందులో సన్న, చిన్నకారు రైతుల భూములే అధికం. ఎకరం, రెండు ఎకరాలను సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్న రైతులకే అలైన్‌మెంట్ మార్పుతో తీవ్ర నష్టం జరుగుతున్నది. ఆలైన్‌మెంట్ మార్పుతో భూస్వాములకు, పెద్ద రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగటం లేదని, గత ప్రభుత్వం ప్రతిపాధించిన అలైన్‌మెంట్ అందరికీ అమోదయోగ్యంగా ఉన్నది గుడితండావాసులు చెప్తున్నారు.



తండాలో నుంచి రోడ్డు పోతే ఎలా?

మేము కొన్ని తరాలుగా ఈ తండాలోనే ఉంటున్నం. ఉన్న కొద్దిపాటి భూములను సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నం. ట్రిపుల్ ఆర్ మార్క్‌ను తండా సమీపంలో వేయడంతో భూములు, ఇండ్లు కోల్పోతామని మా తండా భయపడుతున్నది. రెడ్ మార్క్ భయంతో అందరూ నిరాశలో ఉన్నరు. కొత్తవాళ్లు ఎవరైనా ఊరికి వస్తే ప్రజలు ఆందోళనకు గురవుతున్నరు. ప్రభుత్వం పాత అలైన్‌మెంట్‌నే కొనసాగించి తండాను కాపాడాలె.

- ముడావత్ రాజు, గుడితండా (ఆమనగల్లు మండలం)



సర్వేల్‌లో ట్రిపుల్-ఆర్ కలకలం

- మార్కింగ్‌పై రైతుల మండిపాటు
- అలైన్‌మెంట్‌మార్పుపై ఆర్డీవోకు ఫోన్
- తెలియకుండానే సర్వే: అధికారి

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, సెప్టెంబరు 19 (నమస్తే తెలంగాణ)/సర్వేల్: ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగంలోని అనేక గ్రామాల్లో ఇప్పుడు కలకలం, కలవరం కొనసాగుతున్నది. పాత అలైన్‌మెంట్ ఎక్కడినుంచి వెళ్తుందనేది గతంలోనే రైతులకు తెలుసు. అందులో అత్యధికం ప్రభుత్వ భూములే. కానీ, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగైదు కిలోమీటర్ల మేర రీజనల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను జరపడంతో అత్యధికంగా సన్న, చిన్నకారు రైతుల భూములే బలికానున్నాయి.

కొత్త అలైన్‌మెంట్ తమ భూముల నుంచి వెళ్తుండటంపై రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం యాదాద్రి-భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం సర్వేల్ గ్రామ పరిధిలో ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ ఖరారులో భాగంగా సర్వే నిర్వహించారు. వాస్తవానికి గతంలో అక్కడికి దాదాపు నాలుగున్నర కిలో మీటర్ల దూరంలోని కంకణాలగూడెం సమీపంలో మార్క్ చేశారు. కానీ ఇప్పుడు సర్వేల్-లింగారెడ్డిగూడెం మధ్యలోకి దాన్ని మార్చారు. దీంతో ఆ అలైన్‌మెంట్ వల్ల భూమిని కోల్పోవాల్సి వస్తుందనే భయంతో కొందరు రైతులు చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్‌రెడ్డికి ఫోన్ చేశారు. గతంలో అలైన్‌మెంట్‌ను ఎందుకు మారుస్తున్నారు? అని సంప్రదిస్తే... అసలు ఆ సర్వే తమకు సంబంధం లేకుండానే జరుగుతున్నదని ఆర్డీవో సమాధానమివ్వడంతో రైతులు విస్తుపోయారు. అధికారులకు తెలిసే తాము సర్వే చేస్తున్నట్టు సర్వేబృందం చెప్తుండగా.. రెవెన్యూ అధికారులు మాత్రం తమకు అలాంటిదేమీ తెలియదని అంటున్నారు. కాగా దీనిపై 'నమస్తే తెలంగాణ' కూడా ఆర్డీవో శేఖర్‌రెడ్డికి ఫోన్ చేయగా.. ఆ సర్వేతో తమకు సంబంధం లేదని చెప్పారు. ఆ విషయాన్నే రైతులకు కూడా చెప్పానని సమాధానమిచ్చారు.



పాత అలైన్‌మెంట్‌నే కొనసాగించాలి

మా కుటుంబానికి గర్విపల్లి గ్రామ రెవిన్యూ పరిధిలో 20 ఎకరాల భూమి ఉన్నది. అందులో 6 బోర్లతో వ్యవసాయం చేసుకుంటున్నం. ట్రిపుల్ ఆర్ కొత్త అలైన్‌మెంట్‌కు సంబంధించిన మార్కింగ్‌ను మా భూముల పక్కనే శారు. దీంతో దాదాపు 15 ఎకరాల భూమి నష్టపోతున్నం. అలైన్‌మెంట్ మార్పుతో మా కుటుంబానికి ఇబ్బందులు తప్పేలా లేవు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ప్రతిపాదించిన పాత అలైన్‌మెంట్‌నే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలి.

-తిరుమణి యాదయ్యగౌడ్, ఖానాపూర్ (తలకొండపల్లి మండలం)



మా భూములు, మా ఇండ్లను రక్షించాలి

కొన్ని వందల ఏండ్లుగా మా తాతలు, తండ్రులు నివాసము ఊరిది. ట్రిపుల్ ఆర్ మార్కింగ్‌తో తండా మొత్తం పోతదనే షాక్ నుంచి ఇంకా బయటపడ్డలేం. భూములు, ఇండ్లు కోల్పోతే మా బతుకులు సాగేదెట్ల? ట్రిపుల్‌ఆర్ కొత్త అలైన్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకొని మా భూములు, మా ఇండ్లను రక్షించాలి.

- ముడావత్ దశరథం, గుడితండా (ఆమనగల్లు మండలం)



పేద ప్రజల పొట్ట కొట్టొద్దు

ఖానాపూర్‌లో నాకు ఎకరం అసైన్డ్ భూమి ఉన్నది. దాని తోనే కుటుంబాన్ని పోషించుకుంటున్న. ఇప్పుడు ట్రిపుల్ ఆర్ మార్కింగ్ నా భూమి పక్కనే వేసింద్రు. ఉన్న ఒక్క ఎకరం భూమి కూడా రోడ్డులో పోతే మేమెట్ల బతాకాలె? మాలాంటి చిన్న రైతుల గురించి సర్కారు ఆలోచించాలెగదా!


- వెంకటయ్య. ఖానాపూర్ (తలకొండపల్లి మండలం)



తండాను కాపాడండి

ట్రిపుల్ ఆర్‌కు సంబంధించిన తండాకి అతి దగ్గరలో వేయడంతో భయంతో రోజులు గడుపుతున్నం. తండాలో సంవత్సరాలుగా వ్యవసాయాన్ని నమ్ముకుని బతుకును వెళ్లదీస్తున్నం. తండాకి ఎప్పుడు ఏ అధికారి వస్తడో, ఏం చెప్పి వెళ్తాడోనని అందరం భయపడుతున్నం. మార్క్ వేసినప్పటి నుంచి బాధపడని రోజు లేదు. ప్రతిరోజు చస్తూ బతుకుతున్నం.

- ముడావత్ సాలి, గుడితండా (ఆమనగల్లు మండలం)



మా బతుకులు ఆగమైతున్నాయి

ఉన్న రెండు ఎకరాలు సాగు చేసుకుంటూ మేం బతుకుతున్నం. మా భూమి పక్కన ట్రిపుల్ ఆర్ రోడ్డుకు సంబంధించిన మారింగ్ వేయడంతో ఎకరం భూమిని నష్టపోతున్నం. ఉన్న కొద్దిపాటి భూమిలో రోడ్డేస్తే మేమెట్ల బతకాలె? భూమి పోతే కుటుంబాన్ని ఎట్లా పోషించాలె? రైతులకు నష్టం చేసే ఆలోచనను ప్రభుత్వం ఇప్పటికైనా వెనక్కి తీసుకోవాలి

- బండారు పార్వతమ్మ, గర్విపల్లి (తలకొండపల్లి మండలం)

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

దాచేస్తే దాగని సత్యం

అలవికాని హామీలతో అధికారం చేజిక్కించుకున్న కొత్తలో కాంగ్రెస్ పాలకులు ఇదివరకటి బీఆర్ఎస్ పాలన మీద బురద జల్లాలని చూశారు. రాష్ట్రం అప్పులతో దివాళా తీసిందని, ఖాళీ ఖజానాను చేతికిచ్చి వెళ్లిపోయారని బీద అరుపులు అరిచారు. కానీ, ప్రగతి, సంక్షేమాలకు సమ ప్రాధాన్యం ఇచ్చిన ప్రథమ ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రాన్ని కొత్తపుంతలు తొక్కిస్తూ నడిపిన అద్వితీయ పాలన చరిత్రలో నమోదైంది. రికార్డులు, అవార్డులు ఇందుకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ఇదంతా మూసిపెడితే మాయమయ్యేదా? ఎవరి నుంచైతే దొంగిలించామో వారిని ఎన్నటికీ క్షమించలేమని అంటారు పెద్దలు. సీఎం రేవంత్ ఇదే తీరులో మాట్లాడేవారు. పదేండ్లలో తెలంగాణ అభివృద్ధి సాధించిందని ఒప్పుకుంటే ఎక్కడ కేసీఆర్ ప్రతిభా పాటవాలను ప్రశంసించినట్టు అవుతుందోనని ఆయన వెనుకాడేవారు. కానీ, కేంద్రం నుంచి వెలువడుతున్న నివేదికలు రాష్ట్ర ప్రగతిని వేనోళ్ల పొగుడుతుంటే రేవంత్ మాత్రం ఏం చేయగలరు? మాటమార్చి రాష్ట్ర ఆర్థికస్థితి సవ్యంగానే కాదు, దివ్యంగా కూడా ఉన్నట్టు నసుగుతూ అయినా చెప్పక తప్పలేదు. కాదు కాదన్నవారే ఔననేలా చేస్తుంది సత్యం. అదీ సత్యానికున్న శక్తి. దాచిన కొద్దీ ఎగదన్నుకు రావడం దాని నైజం.

ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి (ఈఏసీ-పీఎం) విడుదల చేసిన తాజా నివేదిక కాంగ్రెస్ కల్లబొల్లి మాటల గాలి తీసేసింది. వయసులో అతిచిన్న రాష్ట్రం అభివృద్ధిలో అంగలు వేసినట్టు ఆ నివేదిక చాటిచెప్పింది. ఒకరకంగా చెప్పాలంటే సుమారు తొమ్మిదిన్నరేండ్ల బీఆర్ఎస్ పాలనకు ఆ నివేదిక మెరిట్ సర్టిఫికెట్ లాంటిది. కేసీఆర్ హయాంలో తలసరి ఆదాయంలో, జీఎస్డీపీలో రాష్ట్రం దూసుకుపోయింది. టాప్-10 రాష్ట్రాల్లో తెలంగాణ అగ్రగామిగా నిలిచింది. ఈ క్రమంలో తలసరిలో జాతీయ సగటు కన్నా ఏకంగా 94 శాతం ఆధిక్యం సాధించడం విశేషం. ఇక రాష్ట్రం ఏర్పడిన నాటికి రూ.5.05 లక్షల కోట్లుగా ఉన్న జీఎస్డీపీ.. 2023-24 నాటికి మూడింతలు పెరిగి రూ.14.64 లక్షల కోట్లకు చేరింది. ఇది బీఆర్ఎస్ పాలనలో జరిగిందని ప్రత్యేకించి చెప్పాల్సిన పని లేదు.

ఇవి బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అంగీకరించి, ఆవిష్కరించిన గణాంకాలు. ఇక తాజాగా రాష్ట్ర ప్రభుత్వం మధ్య, చిన్నతరహా పరిశ్రమల విధాన పత్రంలో కేసీఆర్ హయాంలో సాధించిన ప్రగతిని ప్రశంసించడం గమనార్హం. పదేండ్లలో ఎంఎస్ఎంఈలు 15 శాతం వృద్ధి సాధించాయని స్వయంగా కాంగ్రెస్ సర్కార్ చెప్పిందంటే.. బీఆర్ఎస్ పాలనలో జరిగిన ముందంజను ముచ్చటగా ఒప్పేసుకోవడమే కదా! కరోనా కల్లోలం ఫలితంగా మూతబడిన ఎంఎస్ఎంఈల సంఖ్య రాష్ట్రంలో అతి తక్కువగా ఉండటం గురించి కూడా విధాన పత్రంలో ప్రస్తావించారు. దీనికి కేవలం కేసీఆర్ పరిపాలనా పటిమ, దార్శనికత కారణమని ఎవరైనా చెప్పక తప్పదు. కాంగ్రెస్ పాలకులకు కొంచెం ఎక్కువ సమయం పట్టింది. అంతే తేడా.

బీసీల కోసం బీఆర్ఎస్ పోరుబాట

తెలంగాణ బీసీ స్వీయ రాజకీయ అస్తిత్వం రాజకీయ ప్రక్రియ రూపం సంతరించుకున్నది. అది మహత్తర ఉద్యమమై తెలంగాణ నేలపై విజృంభించబోతున్నది. మునుపెన్నడూ లేనివిధంగా బీసీలలో పెల్లుబుకుతున్న నిరసనలు కార్యరూపంగా మారి బలమైన ఉద్యమంగా ముందుకు సాగేందుకు రంగం సిద్ధమైంది. ఈ ఉద్యమాన్ని బీఆర్ఎస్ తన భుజాల మీద వేసుకొని సాగేందుకు నిర్మాణాత్మక రూపాన్ని రచిస్తున్నది.



జూలూరు గౌరీ శంకర్



రేపటి తెలంగాణలో జరుగబోయే భారీ రాజకీయ మార్పులకు బీఆర్ఎస్ శ్రీకారం చుట్టబోతున్నది. తెలంగాణ స్వీయ రాజకీయ అస్తిత్వం పరిపూర్ణం కావాలంటే బీసీ స్వీయ రాజకీయ అస్తిత్వాన్ని నిలపాలి. ఆ పనిని బీఆర్ఎస్ మాత్రమే చేయగలదు. స్థానిక సంస్థల్లో సమ వాటాగా 42 శాతం రిజర్వేషన్లు బీసీలకు ఇస్తామని చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ ఈ పని చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు పోకూడదు. దానికి ముందే కులగణన చేయాలి. నామమాత్రంగా చేస్తే బీసీలు ఒప్పుకోరు. ఓటరు లిస్టు ఆధారంగా కులగణన చేసి 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వటం సాధ్యం కాదు. సమగ్ర కులగణనను జరపటానికి డెడికేటెడ్ కమిషన్‌ను నియమించామని చెప్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఆ పని యుద్ధ ప్రాతిపదికన జరపాలని బీసీ సామాజిక వర్గాలు చేస్తున్న డిమాండ్‌కు బీఆర్ఎస్ కొండంత అండగా నిలుస్తూ శపథం తీసుకున్నది. ఇది ఆహ్వానించదగిన పరిణామం.

2024, సెప్టెంబర్ 18న తెలంగాణ భవన్‌లో జరిగిన బీసీ సమావేశంలో 'తెలంగాణ రాజకీయాలను మార్చే కీలక సమావేశంగా చరిత్రలో ఇది నిలిచిపోతుంది' అని కేటీఆర్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికలకు ముందు ఓ చానల్‌కు ఇచ్చిన నాలుగున్నర గంటల సుదీర్ఘ ఇంటర్వ్యూలో తెలంగాణ స్వీయ రాజకీయ అస్తిత్వం అన్నది తమిళనాట స్థానికతతో నిలిచిన డీఎంకే అస్తిత్వం లాంటిదేనని కేసీఆర్ చెప్పారు. సరిగ్గా ఆ అంశాన్ని బీఆర్ఎస్ రాజకీయ పునాదిగా చేసుకుని ముందుకు సాగే కార్యాచరణ ప్రణాళికను తయారు చేస్తున్నట్టు కేటీఆర్ కూడా బహిర్గతం చేశారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు జరిపేందుకు నవంబర్ 10 వరకు కేటీఆర్ గడువునిచ్చారు. ఆ తర్వాత స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల కోసం సమరం కొనసాగుతుందన్న మాట. ఈ సమావేశం ఓట్ల కోసమో, సీట్ల కోసమో, రాజకీయ పార్టీగా తమ అస్తిత్వం కోసమో జరిగింది కాదు, బీసీల ఆకాంక్షలను నెరవేర్చేందుకే అన్నది తేటతెల్లమవుతున్నది. తరతరాలుగా బీసీలు ఎదుర్కొంటున్న సమస్యల నుంచి విముక్తి కోసం ఏం చేయాలనే దానికి సుదీర్ఘ సమాలోచనలు జరపాలని బీఆర్ఎస్ నిర్ణయం తీసుకున్నది. ఈ సందర్భంగా బీసీల బాధలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలను అట్టడుగు నుంచి క్షేత్రస్థాయిలో పరిశీలించి వారి జీవన స్థితిగతులను తెలుసుకోవాలి. అందుకు బీసీ నేతలే క్షేత్రస్థాయికి వెళ్లాలి. బీసీల విముక్తికి ఏమేం చేయాలో నివేదికలు తయారు చేయాలి.

ఒక దశలో 'ఇది ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమం కాదు. బీసీల జీవన ప్రమాణాలు పెంచేందుకు సరైన పరిష్కార మార్గాలను తవ్వితీసే పరిశోధన కేంద్రంగా తెలంగాణ భవన్‌ను సిద్ధం చేసే ప్రక్రియ' అని కేటీఆర్ పేర్కొన్నారు. అంటే, బీసీలు ఓట్లేసే యంత్రాలు కాదని, తెలంగాణ సమాజాన్ని నడిపించే ఉత్పత్తి శక్తులని, వారి అభివృద్ధి జరగకుండా తెలంగాణ అభివృద్ధి జరగదని బీఆర్ఎస్ విశ్వసించే కార్యక్షేత్రంలోకి దూకుతున్నదనే విషయం స్పష్టమవుతున్నది.

> **కులగణనతో బీసీ వర్గాలకు సామాజిక న్యాయం జరగాలంటే తమిళనాడులో అంబాశంకర్ కమిషన్, జస్టిస్ తిరు ఎంఎస్ జనార్దనమ్ చేసిన సర్వేలాగా లోతుగా అధ్యయనం చేయాలి. పంచాయతీ ఎన్నికలను జరిపించేందుకు హడావుడిగా బీసీ కులగణన చేయకుండా భవిష్యత్తులో కోర్టుల్లో నిలిచి, గెలిచేలా సమగ్ర కులగణన చేయవలసిన అవసరం ఉన్నది.**

స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ చెప్పింది. ఆ హామీ నెరవేర్చేదాకా బీఆర్ఎస్ పోరుబాట కొనసాగుతూనే ఉంటుంది. బీసీ రిజర్వేషన్ల చట్టబద్ధతకు సంబంధించిన ఇప్పటివరకు వెలువడిన న్యాయస్థానాల తీర్పులను తెలంగాణ సమాజం ముందు పెట్టేందుకు బీఆర్ఎస్ పరిశోధిస్తున్నది. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు 50 శాతం దాటకూడదని అనేక తీర్పుల్లో ఉన్నది.

ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ పరిశోధన ఉపయోగపడనున్నది. 1959లో మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ అమల్లోకి వచ్చినప్పటి నుంచి బీసీలు వెనుకబడిపోయారు. బీఆర్ఎస్ ఈ లెక్కలన్నీ బయటకుతీసే పనికి పూనుకున్నది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు 90 శాతంగా ఉన్న రాష్ట్రంలో వారి జనాభా దామాషా పద్ధతిలో రిజర్వేషన్లు, సీట్లు దక్కాలి. దాన్ని చట్టబద్ధంగా అమలు చేయడం సాధ్యం కాదు. కోర్టు తీర్పులు అందుకు అడ్డవస్తాయి. దీనికోసం రాజ్యాంగ సవరణ చేయక తప్పదు. రాష్ట్రంలో 12,966 గ్రామ పంచాయతీలుంటే అందులో 1,14,620 వార్డులున్నాయి. రాష్ట్ర ఎన్నికల కమిషన్ చెప్పిన వివరాల ప్రకారం నల్లగొండ జిల్లాలో అత్యధికంగా 868 పంచాయతీలుండగా, మేడ్చల్ జిల్లాలో తక్కువ సంఖ్యలో పంచాయతీలున్నాయి. అదే విధంగా చూస్తే నల్గొండ జిల్లాలో 7,842 వార్డులుండగా, మేడ్చల్‌లో అతి తక్కువ వార్డులున్నాయి. స్థానికసంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు ఖరారు చేసే విషయం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నదని చెప్తున్నప్పటికీ సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు కలిపి 50 శాతం రిజర్వేషన్లు దాటకుండా చూడాలి. ఒకవేళ క్షేత్రస్థాయిలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు జనాభాను బట్టి రిజర్వేషన్లు ఇవ్వాలంటే ట్రిపుల్ టెస్ట్ ద్వారా సర్వే చేసి ఖరారు చేయాలి. అది పంచాయతీ యూనిట్‌గా జరగాలి. చివరగా సుప్రీం మార్గదర్శకాలు అతిక్రమించకుండా చూసుకోవాలి. ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్ బీసీలను కలుపుకుపోయే గురుతర బాధ్యతను భుజాలపై వేసుకొని ముందుకు సాగుతున్నది. ఇందుకు క్షేత్రస్థాయిలో బీసీలను సన్నద్ధం చేస్తున్నది.

ఈ విషయమై బీసీ వర్గాల ప్రజలకు సంపూర్ణ అవగాహన కల్పించాలి. 42 శాతం ఇస్తామని ఏ విధంగా బీసీ డిక్లరేషన్ ఇచ్చి కాంగ్రెస్ ఓట్లడిగిందో, ఆ విధంగా అమలు చేసి చూపాలి. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ అమలు కోసం ముందుండి పోరు సలుపుతున్న ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ వెంటే ప్రతి బీసీ బిడ్డ నడవాల్సిన సమయం ఇది.

(వ్యాసకర్త: తెలంగాణ తొలి బీసీ కమిషన్ సభ్యులు)



దామగుండం పోతే యమగండమే



స్వర్ణ కిలారి

దామగుండం రామలింగేశ్వర స్వామి దర్శనమైన తర్వాత ముందు రచించుకున్న ప్రణాళిక ప్రకారం మా స్నేహితుల బృందం అక్కడున్న ఆశ్రమంలో స్వామీజీని కలవాలనుకున్నాం. కొన్ని వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న కేరళ నుంచి 1980లో హైదరాబాద్‌కు 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న పూడూరు గ్రామానికి వలస వచ్చారట స్వామీజీ. గ్రామస్థుల ద్వారా ఆయన ఫోన్ నెంబర్ తెలుసుకొని మాట్లాడి, చెప్పిన సమయానికి ఆయన ఉండే ఆశ్రమానికి బయల్దేరాం. ఆశ్రమం అంటే వందల, వేల ఎకరాల్లో ఆడంబరంగా ఉండి చుట్టూ మందీమార్బలంతో ఉండేది కాదు. రెండు ఎకరాల్లో ఉన్న చిన్న రెండు గదుల ఇల్లు మాత్రమే.

అనుకున్నట్టుగానే సుమారు 50 ఏండ్లు పైబడిన ఆయన అపారమైన జ్ఞానంతో వచ్చిన తేజస్సుతో కాబోలు, కాషాయ వస్త్రాల్లో వెలిగిపోతున్నారు. 'మీకేం కావాలి' అని ఆయనే మమ్మల్ని అడిగారు. 'దామగుండం అడవి గురించి, అక్కడ కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన రాడార్ స్టేషన్ ప్రాజెక్టు గురించి, ఇక్కడున్న వృక్ష సంపద గురించి, నిర్వాసితుల గురించి, లాభనష్టాల గురించి చెప్పండి' అని అడిగాం. 'మీకు అడవి వద్దా?' అన్న ఆయన సూటి మాట నిజంగా గుండెలను తాకింది. అందరం ఒక్క క్షణం పాటు మౌనంగా ఉండిపోయాం. గలగల పారే సెలయేరులా ఆయన చెప్పుకుంటూ పోయారు.

మొత్తం 2,900 ఎకరాల అటవీ భూమిలో యాంటెన్నా పార్క్ 1400 ఎకరాలు, టెక్నికల్ ఏరియా 1090 ఎకరాలు, కార్యాలయం 310 ఎకరాలు, రేడియేషన్ సేఫ్ జోన్ 100 ఎకరాలుగా స్వామీజీ పేరొన్నారు. ఒక సంవత్సరంలో ఒక చెట్టు లక్ష లీటర్ల ఆక్సిజన్ ఇస్తుందని, ఈ రాడార్ స్టేషన్ కోసం 12 లక్షల చెట్లను కొట్టివేస్తే పర్యావరణానికి భారీ నష్టం వాటిల్లుతుందని ఆయన వివరించారు. మూసీకి వరప్రదాయిని అయిన దామగుండాన్ని కాపాడుకోకపోతే, 2800 మీటర్ల లోతు వరకు భూగర్భ జలాలు కూడా కలుషితమవుతాయని, దాని ప్రభావం హైదరాబాద్ మీదనే కాక యావత్ తెలంగాణ సమాజం మీద, వనరుల మీద, ప్రజల ఆరోగ్యం మీద తీవ్రమైన ప్రభావాన్ని చూపుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

> **ఈ దామగుండం అడవి కొన్ని లక్షల చెట్లకు నెలవు. జింకలు, తోడేళ్లు, మనుబోతులు, అడవి పందులు, అనేకరకాల పక్షులకు ఆలవాలమైన ఈ అడవి జీవవైవిధ్యంతో అలరారుతున్నది. అంతేకాకుండా ఈ అడవి ఎన్నోరకాల అరుదైన, ఔషధ మొక్కలకు కూడా ప్రసిద్ధి. వికారాబాద్ జిల్లా పూడూరు మండలంలోని దామగుండం రిజర్వ్ ఫారెస్ట్‌లో నిర్మిస్తున్న ఈ రాడార్ స్టేషన్‌ను పలు పర్యావరణ సంస్థలు, గ్రామ ప్రజలు, ఉద్యమకారులు కూడా వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. 'సేవ్ దామగుండం' అనే నినాదాన్ని తీసుకొని ఈ అటవీ భూముల రక్షణకు స్థానిక ప్రజానీకం ప్రయత్నాలు ప్రారంభించారని తెలిపారు.**

భారత నౌకాదళ సంస్థ దామగుండం అటవీ ప్రాంతంలో రూ.2500 కోట్లతో తక్కువ ఫ్రీక్వెన్సీ రాడార్ వ్యవస్థను నెలకొల్పాలని యోచిస్తున్నది. ఈ ప్రాజెక్టు ప్రతిపాదన పన్నెండేండ్లుగా ఉన్నా, తెలంగాణ ఏర్పడినాక ఒక దశాబ్దం పాటు కేసీఆర్ ప్రభుత్వం ఆ ప్రాజెక్టుకు సహకరించలేదు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఒక్కసారిగా ప్రాజెక్టు పనులు ఊపందుకున్నాయి. దామగుండం అటవీ భూములను, భారత నౌకాదళ సంస్థకు కట్టబెట్టాలన్న ఆలోచనను విరమించుకోవాలని ఇటీవలే నేషనల్ అలయెన్స్ ఆఫ్ పీపుల్స్ మూవ్‌మెంట్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరిందట. 'మరి ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ప్రజలంతా సంఘటితమవుతున్నారా' అని అడిగిన ప్రశ్నకు 'కొందరు ప్రజలు అమాయకులు. వారు రాజకీయ నాయకుల తాత్కాలిక వాగ్దానాలను నమ్ముతున్నారు. బయటకు పోవాల్సిన అవసరం లేకుండా కొన్ని ఎకరాల్లో వాళ్లకు మార్కెట్ కట్టిస్తామని, బడి కట్టిస్తామని, ఉద్యోగ కల్పన చేస్తామని, 27 కిలోమీటర్ల మేర రోడ్డు ఏర్పాటు చేస్తామని మాట ఇచ్చారట. ఇది ఎంతవరకు సాధ్యమవుతుందో' అని నిర్వేదంగా సమాధానం ఇచ్చారు. త్వరలో తనకున్న రెండు ఎకరాలను అమ్ముకొని శాశ్వతంగా ఈ ప్రదేశాన్ని వదిలి వెళ్లిపోతున్నాను అంటున్నప్పుడు ఆయన కళ్లల్లో చిన్నతడి. అయినా అది కనపడనివ్వకుండా, 'మీరంతా ఒక సాయం చేయాలి, మనందరం కలిసి ఒక మానవహారం వంటి నిరసన కార్యక్రమం చేస్తేనే ప్రభుత్వాలకు, న్యాయవ్యవస్థకు, నౌకాదళానికి మన వేదన అర్థమై ఈ ప్రాజెక్టు వెనుకకు వెళ్తుందేమో' అనే చిరు ఆశను వ్యక్తం చేశారు.

ఈ మట్టికి, ఈ నేలకు, ఈ ప్రజలకు ఎటువంటి సంబంధం లేని ఎక్కడో పుట్టి పెరిగిన ఒక కేరళ మనిషిలో ఉన్న భవిష్యత్తు తరాలకు ఏదో చేయాలనే తపనను చూస్తే మాలో ఏదో తెలియని అపరాధభావంతో కూడిన భావోద్వేగపు చెమ్మ కలిగింది. చివరగా 'దామగుండం పోతే యమగండం' తప్పదు అన్న ఆయన మాటలు విన్నాక చివుక్కుమన్న మనసుతో ఆ మహా మనీషికి ప్రణామాలు అర్పించి భారమైన మనసుతో వీడ్కోలు చెప్పాం. దామగుండం అడవుల్లో లక్షలాది అరుదైన వృక్షాలను, ఔషధ మొక్కలను, జంతుజాలాన్ని పణంగా పెట్టే ఈ నేవీ రాడార్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న ప్రజల పోరాటం సఫలం కావాలని ఆకాంక్షిస్తున్నాను.

ప్రాంతీయ అస్తిత్వానికి ప్రమాదం

'ఒకే దేశం-ఒకే ఎన్నిక' వినడానికి నినాదం బాగుంటుంది. చెప్పుకోవడానికి కూడా కొన్ని మంచి మార్పులు కనిపిస్తాయి. సువిశాల భారతదేశంలో ఎప్పుడూ ఎక్కడో ఒకచోట ఎన్నికలు జరుగుతూనే ఉంటాయి. ఎన్నికలు జరిగినప్పుడు కోడ్ అమల్లో ఉంటుంది కాబట్టి అక్కడ పనులు నిలిచిపోతాయి. అలా కాకుండా పంచాయతీలకు మొదలుకొని అసెంబ్లీకి, పార్లమెంట్‌కు ఒకేసారి ఎన్నికలు జరిగితే ఓ రెండు నెలల్లో కోడ్ ముచ్చట ముగిసి దేశం అభివృద్ధి పథంలో దూసుకువెళ్లడానికి దేశమంతా ఒకేసారి జరిగే ఎన్నికలు ఉపయోగపడతాయి. ఇదొక కోణం.



బుద్దా మురళి

ఎప్పుడూ దేశంలో ఎక్కడో ఒకచోట ఎన్నికలు జరగడం, ప్రచారం, రాజకీయ విమర్శలు, ఆరోపణలతో అభివృద్ధి నిలిచిపోతుందనే వాదన నిజమే. కానీ, ఒకేసారి ఎన్నికల వల్ల రాష్ట్రాలు తమ ప్రాధాన్యాన్ని కోల్పోతాయి. ఇది సమాఖ్య దేశం. భిన్న మతాలు, భిన్న భాషలు, భిన్న సంస్కృతులతో భిన్నత్వంలోనే ఏకత్వంతో సాగుతున్న దేశం. గతంలో జరిగిన ఎన్నికల పరిణామాలను బట్టి చూస్తే ఒకేసారి రాష్ట్ర శాసనసభకు, పార్లమెంట్‌కు ఎన్నికలు నిర్వహించడం వల్ల రాష్ట్రాలు తమ అస్తిత్వాన్ని కోల్పోతాయి. కులాలు, ప్రాంతాలు, భాష పేరుతో కాకుండా హిందూత్వ పేరుతో దేశం ఏకంగా ఉండాలని బీజేపీ కోరుకుంటున్నది. హిందూత్వ ఓటు బ్యాంకు ద్వారా శాశ్వతంగా అధికారంలో ఉండాలనేది బీజేపీ లక్ష్యం. ఒకే దేశం-ఒకే ఎన్నిక, ఒకే భాష నినాదాలు బీజేపీకి రాజకీయంగా ప్రయోజనం కలిగించేవి. అదే సమయంలో రాష్ట్రాలు ప్రత్యేకత కోల్పోయే ప్రమాదం ఉన్నది. బీజేపీ, మిత్రపక్షాల మద్దతుతో మెజారిటీ సాధించినందున తాను కోరుకున్నది బీజేపీ అమలుచేస్తున్నది. చంద్రబాబు ఉమ్మడి రాష్ట్రం ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కేంద్రంలో ఫ్రంట్ రాజకీయాలు జోరుగా సాగేవి. బాబు ముఖ్యమంత్రిగా కేంద్రంలో చక్రం తిప్పేవారు. రాష్ట్రాలు బలంగా ఉండి, కేంద్రం బలహీనంగా ఉండాలని వాదించేవారు. ఇప్పుడు బీజేపీ కూటమిలో ఉన్న బాబు రాష్ట్రాలను బలహీనపరిచి కేంద్రాన్ని మరింత బలంగా తయారుచేసే ఒకే దేశం ఒకే ఎన్నికలను సమర్థిస్తున్నారు. వేదాంత కంపెనీ మహారాష్ట్రలో రూ.లక్ష కోట్ల పెట్టుబడి గల సెమీ కండక్టర్ పరిశ్రమకు శంకుస్థాపన చేసిన తర్వాత కూడా మోదీ ప్రభుత్వం దాన్ని గుజరాత్‌కు తరలించింది. మహారాష్ట్రలో బీజేపీ కూటమే అధికారంలో ఉన్నది. అయినా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి. ఆయా రాష్ట్రాల్లో తమ పార్టీ గెలవాలనే ఉద్దేశంతో కనీసం ఎన్నికల సమయంలోనైనా రాష్ట్రాలకు కొన్ని వరాలు ప్రకటించేవారు.




ఒకేసారి ఎన్నిక వల్ల ఇక అలాంటి వరాలపై ఆశలు పెట్టుకోవలసిన అవసరం లేదు. పార్లమెంట్ ఎన్నికలకు, అసెంబ్లీ ఎన్నికలకు ప్రజలు భిన్నంగా స్పందిస్తారు. పార్లమెంట్ ఎన్నికలను దేశం కోణంలో చూస్తే అసెంబ్లీ ఎన్నికలను తమ రాష్ట్ర ప్రయోజనాల కోణంలో చూస్తారు. ఏడాదిన్నర కిందట ఎన్నికలు జరిగిన కర్ణాటక లో అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలో ఉన్న బీజేపీ ఘోరంగా ఓడిపోయింది. రాష్ట్రం లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఆరు నెలల తర్వాత జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ దెబ్బతిని బీజేపీ విజయం సాధించింది. తమిళనాడు వంటి రాష్ట్రాల్లో పార్లమెంట్ ఎన్నికలైనా, అసెంబ్లీ ఎన్నికలైనా తమ రాష్ట్రం తమకు ముఖ్యమని భావిస్తారు. పార్లమెంట్, అసెంబ్లీ ఏ ఎన్నికలైనా తమిళనాడులో తమిళ పార్టీల హవానే కానీ, జాతీయ పార్టీల హవా కనిపించదు. మిగిలిన రాష్ట్రా ల్లో అసెంబ్లీ ఎన్నికలకు ఒక తీరుగా, పార్లమెంట్ ఎన్నికలకు మరోవిధంగా ఓటర్లు స్పందించారు. పార్లమెంట్ ఎన్నికల్లో, అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు భిన్నంగా స్పం దిస్తారు, రెండూ ఒకేసారి వచ్చినప్పుడు తమకు నష్టం కలిగిందనే ఉద్దేశంతో 2004లో ఉమ్మడి రాష్ట్రంలో బాబు అసెం బ్లీ రద్దుచేసి ముందస్తుకు వెళ్లాలని చూశారు.

> **అసెంబ్లీ రద్దు నిర్ణయాన్ని సచివాలయంలో ఒకవైపు బాబు మీడియాకు వివరిస్తుండగానే ఢిల్లీలో ఎన్నికల కమిషన్ 'ఉమ్మడి రాష్ట్ర ఎన్నికలు ఇప్పుడు నిర్వహించం. పార్లమెంట్ ఎన్నికలతో పాటే నిర్వహిస్తాం' అని ప్రకటించింది. ఆ ఎన్నికల్లో కేంద్రంలో రాష్ట్రంలో కాంగ్రెస్ గెలిచింది. బాబు పార్టీ ఓడిపోయింది. ఇప్పుడు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కూటమిలో ఉండటం వల్ల ఒకేసారి ఎన్నికలు జరగడం తమకు మేలే అని టీడీపీ భావిస్తూ ఉండవచ్చు.**

ఇదేవిధంగా అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు వేర్వేరుగా జరిగితే తమకు ప్రయోజనం అని గతంలో టీఆర్ఎస్ ముందస్తు ఎన్నికలకు వెళ్లింది. 2018లో ఈ నిర్ణయం టీఆర్ఎస్‌కు కలిసివచ్చింది కూడా.

బీజేపీ, దాని మిత్రపక్షాలు జమిలి ఎన్నికలను స్వాగతిస్తుండగా బీజేపీ వ్యతిరేకపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి. గతంలో బీహార్ రాష్ట్ర ఎన్నికల్లో ఆ రాష్ట్రానికి లక్ష కోట్ల ప్రత్యేక ప్యాకేజీని మోదీ ప్రకటించారు. హామీని అమలుచేసినా, చేయకపోయినా పార్లమెంట్‌కు, అసెంబ్లీకి విడివిడిగా ఎన్నికలు జరిగినప్పుడు రాష్ట్రాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. ప్యాకేజీలు, వరాలు ప్రకటించాల్సి ఉంటుంది. ఆయా రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగినప్పుడు ఆ రాష్ట్రానికి తాము ఏం చేశాం, మళ్లీ గెలిస్తే ఏం చేస్తామని ప్రకటించాల్సి ఉంటుంది. ఓటర్లలో చర్చ రాష్ట్రం కేంద్రంగా సాగుతుంది. దీనివల్ల ఆ రాష్ట్రానికి ఎంతో కొంత మేలు జరుగుతుంది. జమిలి ఎన్నికల వల్ల దేశవ్యాప్త అంశమే తెరపైకి వస్తుంది కానీ, రాష్ట్రాల అంశాలకు, రాష్ట్రాల ప్రాధాన్యాలకు చోటుండదు. ఒక రకంగా రాష్ట్రాలు తమ ప్రత్యేకతను, ప్రాధాన్యాన్ని కోల్పోతాయి.



'వన్ ఎలక్షన్' సాధ్యం కాదు!



'వన్ నేషన్-వన్ ఎలక్షన్' అనేది ఆచరణ సాధ్యం కాని ప్రతిపాదన. మన దేశంలో ఉండే విభిన్న ఎన్నికల వ్యవస్థలోని సంక్లిష్టతలను ఇది విస్మరించింది. అంతేకాదు, సమాఖ్య వాదాన్ని కూడా విస్మరించింది. ప్రాంతీయ సమస్యలు, పాలనా ప్రాధాన్యాల్లో సమస్యల దృష్ట్యా లాజిస్టిక్ పరంగా ఇది సాధ్యం కాదు.

- ఎంకే స్టాలిన్, తమిళ నాడు ముఖ్యమంత్రి

దద్దరిల్లిన తెలంగాణ

• పాల బిల్లుల కోసం హైవే దిగ్బంధం..



విజయ డెయిరీ పాల బిల్లులు చెల్లించాలని నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల కేంద్రంలో గురువారం పాడి రైతులు హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిని దిగ్బంధించారు. ఈ సందర్భంగా పాలను పారబోసి నిరసన వ్యక్తం చేశారు. పాడి ఆవులు, గేదెలకు పశుగ్రాసం కొనలేక అప్పుల పాలవుతున్నామన్నారు. కాంగ్రెస్ అధికారం చేపట్టిన నాటి నుంచి రైతులను అరిగోస పెడుతున్నదని మండిపడ్డారు. పోలీసులు జోక్యం చేసుకొని ధర్నాను విరమింపజేశారు. కార్యక్రమంలో రైతులు విజేందర్‌రెడ్డి, రంగయ్య, యాకుబా, శేఖర్, దేవేందర్, నిరంజన్, ప్రసాద్‌రెడ్డి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. – వెల్దండ

• టీచర్ల కోసం రోడ్డెక్కిన విద్యార్థులు..



ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేస్తూ కుమ్రంభీం ఆసిఫాబాద్‌లోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు గురువారం రోడ్డెక్కారు. పాఠశాల నుంచి ర్యాలీగా వెళ్లి ప్రధాన రహదారిపై బైఠాయించారు. 850మంది విద్యార్థులున్న పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులతో చదువులెట్ల సాగించాలని మండిపడ్డారు. ఇన్‌చార్జి డీఈవో ఉదయబాబు, డీఎస్పీ కరుణాకర్, సీఐ సతీశ్ నచ్చజెప్పే ప్రయత్నం చేసినా విద్యార్థులు శాంతించలేదు. చివరికి కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే స్పందించి పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు తిరిగి వచ్చేందుకు ఆసక్తి చూపిస్తే వారినే నియమిస్తామని, లేదంటే తాత్కాలిక ఉపాధ్యాయులను కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ధర్నాకు డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చిరంజీవి మద్దతు తెలిపారు. – ఆసిఫాబాద్ టౌన్

• లాభాల్లో వాటా చెల్లించాలి..



సింగరేణికి 2023-24లో వచ్చిన లాభాలను ప్రకటించి 35శాతం వాటాను నెలాఖరు వరకు కార్మికులకు చెల్లించాలని టీబీజీకేఎస్ నాయకులు డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లా రామగుండంలోని మూడు డివిజన్లలో గురువారం ఆందోళనలు చేశారు. సింగరేణిలో ఎప్పుడూ లేనివిధంగా 70మిలియన్ టన్నుల రికార్డు స్థాయిలో బొగ్గు ఉత్పత్తి జరిగిందని, ఆర్థిక సంవత్సరం గడిచి ఆరు నెలలు దాటినా వాస్తవ లాభాలను ప్రకటించడంలో యాజమాన్యం విఫలమైందన్నారు. అనంతరం జీఎంలకు వినతిపత్రాలు అందజేశారు. – గోదావరిఖని

• జీతాల కోసం సెల్ టవర్ ఎక్కి..



మూడు నెలల నుంచి జీతాలు ఇస్తలేరు. ఇట్లయితే ఎట్ల బతికేది.. కుటుంబాన్ని ఎట్ల సాకేదని ఆవేదనకు గురైన ఓ పారిశుద్ధ్య కార్మికుడు సెల్ టవర్ ఎక్కాడు. కామారెడ్డి జిల్లా బీబీపేట్ మండలం ఇస్సానగర్‌లో వేతనాలు ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ జీపీ కార్మికుడు కొమ్ము రాజు గురువారం టవర్ ఎక్కాడు. రెండు గంటలకుపైగా అక్కడే ఉన్నాడు. తోటి కార్మికులు, గ్రామస్తులు నచ్చజెప్పడంతో కిందకు దిగొచ్చాడు. వారం, పదిరోజుల్లో జీతాలు చెల్లిస్తామని ఎంపీవో కృష్ణ తెలిపారు. – బీబీపేట్

• పని ఒత్తిడి తగ్గించాలి..



సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మహబూబాబాద్ కలెక్టరేట్ ఎదుట ఆశ వర్కర్లు గురువారం ధర్నా నిర్వహించారు. ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాసు మాధవి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఉపేందర్ మాట్లాడుతూ పారితోషికంలేని పనులు చేయించడంతో ఆశ కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారని, పని ఒత్తిడితో మానసిక క్షోభకు గురవుతున్నారని పేర్కొన్నారు. పల్స్ పోలియో, లెప్రసీ సర్వే డబ్బులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. – మహబూబాబాద్ రూరల్

• మాకేదీ 'వరద' సాయం..?



భారీ వర్షాలు, వరదతో సర్వం కోల్పోయిన తమకు ప్రభుత్వం వెంటనే ఆర్థికసాయం అందించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం రావిరాల గ్రామానికి చెందిన పలువురు బాధితులు గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగారు. 20రోజులు గడుస్తున్నా నష్టపరిహారం చెల్లించకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆర్థికసాయం అందించాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్‌కు మొరపెట్టుకున్నారు. – మహబూబాబాద్

• మా భూములు ఇవ్వం..



ఆదిలాబాద్ జిల్లా రామాయిలో ఏర్పాటు చేసే సిమెంటు పరిశ్రమకు తమ భూములు ఇవ్వబోమంటూ నిర్వాసిత రైతులు గురువారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఎకరానికి రూ.35లక్షల నుంచి రూ.40లక్షలు పలికే భూములను రూ.8.50లక్షలకు ఇవ్వాలని రెవెన్యూ అధికారులు ఒత్తిడి తెస్తున్నారన్నారు. – ఆదిలాబాద్ (నమస్తే తెలంగాణ)

• మంచినీళ్లు మహాప్రభో..



'ఇదేం పాలన. వీళ్లేం అధికారులు, మూడు నెలలుగా మంచినీళ్లు రాక ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోరా..?' అంటూ రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం చిన్నలింగాపూర్ మహిళలు గురువారం ఖాళీ బిందెలతో గ్రామ పంచాయతీని ముట్టడించారు. ఎస్సీ కాలనీలో నీటి సరఫరా చేయడం లేదని, వ్యవసాయ బోరుమోటర్ల నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. జీపీ కార్యదర్శి, సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోయారు. –సిరిసిల్ల రూరల్

• జీవనభృతి కోసం బీడీ కార్మికులు..



జీవనభృతి రూ.4,016కు పెంచాలని, లేకపోతే అసెంబ్లీని ముట్టడిస్తామని బీడీ కార్మికులు ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా ధర్పల్లి తహసీల్ కార్యాలయం ఎదుట గురువారం ఆందోళన చేపట్టారు. బీడీ కార్మికుల పింఛన్లు రూ.4016 కు పెంచుతానని సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా పెంచలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ మాలతికి వినతిపత్రం సమర్పించారు. – ధర్పల్లి

• 'ఆసరా' అందించాలి..



ఆసరా పింఛన్ అందించాలంటూ జనగామ పట్టణంలోని వివిధ వార్డులకు చెందిన వితంతు, ఒంటరి మహిళలు గురువారం మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించి కార్యాలయంలోకి ఉద్యోగులను పోనివ్వకుండా అడ్డుకున్నారు. తమ అర్జీలను చెత్తబుట్టలో పారేస్తున్నారని మండిపడ్డారు. పింఛన్ మంజూరు చేయకపోతే కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. – జనగామ (నమస్తే తెలంగాణ)

ఆమనగల్లుకు 300 ఫీట్ల రోడ్డు?

ఓఆర్ఆర్-ఆర్ఆర్ఆర్ లింకుకు రేడియల్ రోడ్ల ఏర్పాటుకు సర్కారు ప్రతిపాదన

- 916 ఎకరాల భూముల సేకరణకు ప్రణాళికలు
- అంత భారీ వెడల్పు రోడ్లెందుకన్న అనుమానాలు
- రియల్ ఎస్టేట్ ప్రయోజనాలేనన్న సందేహాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): సహజంగా రెండు ప్రధాన రోడ్ల మధ్య అనుసంధానం కోసం డబుల్ లేన్ రోడ్డు.. మరీ కావాలంటే నాలుగు లేన్ల రోడ్డును ఏర్పాటు చేస్తారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఔటర్‌రింగ్ రోడ్డు, రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్)కు అనుసంధానంగా ఏకంగా 300 అడుగుల రేడియల్ రోడ్డును ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అంటే ఇది ఇంచుమించు ఔటర్ రింగురోడ్డు అంత వెడల్పు ఉంటుంది. అంతేకాదు, ఇది మొత్తం గ్రీన్‌ఫీల్డ్ (పొలాల మధ్య నుంచి ఏర్పాటుచేసే రోడ్డు) రోడ్డు కావటం గమనార్హం. ఎటువంటి ట్రాఫిక్ అధ్యయనం లేకుండా ఎవరికోసం ఇంత భారీ రోడ్డును ఏర్పాటు చేయాలనుకుంటున్నారో అంతుబట్టడం లేదు. దీని వెనుక భారీ రియల్‌ఎస్టేట్ ప్రయోజనాలు దాగి ఉన్నాయనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

9 గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్లు

జాతీయ రహదారులశాఖతో సంబంధం లేకుండా ఆర్ఆర్ఆర్-దక్షిణ భాగం రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. ప్రపంచ బ్యాంకు నిధులతో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోనే దీన్ని ఏర్పాటు చేయాలని దాదాపు నిర్ణయానికొచ్చినట్టు సమాచారం. ఓ వైపు దక్షిణ భాగం అలైన్‌మెంట్ అష్టవంకరలు తిరుగుతూ ఇంకా తుది దశకు కూడా చేరుకోని పరిస్థితి ఉండగా, మరోవైపు రేడియల్ రోడ్ల వ్యవహారం తెరపైకి వచ్చింది. ఓఆర్ఆర్‌కు, ఆర్ఆర్ఆర్‌కు మధ్య 9 గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్లు నిర్మించాలని నిర్ణయించారు. ఇందులో ఓఆర్ఆర్ ఎగ్జిట్ నం-13 నుంచి ఏర్పాటు చేయనున్న రేడియల్ రోడ్డును ఏకంగా 300 అడుగుల వెడల్పుతో నిర్మించాలని నిర్ణయించటంపై విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే దీనిపై వివిధ పత్రికల్లో కథనాలు కూడా వెలువడ్డాయి.

స్పెషల్ టౌన్‌ప్లానింగ్ స్కీమ్ కింద ల్యాండ్ పూలింగ్ పద్ధతిలో భూసేకరణ

రెండు దశల్లో అభివృద్ధి చేయనున్న ఈ రేడియల్ రోడ్డు ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీ మీదుగా స్కిల్ యూనివర్సిటీ వరకు సాగుతుంది. ఈ మేరకు హెచ్ఎండీఏ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. 41.5 కిలోమీటర్ల పొడవైన ఈ రోడ్డు ఓఆర్ఆర్ ఎగ్జిట్ నంబరు 13 (రావిర్యాల) నుంచి రంగారెడ్డి జిల్లా, ఆమనగల్ మండలంలోని ఆకుతోటపల్లి వరకు ఏర్పాటు చేయనున్నారు. ఓఆర్ఆర్-ఆర్ఆర్ఆర్ మధ్య ప్రతిపాదిత 9 గ్రీన్ ఫీల్డ్ రోడ్లలో ఇదీ ఒకటి. మొదటి దశలో కందుకూరు మండలంలోని మీర్‌ఖాన్‌పేట్ వరకు 18 కిలోమీటర్ల మేర దీన్ని నిర్మించనుండగా, మిగిలింది రెండో దశలో నిర్మించనున్నారు. ఈ రోడ్డు నిర్మాణం కోసం 6 మండలాల్లోని 15 గ్రామాల పరిధిలో 916 ఎకరాల భూములు సేకరించాల్సిన అవసరం ఏర్పడుతుందని గుర్తించారు. మహేశ్వరం మండలంలోని కొంగరఖుర్ద్, కందుకూరు మండలంలోని లేమూర్, తిమ్మాపూర్, రాచలూర్, గుమ్మడవెల్లె, పంజాగూడ, మీర్‌ఖాన్‌పేట్, కడ్తాల్ మండలంలోని కడ్తాల్, ముద్విన్, ఆమన్‌గల్ మండలంలోని ఆమన్‌గల్, ఆకుతోటపల్లె, యాచారం మండలంలోని కుర్మిద్ద, ఇబ్రహీంపట్నం మండలంలోని ఫిరోజ్‌గూడ, కొంగరకలాన్ తదితర గ్రామాల పరిధిలో మొత్తం 916 ఎకరాల భూములు సేకరించాలని ప్రణాళికలు రూపొందించగా, ఇందులో 568 ఎకరాలు ప్రైవేటు భూములుగా గుర్తించారు. మిగిలిన భూముల్లో 156 ఎకరాలు టీజీఐఐసీ, 169 ఎకరాలు రిజర్వు ఫారెస్టు, 23 ఎకరాలు ప్రభుత్వ, అసైన్డ్ భూములు ఉన్నాయి. హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో స్పెషల్ టౌన్‌ప్లానింగ్ స్కీమ్ కింద ల్యాండ్‌పూలింగ్ పద్ధతిలో భూములు సేకరించాలని.. ఇందులో 60 శాతం భూయజమానులకు, 40 శాతం హెచ్ఎండీఏకు భాగం ఉండేలా ప్రతిపాదించారు.

ప్లానింగ్‌లో సీఎం అంతా తానై

ఎక్కడైనా రోడ్డు నిర్మించాలంటే సమగ్రంగా ట్రాఫిక్ అధ్యయనం చేస్తారు. అయితే, ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టు విషయంలో ఇదెక్కడా కానరావటం లేదు. ఇటీవల సీఎం నివాసంలో ఆర్ఆర్ఆర్ ప్రాజక్టుపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో ఎక్కడెక్కడ రేడియల్ రోడ్లు ఏర్పాటు చేయాలి? ఆర్ఆర్ఆర్ ఎటువైపు నుంచి వెళ్లాలి? అనే విషయాలు పూర్తిగా ముఖ్యమంత్రే అధికారులకు దిశానిర్దేశం చేసినట్టు సమాచారం. 300 అడుగుల వెడల్పు రేడియల్ రోడ్డు విషయంలోనూ సీఎం చెప్పినట్టే ప్లాన్లు సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తున్నది. అసలు అంత వెడల్పు రోడ్డు అవసరమా? లేదా? అనేది అధికారులకూ అంతుబట్టడం లేదు. దీని వెనుక ఎవరి ప్రయోజనాలు దాగివున్నాయో? ఈ రోడ్డు వల్ల బలయ్యే రైతులు ఎవరో? రానున్న కాలమే నిర్ణయించాలి.


ప్రతిపాదిత 300 అడుగుల రేడియల్ రోడ్డు ముఖ్యాంశాలు

- ఆరు మండలాల్లోని 15 గ్రామాల పరిధిలో 916 ఎకరాల భూమిని ఈ రోడ్డు కోసం సేకరించనున్నారు.
- 916 ఎకరాల్లో 568 ఎకరాలు ప్రైవేటు భూములు కాగా, 156 ఎకరాలు టీజీఐఐసీ, 169 ఎకరాలు రిజర్వు ఫారెస్ట్ పరిధిలో ఉన్నాయి.
- రోడ్డుకు ఇరువైపులా నికర అభివృద్ధి ప్రాంతం (నెట్ డెవలపబుల్ ఏరియా) 519 ఎకరాలు ఉండగా, ఇందులో 354 ఎకరాలు రోడ్లు, పార్కులు, ఇతర అవసరాలకు వినియోగించనున్నారు.

తిరుమల లడ్డూపై వివాదం

గతంలో తయారీకి జంతుకొవ్వును వాడారన్న బాబు

- చంద్రబాబు వ్యాఖ్యలు దుర్మార్గం
- కుటుంబంతో సహా ప్రమాణానికి సిద్ధం : సుబ్బారెడ్డి
- బాబును దేవుడు క్షమించడు: భూమన కరుణాకర్‌రెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం ఇప్పుడు దుమారం రేపుతున్నది. వైసీపీ హయాంలో లడ్డూ తయారీ కోసం జంతు కొవ్వు వినియోగించారని ఆ రాష్ట్ర సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు వివాదం రేపాయి. లడ్డూ కోసం ఉపయోగించిన నెయ్యిలో జంతువుల కొవ్వు ఉన్నట్టు నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ ఆఫ్ గుజరాత్ (ఎన్‌డీడీబీజీ) సీఏఎల్‌ఎఫ్ ల్యాబ్ కూడా నిర్ధారించింది. ఈ ఏడాది జూలైలో లడ్డూను ల్యాబ్‌కు పంపగా, అదే నెల 17న నివేదిక వచ్చింది. ల్యాబ్ రిపోర్ట్ ప్రకారం.. లడ్డూలో ఆవు నెయ్యి, సో యాబీన్, పొద్దు తిరుగుడు, ఆలివ్, గోధుమ బీన్, మక్కజొన్న, పత్తి గింజలతోపాటు చేప నూనె, జం తుకొవ్వు, పామాయిల్, పంది కొవ్వు కూడా వాడారు. ఆ రిపోర్టును గురువారం టీడీపీ అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి మీడియాకు విడుదల చేశారు.

చంద్రబాబు వ్యాఖ్యలతో దుమారం

తిరుమల లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు వినియోగించారని స్వయంగా చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపుతున్నాయి. శ్రీవారి ప్రసాదాన్ని సెంటిమెంట్‌గా భావించే భక్తులకు తాజా పరిణామాలు కలవరపెడుతున్నాయి. సీఎం వ్యాఖ్యలను టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఖండించారు. తిరుమల పవిత్రతను, వందల కోట్లమంది హిందువుల విశ్వాసాలను చంద్రబాబు దారుణంగా దెబ్బతీసి పెద్ద పాపం చేశారని విమర్శించారు. తిరుమల ప్రసాదం విషయంలో నేను, నా కుటుంబం ఆ దేవదేవుని సాక్షిగా ప్రమాణానికి సిద్ధంగా ఉన్నాం. చంద్రబాబు తన కుటుంబంతో ప్రమాణానికి సిద్ధమా?' అంటూ సవాల్ విసిరారు.

సీబీఐ విచారణ జరిపించాలి: షర్మిల

చంద్రబాబు కామెంట్స్‌పై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల స్పందించారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా టీడీపీ, వైసీపీ నీచ రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు. సీఎం హోదాలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు తిరుమల పవిత్రత, ప్రతిష్ఠకు భగం కలిగించేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ ఘటనలో అసలేం జరిగిందో తెలుసుకునేందుకు సీబీఐ విచారణ జరిపించాలని, ఆ మహాపాపానికి, అపచారానికి కారకులెవరో తేల్చాలని డిమాండ్ చేశారు.

నిత్యం 300-500 లీటర్ల నెయ్యి వాడకం

తిరుమల లడ్డూ తయారీకి వాడే నెయ్యిని టీటీడీ మార్కెటింగ్ విభాగం కొనుగోలు చేస్తుంది. ప్రతి ఆరు నెలలకొకసారి టెండర్లు పిలిచి ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా నెయ్యిని సమకూర్చుకుంటుంది. నిత్యం 300-500 లీటర్ల నెయ్యి వినియోగిస్తారు. నెయ్యి నాణ్యతను పరీక్షించేందుకు ల్యాబ్ కూడా తిరుమలలోనే ఉన్నది. ఇన్ని అంచెలు దాటి కల్తీ నెయ్యి, అది కూడా జంతువుల కొవ్వు నుంచి తీసింది వాడటం అనే టాపిక్ భక్తులను ఆందోళనకు గురిచేస్తున్నది. 2021 మార్చి వరకు నందిని బ్రాండ్ (కర్ణాటక) నెయ్యి సరఫరా అయ్యేది. తక్కువ ధరకి సరఫరా చేయలేమంటూ నందిని తప్పుకున్నది. ఆ తర్వాత యూపీకి చెందిన ప్రీమియర్ ఎల్-1గా, ఎల్-2గా ఆల్ఫా కంపెనీలు నెయ్యి సరఫరా చేసేందుకు అర్హత పొందాయి. కేజీ నెయ్యి రూ.424 ప్రకారం టీటీడీకి సరఫరా చేసేలా ఒప్పందం కుదుర్చుకున్నాయి.

భగవంతుడు క్షమించడు: భూమన కరుణాకర్‌రెడ్డి

తిరుమల ప్రసాదాలపై చంద్రబాబు ఆరోపణలు అత్యంత దుర్మార్గమని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. రాజకీయ లబ్ధికోసం, రాజకీయ స్వార్థం కోసం భగవంతుడిని వాడుకుంటే.. అలాంటి ఆరోపణలు చేసినవారిని భగవంతుడు క్షమించబోడని గురువారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. శ్రీ వేంకటేశ్వరస్వామి దుష్టశిక్షణ చేస్తాడని స్వయంగా చంద్రబాబే పలుమార్లు చెప్పారని, ఇలాంటి నీచమైన ఆరోపణలు చేసిన వ్యక్తిని భగవంతుడు చూస్తూ ఊరుకోడని తెలిపారు. రాజకీయ ప్రత్యర్థులను దృష్టిలో ఉంచుకుని భగవంతుడి పేరు మీద ఆరోపణలు చేయడం చంద్రబాబుకు కొత్తేమీ కాదని, గతంలో వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు కూడా చంద్రబాబు ఇలాంటి ఆరోపణలు చేశారని గుర్తుచేశారు. దీనికి అప్పుడు భగవంతుడు శిక్ష కూడా విధించాడని, అయినా చంద్రబాబు మారలేదని మండిపడ్డారు.

ఎన్‌ఈఎస్‌టీఎస్ స్టీరింగ్ కమిటీ సభ్యుడిగా శరత్



హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ) : నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఫర్ ట్రైబల్ స్టూడెంట్స్(ఎస్‌ఈఎస్‌టీఎస్)స్టీరింగ్ కమిటీ సభ్యుడిగా రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఏ శరత్‌ను నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆయన ఏడాదిపాటు పదవిలో కొనసాగనున్నారు.

నేటి నుంచి ఐసెట్ తుది విడుత కౌన్సెలింగ్

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): టీజీఐసెట్-2024 తుది విడుత కౌన్సెలింగ్ శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నది. ఈ మేరకు ఉన్నత విద్యాకమిషనర్, టీజీఐసెట్ అడ్మిషన్ల కన్వీనర్ గురువారం షెడ్యూల్ ప్రకటించారు. ఈ నెల 20, 21 తేదీల్లో రిజిస్ట్రేషన్‌తోపాటు ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తిచేసుకోవాలని అధికారులు తెలిపారు. 21, 22 తేదీల్లో వెబ్ ఆప్షన్లను ఎంచుకొని, 22వ తేదీన ఫ్రీజింగ్ చేసుకోవాలి. 25వ తేదీలోపు సీట్లను కేటాయిస్తామని, 25, 27 తేదీల్లో నిర్ణీత ఫీజును చెల్లించి 25 నుంచి 28 తేదీల్లో కాలేజీల్లో రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు. 27న స్పాట్ అడ్మిషన్లకు సంబంధించి మార్గదర్శకాలు విడుదలకానున్నాయి. ఇటీవలే ఫస్ట్ ఫేజ్ కౌన్సెలింగ్ ముగియగా, మిగిలిన 4,448 సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

బీ ఫార్మసీ ప్రవేశాలకు కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కళాశాలల్లో 2024-25 విద్యాసంవత్సరానికి బీ ఫార్మసీ, ఫార్మ డీ కోర్సుల్లో ప్రవేశాల కౌన్సెలింగ్‌కు టీజీఈఏపీ సెట్-2024 ప్రవేశాల కన్వీనర్, సాంకేతిక విద్యాకమిషనర్ శ్రీదేవసేన గురువారం షెడ్యూల్‌ను ప్రకటించారు. ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌లో భాగంగా ఇప్పటికే సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తయిన అభ్యర్థులు ఈ నెల 24, 25 తేదీల్లో వెబ్ ఆప్షన్లు ఎంచుకోవచ్చు. 27వ తేదీలోపు సీట్ల తాత్కాలిక కేటాయింపు ఉండగా, 27 నుంచి 28 వరకు ట్యూషన్ ఫీజు చెల్లింపుతోపాటు వెబ్‌సైట్ ద్వారా రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. 28, 29 తేదీల్లో సీట్లు పొందిన విద్యార్థులు కళాశాలకు వెళ్లి జాయినింగ్ రిపోర్టు ఇవ్వాలి. 30న ఆయా కాలేజీలు విద్యార్థుల జాబితాను ప్రకటిస్తాయి. వివరాలకు https:// tgeap cetb.nic.in ను చూడాలని కన్వీనర్ సూచించారు.

సంతూర్ స్కాలర్‌షిప్‌నకు 30 వరకు దరఖాస్తులు

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): గ్రామీణ ప్రాంతాల్లోని బాలికలను ఉన్నత చదు వుల వైపు ప్రోత్సహించేందుకు రూ.24 వేల వార్షిక స్కాలర్‌షిప్‌ను విప్రో సంస్థ ప్రకటించింది. ప్రభుత్వ స్కూళ్లు/ కాలేజీల్లో 2024-25 విద్యాసంవత్సరంలో డిగ్రీలో చేరినవారికి ఈ స్కాలర్‌షిప్ అందజేస్తామని సంస్థ ప్రతినిధి నీరజ్ కత్రి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థినులు ఈ నెల 30 వరకు www. santoorsc hlorship.com వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విద్యార్థినులను కరిచిన ఎలుకలు

సిరిసిల్ల రూరల్, సెప్టెంబర్ 19: రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం నేరెళ్లలోని బాలికల గురుకుల పాఠశాలలో పలువురి విద్యార్థులను ఎలుకలు కరిచాయి. ఈ నెల 5న రాత్రి వేళ 14 మందిని ఎలుకలు కరిచాయి. ఈ నెల 6న నేరెళ్ల పీహెచ్‌సీలో వైద్యం చేయించారు. ఈ నెల 9న రాత్రి 25 మందిని మళ్లీ ఎలుకలు కరువడంతో 10న అదే పీహెచ్‌సీలో వైద్యం చేయించారు. ఈ విషయంపై పీహెచ్‌సీ వైద్యాధికారి రేఖను వివరణ కోరగా 39 మందికి వైద్యం చేసినట్టు ధ్రువీకరించారు. ప్రిన్సిపాల్ రాధను ఫోన్‌లో సంప్రదించగా, అందుబాటులోకి రాలేదు.

ఫ్రీ పవర్ ఎఫెక్ట్..త్వరలో కరెంట్ షాక్!

- విద్యుత్తు వినియోగదారులపై 1200 కోట్ల భారం!
- ఎల్‌టీ క్యాటగిరీలో రూ.10 నుంచి రూ.50 వరకు ఫిక్స్‌డ్ చార్జీల పెంపు
- హెచ్‌టీ క్యాటగిరీలో ఫిక్స్‌డ్ చార్జీలతోపాటు బిల్లుల పెంపు
- కుటీర పరిశ్రమలు, పంచాయతీలు, బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లపై భారం
- టీజీఎస్‌ఈఆర్సీకి డిస్కంల ప్రతిపాదనలు



హైదరాబాద్ సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): తెల్ల రేషన్‌కార్డు కలిగిన 200 యూనిట్లలోపు గృహ వినియోగదారులకు ఉచిత విద్యుత్తు ఇవ్వడం వల్ల పడుతున్న భారాన్ని ఇతర క్యాటగిరీల వినియోగదారుల మీద మోపేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నదా? నూతన సంవత్సర కానుకగా విద్యుత్తు చార్జీల పెంపుదల తప్పదా? డిస్కంలు బుధవారం రాత్రి విద్యుత్తు నియంత్రణ మండలి (ఈఆర్సీ)కి సమర్పించిన ప్రతిపాదనలు చూస్తే ఈ అనుమానమే కలుగుతున్నది. గృహజ్యోతి ద్వారా కోల్పోతున్న ఆదాయాన్ని రాబట్టుకునేందుకు బిల్లుల పెంపునకు అనుమతించాలనేది డిస్కంల ప్రతిపాదనల సారాంశం. రాష్ట్ర ప్రభుత్వం గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లలోపు వినియోగించే గృహ వినియోగదారులకు ఉచిత విద్యుత్తు అందజేస్తున్నది. అయితే, ప్రభుత్వం ఈ సబ్సిడీని డిస్కంలకు ఇవ్వడంలో జాప్యం చేస్తున్నది. దీంతో డిస్కంలు భారీగా ఆదాయం కోల్పోతున్నాయి. ఈ నేపథ్యంలో కోల్పోయిన ఆదాయాన్ని రాబట్టుకోవాలంటే చార్జీల పెంపే శరణ్యమని డిస్కంలు భావిస్తున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.1,200 కోట్ల మేర చార్జీలు పెంచేందుకు అనుమతించాలంటూ ఎన్పీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ ఇప్పటికే విద్యుత్తు నియంత్రణ మండలి (ఈఆర్సీ)కి ప్రతిపాదనలు సమర్పించాయి.

బహిరంగ విచారణ తర్వాతే అనుమతి

డిస్కంల ప్రతిపాదనలపై ఈఆర్సీ రాష్ట్రంలోని మూడు చోట్ల ప్రజల సమక్షంలో విచారణ చేపడుతుంది. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తుది తీర్పును వెల్లడిస్తుంది. తదనంతరమే చార్జీల పెంపునకు అనుమతిస్తుంది. ఈ ప్రక్రియ మొత్తం పూర్తికావాలంటే దాదాపు మూడు నెలల సమయం పడుతుందని సంబంధిత అధికారులు తెలిపారు. డిస్కంల ప్రతిపాదనలకు ఈఆర్సీ ఆమోదం లభిస్తే, వచ్చే కొత్త సంవత్సరం (జనవరి) నాటికి కరెంట్ చార్జీలు పెరిగే అవకాశాలున్నట్టు భావిస్తున్నారు.

డిస్కంల ప్రతిపాదనలు

ఎల్‌టీ (లోటెన్షన్) క్యాటగిరీలోని 300 యూనిట్లకుపైగా కరెంటు వాడుతున్నవారికి ఫిక్స్‌డ్ చార్జీల కింద ప్రస్తుతం ప్రతి కిలోవాట్‌కు రూ.10 వసూలు చేస్తున్నారు. ఈ మొత్తాన్ని రూ.50కి పెంచాలని డిస్కంలు ప్రతిపాదించాయి. దీంతో ప్రస్తుతం రూ.30 వరకు విధిస్తున్న ఫిక్స్‌డ్ చార్జీలు రూ.150కి పెరగనున్నాయి. ఈ లెక్కన 300 యూనిట్లకుపైగా కరెంట్ వినియోగిస్తున్న సుమారు 26 లక్షల మందిపై దాదాపు ఐదు రెట్ల భారం పడనున్నది. డిస్కంల ప్రతిపాదనలకు ఆమోదం లభిస్తే.. హెచ్‌టీ (హైటెన్షన్) క్యాటగిరీలోని వినియోగదారులకు ఫిక్స్‌డ్ చార్జీలతోపాటు కరెంట్ బిల్లులు సైతం భారీగా పెరగనున్నాయి.

అన్ని సబ్ క్యాటగిరీలకు ఒకే చార్జీ

-ప్రస్తుతం 11 కేవీ, 33 కేవీ, 132 కేవీ/ఆపై కెపాసిటీ కనెక్షన్లు ఉన్నాయి. ఈ విభాగంలో మూడు సబ్ క్యాటగిరీలకు వేర్వేరుగా చార్జీలు విధిస్తున్నారు. 11 కేవీ కింద కనెక్షన్ తీసుకున్న వినియోగదారులకు యూనిట్‌కు రూ.7.65 చొప్పున, 33 కేవీ కనెక్షన్‌దారులకు రూ.7.15, 132/ఆపై క్యాటగిరీలోని వారికి రూ.6.65 చొప్పున వసూలు చేస్తున్నారు. ఇక మీదట అన్ని క్యాటగిరీలకు 11 కేవీలోని వినియోగదారులకు మాదిరిగా రూ.7.65 చొప్పున వసూలు చేసేందుకు అనుమతివ్వాలని డిస్కంలు కోరుతున్నాయి. అంటే 33 కేవీ వినియోగదారులకు యూనిట్‌కు 50 పైసలు, 132 కేవీ వారికి రూపాయి చొప్పున చార్జీలు పెరగనున్నాయి.

- ఈ విధంగా కరెంట్ బిల్లుల పెంపుతో రూ.700 కోట్లు, ఫిక్స్‌డ్ చార్జీల ద్వారా రూ.100 కోట్లు మొత్తంగా రూ.800 కోట్లు రాబట్టుకునే అవకాశం ఇవ్వాలని డిస్కంలు ప్రతిపాదించాయి. దీంతోపాటు ఎల్‌టీ వినియోగదారుల నుంచి ఫిక్స్‌డ్ చార్జీల రూపేణా రూ.400 కోట్ల ఆదాయం పెంపునకు ప్రతిపాదించాయి. దీంతో గృహ, గృహేతర/వాణిజ్య, సాధారణ, కుటీర పరిశ్రమలు, స్ట్రీట్‌లైట్లు, రక్షిత తాగునీటి పథకాల నిర్వహణపై ఫిక్స్‌డ్ చార్జీల భారం పడనున్నది.
- కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో డిస్కంలకు రూ.14,222 కోట్లు ఆదాయలోటు ఉన్నదని అధికారులు వెల్లడించారు. ఇందులో చార్జీల పెంపుతో రూ.1,200 కోట్లు సమకూరితే, మిగిలిన రూ.13,022 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ రూపంలో అందించాలని నివేదించాయి.

2 నుంచి దసరా సెలవులు

- అక్టోబర్ 14 వరకు వరుసగా 13 రోజులు తాతిల్
- మళ్లీ అక్టోబర్ 15న పాఠశాలల పునఃప్రారంభం

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని పాఠశాల విద్యార్థులకు గుడ్ న్యూస్. వరుసగా 13 రోజులు సెలవులు రాబోతున్నాయి. అక్టోబర్ 2 నుంచి 14వ తేదీ వరకు బడులకు దసరా సెలవులు ప్రకటించారు. గాంధీ జయంతి మొదలు.. బతుకమ్మ, దసరా పండుగ వరకు పాఠశాలలకు సెలవులు ఇచ్చారు. కొన్ని ప్రైవేటు స్కూళ్లకు 14 రోజులు సెలవులు ఇవ్వనున్నారు. అక్టోబర్ 15న పాఠశాలలు తిరిగి ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించిన క్యాలెండర్‌ను మే 25న విడుదల చేసింది. అక్టోబర్ 2 నుంచి 14 వరకు దసరా సెలవులు, డిసెంబర్ 23 నుంచి 27 వరకు క్రిస్మస్ సెలవులు, జనవరి 13 నుంచి 17 వరకు సంక్రాంతి సెలవులను ప్రకటించింది. క్యాలెండర్ ప్రకారం.. 2025 ఏప్రిల్ 23 వరకు పాఠశాలలు కొనసాగనున్నాయి. 2025 ఫిబ్రవరి 28లోపు టెన్త్ ప్రీఫైనల్, మార్చిలో వార్షిక పరీక్షలు నిర్వహిస్తారు.

ఎట్టకేలకు జీతాలు విడుదల

- గురుకుల రెగ్యులర్ ఉద్యోగుల వేతనాల చెల్లింపు
- ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి మళ్లీ మొండిచెయ్యే..

హైదరాబాద్, సెప్టెంబర్19 (నమస్తే తెలంగాణ): గురుకులాల్లోని బోధన, బోధనేతర సిబ్బందికి ఎట్టకేలకు జీతాలు పడ్డాయి. గురువారం మధ్యాహ్నం నుంచి వేతనాలను వారి ఖాతాల్లో జమ చేశారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లోని రెగ్యులర్ ఉద్యోగులు, ఇటీవల కొత్తగా నియామకమైన ఉద్యోగులు, అదేవిధంగా పార్ట్ టైం, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఇప్పటివరకు ప్రభుత్వం వేతనాలను చెల్లించలే దు. ఈ నేపథ్యంలోనే 'తొలి జీతమే చేదు జ్ఞాపకం' పేరిట నమస్తే తెలంగాణ ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించింది. వారందరికీ వేతనాలను విడుదల చేసిం ది. కానీ పార్ట్‌టైం, గెస్ట్‌ఫ్యాకల్టీ, హానరోరియం ఉద్యోగులకు ఈసారి కూడా ప్రభుత్వం మొండిచెయ్యి చూపింది. పండుగల నేపథ్యంలో వేతనాలను వెంటనే చెల్లించాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కోరుతున్నారు.

బండి కొన్న వెంటనే శాశ్వత రిజిస్ట్రేషన్!

- 'వాహన్ సారథి' వచ్చేస్తున్నది
- రవాణా సేవలన్నింటికీ ఏకీకృత విధానం
- 'వాహన్'లో వాహనాల వివరాలు, ఆర్సీలు
- నెలాఖరు నుంచి సికింద్రాబాద్ ఆర్టీఏలో ప్రారంభం
- దశల వారీగా అన్ని ఆర్టీఏల్లో విస్తరణ

> దేశవ్యాప్తంగా రవాణా సేవలన్నింటికీ ఏకీకృత విధానాన్ని అమలుచేసేందుకు ప్రవేశపెట్టిన 'వాహన్ సారథి'ని తెలంగాణలో ప్రయోగాత్మకంగా అమలుచేసేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. దీంతో రవాణాశాఖ అందించే పౌరసేవలు మరింత పారదర్శకం కానున్నాయి.



హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): ఇకపై వాహనం కొన్న వెంటనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తికానున్నది. లెర్నింగ్ లైసెన్సుల కోసం ఆర్టీఏ కార్యాలయాలనికి వెళ్లాల్సిన అవసరం లేదు. డ్రైవింగ్ లైసెన్స్ రెన్యువల్, వాహనాల నమోదు, బదిలీ తదితర సేవలు వినియోగదారులకు మరింత చేరువకానున్నాయి. ప్రస్తుతం టీ-యాప్, ఫోలియో వంటి మొబైల్ యాప్‌ల ద్వారా ప్రత్యక్ష సేవలను పొందేందుకు అవకాశం ఉండగా, త్వరలో 'వాహన్ సారథి' అందుబాటులోకి రానున్నది.

ఆన్‌లైన్‌లోనే లెర్నింగ్ పరీక్షలు..


లెర్నింగ్ లైసెన్సుల పరీక్షలను కూడా ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తెచ్చే అవకాశం ఉన్నది. కర్ణాటకలో ఈ తరహా పద్ధతి విజయవంతంగా అమలవుతుండటంతో హైదరాబాద్‌లోనూ ఆన్‌లైన్ టెస్టింగ్ విధానాన్ని అమలు చేయాలని రవాణా అధికారులు యోచిస్తున్నారు. దీంతో వినియోగదారులు ఆర్టీఏ కార్యాలయాలకు వెళ్లకుండా ఇంటి నుంచే ఎల్‌ఎల్‌ఆర్ (లెర్నింగ్ లైసెన్స్) పొందవచ్చు. శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్ కోసం మాత్రం టెస్ట్ ట్రాక్‌లో ప్రత్యక్ష పరీక్షలకు హాజరుకావాలి.

సారథిలో లైసెన్సుల డాటా..

సికింద్రాబాద్ ఆర్టీఏ కార్యాలయం నుంచి త్వరలోనే 'సారథి' సేవలు ప్రయోగాత్మకంగా ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్ కేంద్రంగా 'సారథి' కార్యకలాపాలు సాగిస్తున్నది. దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన డ్రైవింగ్ లైసెన్సుల వివరాలు సారథిలో నమోదు కాగా, ఇటీవల మన రాష్ట్రం కూడా ఈ జాబితాలో చేరింది. దీంతో కొత్తగా డ్రైవింగ్ లైసెన్సులు తీసుకొనే అభ్యర్థులు మినహాయించి పాతవి రెన్యువల్ చేసుకోవడం, చిరునామా బదిలీ చేసుకోవడం వంటి సేవలను సారథి ద్వారా పొందే వీలున్నది. లైసెన్సుల మొత్తం డాటా సారథిలో నిక్షిప్తమై ఉంటుంది.

వాహనాల నమోదుకు 'వాహన్'

దేశంలోని మెజారిటీ రాష్ట్రాలు వాహనాల వివరాలను 'వాహన్'లో నమోదు చేశాయి. ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న 'వాహన్'లో ఇటీవల తెలంగాణ కూడా చేరేందుకు చర్యలు చేపట్టింది. దీంతో వాహనం కొనుగోలు చేసిన వెంటనే షోరూమ్‌లోనే శాశ్వత రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. ప్రస్తుతం ఆటోమొబైల్ డీలర్లు తాత్కాలిక రిజిస్ట్రేషన్ పత్రాలను(టీఆర్) ఇస్తున్నారు. అనంతరం ఆర్టీఏ అధికారులు శాశ్వత రిజిస్ట్రేషన్ (ఆర్సీ) చేస్తున్నారు. ఇకపై వాహనాన్ని ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి బదిలీ చేసేందుకు ఎన్వోసీ అవసరం లేకుండా 'వాహన్'లో ధ్రువీకరించుకొని బదిలీ చేయవచ్చు. ప్రమాద బీమా సదుపాయం కూడా తేలిగ్గా లభిస్తుంది.



జేఎన్‌ఎఫ్‌ఏయూకు భూమి కేటాయించొద్దు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలోని పదెకరాలను జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి కేటాయించొద్దంటూ నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్‌ఏవోయూ ఉద్యోగులు



ముత్తన్న, రాయమల్లు (ఫైల్)

విద్యుత్ కంచెలే.. మృత్యుపాశాలై..

వేర్వేరు చోట్ల ఇద్దరు రైతుల మృతి

మల్లాపూర్, సెప్టెంబర్ 19: పంటల రక్షణ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ కంచెలకు తగిలి ఇద్దరు రైతులు ప్రాణాలు కోల్పోయారు. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం కుస్తాపూర్ గ్రామానికి చెందిన జెల్ల పెద్ద ముత్తన్న (60) పొలంలో మందు చల్లేందుకు వెళ్లారు. పక్కనే రత్నాపూర్ గ్రామానికి చెందిన గొండ సాయన్న తన మక్క చేనును కోతుల బెడద నుంచి కాపాడుకునేందుకు ఇనుప కంచె ఏర్పాటు చేసి, మోటారు నుంచి అక్రమంగా కరెంట్ పెట్టాడు. పెద్ద ముత్తన్న ప్రమాదవశాత్తూ ఇనుప కంచెకు తాకడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ముత్తన్న భార్య జెల్ల పెద్దరాజు ఫిర్యాదు మేరకు సాయన్నపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం పత్తిపాకకు చెందిన రైతు దయ్యాల రాయమల్లు (56) పొలానికి నీళ్లు పెట్టేందుకు ఉదయం వెళ్లాడు. పక్క పొలానికి చెందిన రైతు కర్నె రాములు ఇనుప వైర్‌తో కంచెను ఏర్పాటు చేసి, కరెంట్ కనెక్షన్ ఇచ్చాడు. రాయమల్లు ఆ తీగలకు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జానీమాస్టర్ అరెస్ట్

- గోవాలో అదుపులోకి తీసుకున్న పోలీసులు
- నేడు రాజేంద్రనగర్ కోర్టులో హాజరుపర్చనున్నట్టు వెల్లడి

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): మహిళా డ్యాన్సర్‌పై లైంగికదాడికి పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న కొరియోగ్రాఫర్ జానీమాస్టర్‌ను ఎట్టకేలకు పోలీసులు గోవాలో అరెస్టు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వివరాలు సేకరించిన పోలీసులు జానీపై పోక్సో, లైంగికదాడి కేసులు నమోదు చేసిన విషయం తెల్సిందే. పరారీలో ఉన్న జానీమాస్టర్ గోవాలో ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. గురువారం జానీ మాస్టర్‌ను అరెస్టు చేసి, గోవా కోర్టులో హాజరుపరిచారు. శుక్రవారం ఉప్పర్‌పల్లిలోని రాజేంద్రనగర్ కోర్టులో హాజరుపర్చనున్నట్టు డీసీపీ తెలిపారు.


చెక్కులు బౌన్స్.. సిబిల్ స్కోర్ డౌన్

- 19 రోజుల తర్వాత హోంగార్డులకు జీతాలు
- 5వ తేదీలోపు వేయాలని చిరుద్యోగుల వేడుకోలు

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ) : చాలీచాలని వేతనాలతో కాలం వెళ్లదీస్తున్న హోంగార్డులకు సకాలంలో వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. బీఆర్‌ఎస్ హయాంలో 1, 2వ తేదీల్లోనే పడే శాలరీలు.. కాంగ్రెస్ హ యాంలో 9వ తేదీ తర్వాత పడుతున్నా యి. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 16 వేల మందికి పైగా హోంగార్డులు ఈ నెల వేత నం కోసం 19 రోజులు పడిగాపులు కాయాల్సి వచ్చింది. జీతాలు ఆలస్యమవుతుండటంతో కుటుంబం గడవడం కష్టమవుతున్నదని వారు ఆవేదన చెందుతున్నారు. ఈనెల 19వ మధ్యాహ్నం వేతనాలు అందగా ఇన్ని రోజులు ఊహించని ఇబ్బందులు ఎదుర్కొన్నామని వాపోతున్నారు. సకాలంలో బ్యాంకుల్లో జీతాలు జమ కాక చెక్కులు బౌన్స్ అవుతున్నాయని, ఈఎంఐ గడువు దాటి పెనాల్టీలు మీదపడడమే కాకుండా సిబిల్ స్కోర్ దారుణంగా పడిపోతున్నదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పిల్లల స్కూల్ ఫీజులు, ఇంటి ఖర్చులు, అద్దెలు, పెట్రోల్ వంటి వాటికి డబ్బులు సర్దుకోవడం కష్టంగా మారిందని చెప్తున్నారు. దాదాపుగా ఈఎంఐలు, క్రెడిట్ కార్డు బిల్లులు కట్టాల్సిన తేదీ లు ప్రతినెలా 5లోపే ఉంటాయని, వేతనాలు ఆలస్యం కావడంతో పెనాల్టీలు అదనంగా పడుతున్నాయని వాపోతున్నారు.

చిన్న ఉద్యోగులకు ఇన్ని రోజులు ఆలస్యమా?

ఉద్యోగులకు ఠంచన్‌గా 1వ తేదీనే జీతాలు వేస్తున్నామని చెప్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, చిన్న ఉద్యోగులమైన తమకు ఇన్ని రోజులు ఆలస్యం చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. జీతాలు లేట్ కావడంతో సమయానికి తీరుస్తామో లేదోనన్న భయంతో ఎవరూ తమకు అప్పులు కూడా ఇవ్వడం లేదని వాపోతున్నారు. వినాయక చవితి సందర్భంగా ఇచ్చిన రూ.2,400 తప్ప శాలరీ అతీగతీ లేదని, కొందరు అధికారులు చిన్నచిన్న పొరపాట్లను పెద్దగా చూపుతూ ఇష్టం వచ్చినట్టు దుర్భాషలాడుతున్నారని చెప్తున్నారు. కుటుంబ ఒత్తిళ్లతో విధులకు కాస్త ఆలస్యంగా వెళ్లినా అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎంపీ ఆర్ కృష్ణయ్య

హాస్టల్ వర్కర్స్‌కు జీతాలు చెల్లించాలి : కృష్ణయ్య

బీసీ భవన్ వద్ద కార్మికుల భారీ ర్యాలీ

ముషీరాబాద్, సెప్టెంబర్ 19: కాలేజీ హాస్టళ్లలో పనిచేస్తున్న వర్కర్స్ జీతాలు వెంటనే చెల్లించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఎనిమిది నెలలుగా జీతాల కోసం వర్కర్స్ ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘం ఆధ్వర్యంలో పలువురు వర్కర్స్ విద్యానగర్‌లోని బీసీ భవన్ వద్ద గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టళ్లలో ఎనిమిది నెలలుగా జీతాలు లేకపోతే కుటుంబాలు ఎలా గడవాలని ప్రశ్నించారు. అవుట్‌సోర్సింగ్ విధానం ఎత్తివేసి నేరుగా ప్రభుత్వమే జీతాలు చెల్లించాలని, వర్కర్స్‌కు రూ.15వేల నుండి రూ.25వేల వరకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

కార్యదర్శులకు గురుకుల సిబ్బంది మొర

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని విన్నపం

హైదరాబాద్, సెప్టెంబర్19 (నమస్తే తెలంగాణ): దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తక్షణమే పరిష్కరించేలా చూడాలని ఎస్సీ, బీసీ, మైనార్టీ, ఎస్టీ, జనరల్ గురుకులాల కార్యదర్శులకు బోధన, బోధనేతర సిబ్బంది మొరపెట్టుకుంటున్నారు. ఈ మేరకు గురుకుల ప్రిన్సిపాల్స్ ద్వారా విజ్ఞాపన పత్రాలను గురువారం పంపించారు. గురుకులాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురుకుల విద్యా జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమాలు 3వ రోజూ కొనసాగాయి. ఇటీవల రూపొందించిన పని వేళలతోపాటు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను ఏకరువు పెట్టారు. గురుకుల విద్యా జేఏసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు బాలరాజు, యాదయ్య, రుషికేష్‌కుమార్, ప్రభుదాస్, చలపతి, బాలస్వామి, గోవర్ధన్‌రెడ్డి, ఝాన్సీరాణి, సాంబలక్ష్మి, ఆవుల సైదులు, జానీమియా, శ్రీనివాస్, తదితరులున్నారు.

అల్లుడా మజాకా

మొదటిపేజీ తరువాయి...

ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

150 ఎకరాలు నీట మునక!

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తొర్రూరులో ఎర్రకుంటలోని నీరు దిగువకు వెళ్లేలా తొర్రూరు-బ్రాహ్మణపల్లి రహదారిని ఆనుకుని ప్రస్తుతం అలుగు నిర్మాణం చేపడుతున్నారు. నీటిపారుదల శాఖ ప్రతిపాదించిన మేరకు ఆర్‌అండ్‌బీ శాఖ పనులు చేపడుతున్నది. సుమారు రూ.20 లక్షలతో చేపట్టిన ఈ పనులకు సంబంధించిన అంచనాలకు ఈ ఏడాది ఫిబ్రవరిలో మంజూరు కల్పించగా పనులు దక్కించుకున్న సంస్థ ఆగస్టులో ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలిసింది. ఇటీవలే పనులు మొదలు కాగా ఒప్పందం ప్రకారం 1000 ఎంఎం డయా సామర్థ్యం గల పైపులైన్ వేయాల్సి ఉన్నది. కానీ, స్థానిక రైతులు నిరసన తెలుపడంతో పైపులైన్ బదులు అలుగు నిర్మాణం చేపట్టాలని నిర్ణయించినట్టు తెలిసింది. కుంటకు గతంలో ఉన్న అలుగు ప్రాంతంలో కొత్తది నిర్మించకుండా వేరే ప్రాంతంలో చేపట్టడమే వివాదానికి కారణమైంది. ప్రస్తుతం నిర్మిస్తున్న అలుగుతో కుంటలోకి వరద కారణంగా 150 ఎకరాలు నీట మునుగుతాయని బాధిత రైతులు పేర్కొంటున్నారు. పనులు ఆపేయాలని కోరుతూ అలుగు నిర్మాణ ప్రాంతం వద్దనే టెంట్ వేసుకొని ఆరు రోజులుగా తమ కుటుంబాలతో నిరసన తెలుపుతున్నా పోలీసు బందోబస్తుతో చేయిస్తున్నారని వాపోయారు.

వారి భూముల ముంపు తప్పించేందుకేనా?

ఎర్రకుంటకు ఎగువన వ్యవసాయ భూములు చాలావరకు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయి. ఎఫ్‌టీఎల్ పరిధి తగ్గించి ఆయా భూములకు ముంపు ముప్పు తప్పించేందుకే కొత్తచోట అలుగు నిర్మిస్తున్నారని రైతులు విమర్శిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే అల్లుళ్లకు సంబంధించిన పొలాలు ఉన్నాయని, భవిష్యత్తులో ఆ భూముల్లో విల్లాలు నిర్మించే ఆలోచనలో సదరు వ్యక్తులు ఉన్నారని చెప్తున్నారు. అలుగు నిర్మాణం పూర్తయితే తమ పొలాలు మునుగుతాయని, ఇక చావే శరణ్యమని ఆవేదన చెందుతున్నారు. నిరసన తెలుపుతున్న తమకు ఎమ్మెల్యే అల్లుళ్ల నుంచి ప్రాణహాని ఉన్నదని బాధిత రైతుల్లో ఒకరైన రాజ్ కిరణ్ మీడియా ఎదుట ఆందోళన వ్యక్తంచేశారు. కాగా రైతుల వాదనను ఎమ్మెల్యే అల్లుడు నరేందర్‌రెడ్డి విభేదించారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం సరికాదన్నారు. అలుగు వివాదంపై వివరణ కోసం నీటిపారుదల శాఖ అధికారులకు ఫోన్‌చేయగా స్పందించ లేదు. ఈ వివాదంపై హైడ్రా కమిషనర్‌కు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు బాధిత రైతులు చెప్పారు.

గాంధీ దవాఖానపై నిజనిర్ధారణ కమిటీ

- నిపుణుల కమిటీ ఆధ్వర్యంలో అధ్యయనం చేస్తాం
- బాధ్యత గల ప్రతిపక్షంగా సూచనలిస్తాం
- మాతా శిశు మరణాలపై సర్కారు స్పందన అమానవీయం
- బీఆర్ఎస్ ప్రైవేట్‌కు కొమ్ముకాస్తే తెల్లకోటు విప్లవం సాధ్యమయ్యేదా?: కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): గాంధీ దవాఖానలో కొనసాగుతున్న మాతా శిశు మరణాలపై బీఆర్ఎస్ తరఫున నిజ నిర్ధారణ కమిటీని ఏర్పాటుచేస్తామని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు తెలిపారు. నిపుణుల కమిటీ ఆధ్వర్యంలో గాంధీ దవాఖానలో జరుగుతున్న మరణాలపై అధ్యయనం చేసి, గుర్తించిన అంశాలను ప్రభుత్వంతోపాటు ప్రజలతోనూ పంచుకుంటామని చెప్పారు. పార్టీ తరఫున చేసే ఈ ప్రయత్నంలో ప్రభుత్వం కలిసి రావాలని, ప్రజల ఆరోగ్యాలను బాగు పరిచేందుకు బాధ్యత కలిగిన ప్రతిపక్షంగా తాము ఇచ్చే సలహాలు, సూచనలను స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు.



గాంధీ దవాఖానలో జరుగుతున్న మరణాలపై దృష్టి సారించాల్సింది పోయి ఆ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చిన బీఆర్ఎస్‌పై ఎదురుదాడికి దిగడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రభుత్వం సమస్యను పరిష్కరించాల్సింది పోయి పక్కదారి పట్టించే కార్యక్రమానికి తెరలేపిందని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా మరణాలపై సమీక్షించారా? నాణ్యమైన వైద్యం అందించేందుకు ఫోకస్ చేశారా? ఇటీవల చేపట్టిన బదిలీల్లో సీనియర్ డాక్టర్లను ట్రాన్స్‌ఫర్ చేశారనే ఆరోపణల్లో వాస్తవం ఉన్నదా? లేదా? అనే ప్రశ్నలకు బదులు ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

తెల్లకోటు విప్లవం సాధ్యమయ్యేదా?

రాష్ట్ర ప్రభుత్వం గాంధీ దవాఖానలో ఉన్న అనుభవజ్ఞులైన డాక్టర్లను బదిలీ చేయడం వలన అక్కడ చికిత్సలకు తీవ్రమైన ఆటంకం ఏర్పడుతున్నదనే విషయాన్ని గుర్తించి, మరణాలను తగ్గించే ప్రయత్నం చేయాలని కేటీఆర్ సూచించారు. వైద్యం అందడం లేదని, పసిపిల్లలు పిట్టల్లా రాలిపోతున్నారని అంటే బురదజల్లుతున్నామని మాట్లాడతారా? అని మండిపడ్డారు. ప్రభుత్వం ఆరోపించినట్టు బీఆర్ఎస్ పార్టీ ప్రైవేటుకు కొమ్ముకాయాలనుకుంటే హైదరాబాద్ నగరం చుట్టూ పెద్ద దవాఖానల నిర్మాణాలు, వరంగల్‌లో అతి పెద్ద దవాఖాన నిర్మాణం, బస్తీ దవాఖానాలు, గ్రామాల్లో క్లినిక్‌లు చేపట్టే వాళ్లమా? అని ప్రశ్నించారు. కేసీఆర్ కిట్లు, తల్లీబిడ్డను ఇంటి దగ్గర దిగబెట్టే వాహనాలు, సాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవడం, రెండు ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఉన్న రాష్ట్రంలో 33 మెడికల్ కాలేజీల ఏర్పాట్లు సాధ్యమయ్యేవా? అని నిలదీశారు. కేసీఆర్ హయాంలో ప్రైవేట్‌కు కొమ్ముకాస్తే తెలంగాణ వైద్యుల ఉత్పత్తి కర్మాగారంగా, తెల్లకోటు విప్లవాన్ని సృష్టించేదా? అని ప్రశ్నించారు.

మానవీయంగా స్పందించండి

తమపై ఎదురుదాడి చేయడం మానేసి ముందుగా పాలనలో లోపాలను సరిదిద్దుకోవాలని ప్రభుత్వానికి కేటీఆర్ సూచించారు. పోయిన ప్రాణాలు తిరిగిరావని, ఆ తల్లుల కడుపుకోత తీర్చలేమనే సోయితో ఆలోచించి ప్రజలు కూడా మన బిడ్డలే అని మానవత్వంతో ఆలోచిస్తే కాంగ్రెస్ పాలన తీరు కూడా మారుతుందని హితవు పలికారు. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రభుత్వ దవాఖానలో జరుగుతున్న మరణాలు ఒక సంఖ్యగా మాత్రమే కనిపించడం దారుణమని, అది ఒక కుటుంబానికి సంబంధించిన శిశువు లేదా తల్లి మరణం అనే మానవీయ కోణంలో ఆలోచించాలని సూచించారు.



ఆటో కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న బీఆర్‌టీయూ రాష్ట్ర ఆటో యూనియన్ అధ్యక్షుడు వేముల మారయ్య, ఏఐటీయూసీ బి. వెంకటేశ్, సీఐటీయూ శ్రీకాంత్, ఐఎఫ్‌టీయూ ప్రవీణ్, యూటీఏడబ్ల్యూ సలీం, ఆటో ఓనర్స్ అసోసియేషన్ రఫత్‌లు

ఇక సహించేది లేదు!

- అక్టోబర్ 22న చలో హైదరాబాద్‌కు ఆటో కార్మికుల పిలుపు
- ఆటో జేఏసీ సమావేశంలో నాయకుల ఆగ్రహం

హైదరాబాద్ సిటీబ్యూరో/చిక్కడపల్లి, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య హెచ్చరించారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలతో ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోవాల్సి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాగ్‌లింగంపల్లి బీఆర్‌టీయూ కార్యాలయంలో 'కాంగ్రెస్ మోసపూరిత హామీలు–ఆటోడ్రైవర్ల ఆత్మహత్యలు' అంశంపై ఆటో జేఏసీ నాయకుల సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా మారయ్య మాట్లాడుతూ.. ఇంకెంతమంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకుంటే ప్రభుత్వం స్పందిస్తుందో సీఎం చెప్పాలని ప్రశ్నించారు. ఇక సహించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. అక్టోబర్ 22న చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చినట్టు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆటో డ్రైవర్లతో ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా చేపట్టనున్నట్టు చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 50 మందికి పైగా ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నట్టు గుర్తుచేశారు. ఏఐటీయూసీ నాయకుడు వెంకటేశ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా ఆటో డ్రైవర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీయే ఇందుకు కారణమని మండిపడ్డారు. సీఐటీయూ నాయకుడు పుప్పాల శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఉపాధి లేక, కుటుంబాన్ని పోషించలేక ఆటోడ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని వాపోయారు. ఐఎఫ్‌టీయూ నాయకుడు ప్రవీణ్ మాట్లాడుతూ.. అక్టోబర్ 22న జరిగే చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూటీఏడీడబ్ల్యూ సలీం, ఆటో ఓనర్స్ అసోసియేషన్ నాయకుడు రఫత్, రమేశ్, రామకృష్ణ, చంద్రమౌళి, ఏటీసీ నాయకులు అశోక్ జంగయ్య, అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గూండాలకు పోలీసుల వత్తాసు

- రాష్ట్రం ప్రశాంతంగా ఉండాలని ఓపిక పడుతున్నాం
- సీఎం వల్లే రాష్ట్రంలో అశాంతి
- బీఆర్ఎస్ నేతలపై దాడులు ఆపాలి
- దాడుల్లో పోలీసుల పాత్ర ఉన్నది
- మీడియాతో బీఆర్ఎస్ నేతలు జగదీశ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి
- వరస ఘటనలపై డీజీపీకి ఫిర్యాదు



డీజీపీ జితేందర్‌కు ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నేతలు జగదీశ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, వివేకానంద, పాడి కౌశిక్‌రెడ్డి, డాక్టర్ సంజయ్

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో బీఆర్ఎస్ కార్యకర్తలు, నేతలపై కాంగ్రెస్ గూండాలు దాడులకు తెగబడుతుంటే పోలీసులు వత్తాసు పలుకుతున్నారని మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. తాము కూడా ఎదురు తిరిగి తన్నడం మొదలుపెడితే లెక్క మరోలా ఉంటుందని హెచ్చరించారు. రాష్ట్రం ప్రశాంతంగా ఉండాలని ఓపిక పడుతున్నామని స్పష్టంచేశారు. రాష్ట్రంలోని ఇటీవలి పరిణామాలు, కాంగ్రెస్ గూండాలపై చర్యలకు పట్టుబడుతూ గురువారం డీజీపీ జితేందర్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రశాంత్‌రెడ్డి, వివేకానంద, పాడి కౌశిక్‌రెడ్డి, డాక్టర్ సంజయ్, సీనియర్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి జగదీశ్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపు తప్పడానికి ప్రధాన కారణం సీఎం, ఆయన వాడుతున్న భాష, ప్రవర్తనేనని తెలిపారు. కౌశిక్‌రెడ్డి ఇంటిపై జరిగిన దాడిలో ఎమ్మెల్యే గాంధీపై సీఎం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓ వ్యక్తిగా, సీఎంగా గాంధీపై చర్యలు తీసుకునే స్థాయి రేవంత్‌కు ఇంకా రాలేదని ఎద్దేవా చేశారు. సీఎం పదవికి ఉన్న గౌరవం, దానికి ఉన్న విలువ కూడా రేవంత్‌కు తెలియదని విమర్శించారు. తాను మాట్లాడే వేదిక ఏమిటో కూడా సీఎం మర్చిపోయి.. బడిపిల్లల దగ్గర కూడా కేసీఆర్, కేటీఆర్‌పై బూతులు తిడుతూ, పీసీసీ అధ్యక్షుడి కార్యక్రమానికి వెళ్లి 'చింతపండు చేసినం' అంటూ మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

దాడుల్లో పోలీసుల పాత్ర

బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలపై జరుగుతున్న దాడుల్లో పోలీసుల పాత్ర కూడా ఉన్నదని జగదీశ్‌రెడ్డి అన్నారు. ఇప్పటికే 4 సంఘటనలు జరిగాయని తెలిపారు. పోలీసుల ఎదుటే కాంగ్రెస్ గుండాలు దాడులు చేస్తున్నా చోద్యం చూస్తున్నారని వెల్లడించారు. ఇదే విషయంపై గతంలోనూ కేటీఆర్ ఆధ్వర్యంలో డీజీపీకి ఫిర్యాదు చేశామని గుర్తుచేశారు. తిరుమలగిరిలో బీఆర్ఎస్ కార్యకర్తలు, రైతుల దీక్షపై కాంగ్రెస్ గూండాలు దాడిచేస్తుంటే, వారికి పోలీసులు సహకరించారని చెప్పారు. ఆ వీడియోలు, ఫొటోలతో సహా డీజీపీకి అప్పగించామని వివరించారు. ఖమ్మంలో నలుగురు మాజీ మంత్రులు, పది మంది ఎమ్మెల్యేలు వరద బాధితులను పరామర్శిస్తూ.. సహాయ కార్యక్రమాలు చేపడితే కాంగ్రెస్ గూండాలు రాళ్ల దాడి చేసి, ఓ కార్యకర్తను కారు కిందకు నెట్టేసి చంపే ప్రయత్నం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మాజీమంత్రి హరీశ్‌రావు కారుపై దాడి చేయడం, హత్యాప్రయత్నం చేయటంపైనా ఫిర్యాదు చేశామని తెలిపారు. సిద్దిపేటలో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసుపై దాడి చేస్తుంటే.. ఏసీపీ అక్కడే ఉన్నా కాంగ్రెస్ గూండాలపై ఎలాంటి చర్యలు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు.

12 ట్రాఫిక్ సిగ్నల్స్ క్లియరెన్స్ ఎలా ఇస్తారు?

బీఆర్ఎస్‌కు న్యాయంగా దక్కాల్సిన పీఏసీ చైర్మన్ పదవిని కాంగ్రెస్‌లో చేరిన అరికెపూడి గాంధీకి ఇవ్వటంపై ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి రాజకీయంగా సవాల్ చేశారని జగదీశ్‌రెడ్డి గుర్తుచేశారు. గాంధీ బీఆర్ఎస్ కండువా కప్పుకోవాలని కౌశిక్‌రెడ్డి సవాల్ చేస్తే.. పోలీసులు పొద్దున్నే హౌజ్‌అరెస్టు చేశారని చెప్పారు. పోలీసులకు గౌరవం ఇచ్చిన కౌశిక్‌రెడ్డి అక్కడే ఉండిపోతే.. '10 గంటలకల్లా రాకపోతే నేను నీ ఇంటికి వస్తాను' అని 20 కిలోమీటర్ల దూరం నుంచి బయల్దేరి ఎమ్మెల్యే గాంధీని అడ్డుకోవాల్సిన ఏసీపీ, సీఐ, ఎస్సైలు 12 చోట్ల ట్రాఫిక్ సిగ్నల్స్‌కు క్లియరెన్స్ ఇచ్చారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇంటిమీదకు తీసుకొచ్చి దగ్గరుండి దాడి చేయించారని, వారిపైనా కేసులు పెట్టాలని డీజీపీని కోరినట్టు వెల్లడించారు. కాంగ్రెస్ నేతల బర్త్‌డేలను ఏకంగా ఎస్సైలు, సీఐలు పోలీసు స్టేషన్లలోనే జరపడం దారుణమని అన్నారు.

లాఠీ దెబ్బలు ఎదుర్కొన్న అనుభవం మాది

పోలీసుల దెబ్బలు తమకు కొత్తేం కాదని, ఉద్యమాలు చేసిన అనుభవం తమది అని జగదీశ్‌రెడ్డి తేల్చిచెప్పారు. 'పోలీసు లాఠీలు ఎదుర్కొన్న అనుభవం మాది. సీఎంగా ఆయన (రేవంత్) నోరు కాపాడుకోవాలె. నోరు మంచిదైతే.. ఊరు మంచిదైతది. నాలుక మంచిగ పెట్టుకోకపోతే.. మీరన్న మాటలు మీకే వర్తిస్తాయి' అని కాంగ్రెస్‌ను జగదీశ్‌రెడ్డి హెచ్చరించారు. కార్యకర్తలు ఏదైనా తప్పులు చేస్తే సరిచేయాల్సిన బాధ్యత నాయకులకు ఉన్నదని, కానీ ఏకంగా సీఎం వారిని రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని డీజీపీకి చెప్పామని జగదీశ్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో గుడులు, మసీదులు, చర్చిలు, పార్టీల ఆఫీసులు ప్రజలకు సంబంధించినవిగానే వాటి నిర్మాణానికి అనుమతులు తీసుకోవడం లేదు. నల్లగొండలో పార్టీ ఆఫీసులపై మాట్లాడుతూ అందరికీ సమ న్యాయం జరగాలని కోరుకుంటున్నామని పేర్కొన్నారు.

ఎంపీ రఘునందన్‌రావుపై హైకోర్టు ఆగ్రహం

- కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ..

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): న్యాయవ్యవస్థపై మీడియా సమావేశంలో బీజేపీ మెదక్ ఎంపీ ఎం రఘునందన్‌రావు అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని హైకోర్టు తీవ్రంగా పరిగణించింది. ఆయనకు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీచేసింది. కోర్టు ధిక్కరణ చర్యలు ఎందుకు తీసుకోరాదో? వివరణ ఇవ్వాలని ఆదేశించింది. సమాజంలో న్యాయవ్యవస్థ గౌరవ, ప్రతిష్ఠలను దెబ్బతీసే ప్రయత్నాలు చేసేలా రఘునందన్ వ్యాఖ్యలు ఉన్నాయని హైకోర్టు న్యాయమూర్తి లేఖ రాశారు. ఆ లేఖను హైకోర్టు సుమోటోగా తీసుకొని క్రిమినల్ కోర్టు ధిక్కరణ పిటిషన్‌గా పరిగణనలోకి తీసుకున్నది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావుతో కూడిన ధర్మాసనం గురువారం విచారణ జరిపి రఘునందన్‌కు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది.

న్యాయమూర్తి లేఖలోని అంశాలు

ఎన్ కన్వెన్షన్ కూల్చివేత వ్యవహారంలో ఆగస్టులో ఎంపీ రఘునందనరావు మీడియా సమావేశం నిర్వహించి న్యాయవ్యవస్థకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారని న్యాయమూర్తి లేఖలో పేర్కొన్నారు. ఎన్ కన్వెన్షన్ తరఫున హౌస్ మోషన్ పిటిషన్ దాఖలు కాగా కూల్చివేతపై స్టే ఇస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడంపై ఎంపీ అనుచిత ఆరోపణలు చేశారని న్యాయమూర్తి ప్రస్తావించారు. జడ్జీలు కండ్లకు గంతలు తీసి చుట్టూ జరుగుతున్నవాటిని గమనించి ఉత్తర్వులు జారీ చేయాలన్నారని లేఖలో వివరించారు. న్యాయమూర్తి లేఖను హైకోర్టు క్రిమినల్ కోర్టు ధిక్కరణ పిటిషన్‌గా పరిగణనలోకి తీసుకుని రఘునందన్‌రావుకు నోటీసులు జారీ చేసింది. మీడియా భేటీల్లో ఇష్టం వచ్చినట్టు ఎలా మాట్లాడతారని నిలదీసింది.. దీనిపై వివరణ ఇస్తూ కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులు జారీ చేసింది. విచారణ నాలుగు వారాలు వాయిదా వేసింది.

దళిత, గిరిజనుల హక్కులకు రేవంత్‌రెడ్డి భంగం

- ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ, క్రీమిలియర్‌కు వ్యతిరేకంగా 30న చలో సచివాలయం : కృష్ణస్వరూప్

ఎదులాపురం, సెప్టెంబర్ 19: దళిత, గిరిజన, బహుజనుల హక్కులను దెబ్బతీయడానికి పూనుకున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తెలంగాణలో బొంద పెట్టాలని ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జాతీయ చైర్మన్, దళిత బహుజన పార్టీ (డీబీపీ) జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ పేర్కొన్నారు. గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో సచివాలయం ముట్టడి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ, క్రీమిలియర్‌కు వ్యతిరేకంగా సెప్టెంబర్ 30న నిర్వహించనున్న చలో సచివాలయం ముట్టడికి తరలిరావాలని పిలుపునిచ్చారు.

కేసీఆర్ హయాంలో భారీగా ఉద్యోగాల సృష్టి

మొదటిపేజీ తరువాయి...

రంగాలకు చెందిన ఎంఎస్ఎంఈల్లో దాదాపు 67 లక్షల మందికి ఉద్యోగాలు లభించాయి. ఇందులో గడిచిన పదేండ్లలోనే దాదాపు 30 లక్షల ఉద్యోగాలు లభించినట్టు వివిధ గణాంకాలు స్పష్టంచేస్తున్నాయి. ముఖ్యంగా ఐటీ, సేవల రంగంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సుమారు 15 లక్షల ఉద్యోగాలు లభించాయి. ఐటీ, పరిశ్రమల మంత్రిగా కేటీఆర్ చేసిన ప్రత్యేక కృషితో పెద్ద ఎత్తున ఐటీ, బ్యాంకింగ్, బీమా సంస్థలు రాష్ట్రంలో కొలువుదీరాయి. రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తులు గణనీయంగా పెరగడంతో ఆహారశుద్ధి రంగంపై దృష్టి కేంద్రీకరించిన కేసీఆర్ సర్కారు, ప్రత్యేక ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లను ఏర్పాటుచేసింది. కోకాకోలా వంటి అనేక బహుళజాతి సంస్థలు కూడా రాష్ట్రంలో ఏర్పాటయ్యాయి. వస్త్ర పరిశ్రమ, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, ఇంజినీరింగ్, ఫార్మా, లైఫ్‌సైన్సెస్ రంగాలకు ప్రత్యేక పారిశ్రామికవాడలను ఏర్పాటుచేసి భారీగా పెట్టుబడులను ఆకర్షించడంలో కేసీఆర్ ప్రభుత్వం విజయవంతమైంది. దీంతో ఆయా రంగాల్లో పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు లభించాయి.

రాష్ట్ర ప్రభుత్వ నివేదిక ప్రకారం రాష్ట్రంలో వివిధ రంగాల్లో లభించిన ఉద్యోగాలు

పరిశ్రమ	సూక్ష్మ	చిన్నతరహా	మధ్యతరహా	మొత్తం
సేవలు	29,34,242	2,39,793	93,330	32,67,365
ఆహార తయారీ	9,23,611	62,271	24,211	10,10,093
ఖనిజ, చెక్క ఆధారిత	4,08,110	26,837	9,379	4,44,326
ఇంజినీరింగ్, క్యాపిటల్ గూడ్స్	3,67,952	67,558	37,763	4,73,273
ఎఫ్ఎంసీజీ, గృహోపకరణాలు	3,60,892	33,411	14,489	4,08,792
టెక్స్‌టైల్స్	2,76,601	10,860	9,348	2,96,809
ఆటోమొబైల్స్	2,46,534	8,292	9,427	2,64,253
ఆరోగ్యం, లైఫ్‌సైన్సెస్	1,42,209	38,605	34,385	2,15,199
ప్లాస్టిక్, పాలిమర్స్	82,314	21,958	14,077	1,18,349
ఎలక్ట్రానిక్స్, ఐటీ హార్డ్‌వేర్	72,574	7,172	8,122	87,868
రత్నాలు, ఆభరణాలు	59,750	8,984	3,398	72,132
వ్యర్థాల నిర్వహణ, గ్రీన్ టెక్నాలజీస్	23,804	1,631	598	26,033
మొత్తం				66,84,492

ఆర్టీసీ కార్మికుల డిమాండ్స్ పరిష్కరించాల్సిందే

- డిమాండ్స్‌డేలో బస్‌భవన్ ఉద్యోగులు

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) ఆధ్వర్యంలో టీజీఎస్‌ఆర్టీసీ బస్‌భవన్ ఉద్యోగులు గురువారం డిమాండ్స్ డే పాటించారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు, రాష్ట్ర కార్యదర్శి భిక్షపతిగౌడ్, ఎంఎన్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ. 430కోట్ల రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రద్దీకి అనుగుణంగా కొత్త బస్సులను కొనుగోలు చేయాలని, రెగ్యులర్ ప్రాతిపదికన నియామకాలు చేపట్టాలని, డ్రైవర్లు, కండక్టర్లపై నమోదైన కేసులను సానుభూతితో ఎత్తివేయాలని కోరారు. సీసీఎస్‌లో డెలిగేట్స్ ఎన్నికలు నిర్వహించేందుకు అనుమతివ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 21న టీజీఎస్‌ఆర్టీసీ జాక్ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద సామూహిక నిరాహారదీక్షలు నిర్వహించనున్నట్టు ఆర్టీసీ జాక్ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ థామస్‌రెడ్డి తెలిపారు.



వరంగల్ జిల్లా నల్లబెల్లిలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిని హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

నిర్బంధం అప్రజాస్వామికం

- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి
- మెడికల్ కాలేజీ తెచ్చిన తననే హౌస్ అరెస్ట్ చేయడం హేయం

నల్లబెల్లి, సెప్టెంబర్ 19: జిల్లా దవాఖాన, మెడికల్ కళాశాలను మంజూరు చేసిన తమపైనే కాంగ్రెస్ ప్రభుత్వం నిర్బంధం విధించడం అప్రజాస్వామికమని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలోని తన నివాసంలో ఆయన గురువారం మాట్లాడారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, అప్పటి ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు నర్సంపేటలో రూ.283కోట్లతో జిల్లా దవాఖానను మంజూరు చేశారన్నారు. తన కోరిక మేరకు కేసీఆర్ ఆనాడే మెడికల్ కాలేజీని మంజూరు చేసినట్లు గుర్తుచేశారు. కళాశాల ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించిన తననే హౌస్ అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

అరెస్టులను ఖండించిన ఎర్రబెల్లి

హనుమకొండ: మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, బీఆర్ఎస్ శ్రేణుల హౌస్ అరెస్ట్‌లను తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పేర్కొన్నారు. మెడికల్ కాలేజీ మంజూరు చేసింది మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వమైతే.. కాంగ్రెస్ ఖాతాలో వేసుకునేందుకు కుటిల యత్నానికి పాల్పడుతున్నదని ఆరోపించారు.

- నీటిని విడుదల చేయాలి



నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలానికి డీ–40 కాల్వ ద్వారా నీటిని విడుదల చేసి చెరువులను నింపి తమను ఆదుకోవాలని గురువారం రైతులు మండలంలోని సీత్యాతండా వద్ద కాల్వలో దిగి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు మారుతి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. సుమారు రెండు నెలల నుంచి కాల్వకు నీటిని విడుదల చేయకపోవడంతో రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మండలంలోని గణపతివారిగూడెం, సీత్యాతండా, పుచ్చకాయలగూడెం, బొమ్మకల్ గ్రామాల్లోని సాగు భూములన్నీ డీ–40 కాల్వ మీదే ఆధారపడి ఉన్నాయని చెప్పారు. అధికారులు కాల్వకు నీరు ఇవ్వకపోవడంతో ఆయా గ్రామాల్లో రైతులు వేసిన పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా అధికారులు డీ–40 కాల్వ ద్వారా చెరువులను నింపి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. -మాడ్గులపల్లి

లక్షల ఎకరాల్లోని పంటలను కాపాడాలి

- కల్లూరు ఇరిగేషన్ ఆఫీసు ఎదుట ధర్నాకు పిలుపు
- రైతు నాయకుల ముందస్తు అరెస్టు.. గృహనిర్బంధం
- నిరసనగా బోడేపూడి భవన్ వద్ద రైతుల నినాదాలు

వైరా టౌన్, సెప్టెంబర్ 19: సాగునీరు విడుదల చేసి లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోకుండా కాపాడాలని డిమాండ్ చేస్తూ రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఇటీవల కురిసిన అతి భారీ వర్షాల వల్ల నాగార్జున సాగర్ ఎడమ కాలువకు గండ్లు పడటంతో 18 రోజులుగా సాగునీరు తమ పంటల పొలాలకు రావడం లేదని పేర్కొన్నారు. దీంతో ఖమ్మం జిల్లాలోని సాగర్ ఆయకట్టు పరిధిలో పాలేరు రిజర్వాయర్ పాత కాలువ కింది పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు ఖమ్మం జిల్లాలోని కల్లూరు ఇరిగేషన్ కార్యాలయం వద్ద గురువారం ఆందోళన చేసేందుకు నిర్ణయించారు. విషయం తెలుసుకున్న పోలీసులు.. అదే రోజు ఉదయం తెలంగాణ రైతు సంఘం నాయకులను ముందస్తు అరెస్టు చేసి గృహ నిర్బంధంలో ఉంచారు. దీంతో మరికొందరు రైతు సంఘం నాయకులు, రైతులు కలిసి వైరా బోడేపూడి వెంకటేశ్వరరావు భవన్ వద్ద నినాదాలు చేశారు. ఖమ్మం జిల్లాలో సాగర్ ఆయకట్టు కింద పంటలు ఎండిపోయి తీవ్రంగా రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని, వెంటనే పాలేరు రిజర్వాయర్ సమీపంలో నాగార్జునసాగర్ ఎడమ కాలువ గండికి సత్వరమే మరమ్మతులను చేయాలని డిమాండ్ చేశారు.



రైతు సంఘం నాయకుల అరెస్టును నిరసిస్తూ, సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం జిల్లా వైరాలో బోడేపూడి భవన్ ఎదుట నినాదాలు చేస్తున్న నాయకులు

స్తంభించిన 'మీ సేవ'లు

- డాటా కేంద్రంలో సాంకేతిక లోపం
- పది రోజులుగా నిలిచిన సర్టిఫికెట్ల జారీ
- నష్టపోతున్న విద్యార్థులు, ఉద్యోగార్థులు

హైదరాబాద్, సెప్టెంబర్ 19(నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా మీసేవ కేంద్రాల్లో పది రోజులుగా సేవలు స్తంభించిపోయాయి. దీంతో ఉన్నత విద్యా కోర్సుల్లో ప్రవేశాలు, ఉద్యోగాల కోసం దరఖాస్తు చేయాల్సిన వారికి సకాలంలో సర్టిఫికెట్లు లభించక తీవ్రంగా నష్టపోతున్నారు. రాష్ట్ర డాటా సెంటర్‌లో సాంకేతిక సమస్య కారణంగా ఈ పరిస్థితి తలెత్తిందని అధికారులు చెప్తున్నారు. డిజిటల్ తెలంగాణలో భాగంగా వివిధ రకాల ప్రభుత్వ సేవలను మీసేవ, ఈసేవ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్నది. 38 ప్రభుత్వ శాఖలకు చెందిన 200 వరకు సేవలు 2,856 మీసేవ కేంద్రాల ద్వారా అందుబాటులో ఉన్నాయి. ఇందులో రెవెన్యూశాఖ నుంచి విద్యార్థులు, ఉద్యోగార్థులు పొందాల్సిన కులం, ఆదాయం, ఈడబ్ల్యూఎస్ తదితర సర్టిఫికెట్లు అతి ప్రధానమైనవి. ప్రస్తుతం పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఎంట్రన్స్ ఎగ్జామ్స్ జరుగుతున్నాయి. డిగ్రీ పూర్తిచేసినవారు వివిధ ప్రవేశ పరీక్షలకు హాజరు కావాలన్నా, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలతోపాటు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఇవి ఎంతో అవసరం. ఉదాహరణకు, వచ్చే ఏడాది ఎంబీఏలో ప్రవేశాల కోసం ఐసెట్ ఎంట్రన్స్ పరీక్ష కోసం పొడిగించిన గడువు కూడా ఈ నెల 20తో పూర్తవుతుంది. అలాగే, ఈ ఏడాది ఎంబీఏ ప్రవేశాల గడువు కూడా ఇటీవలే పూర్తయింది. ఆర్ఆర్‌బీ, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నుంచి వెలువడే పలు నోటిఫికేషన్లు, వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థల అప్రెంటిషిప్ గడువు కూడా ఈ మధ్యనే ముగిసింది. కులం, ఆదా యం తదితర సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకుంటే వారికి ఫీజుల్లో రాయితీ లభించడమే కాకుండా ప్రవేశాల్లో కొంత కోటా వర్తిస్తుంది. పది రోజులుగా మీసేవ కేంద్రాల్లో సేవలు నిలిచిపోవడంతో వీటికి దరఖాస్తు చేసుకున్న వేలాదిమంది అభ్యర్థులు నష్టపోయారు. విద్యార్థులు ఎమ్మార్వో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా పోయింది.

హైడ్రాపై ఆర్డినెన్స్!

- నేడు క్యాబినెట్ భేటీ
- ఎజెండాలో హైడ్రా, ఆర్వోఆర్ చట్టం, పంట నష్టపరిహారం
- రేషన్‌కార్డులు, హెల్త్‌కార్డుల జారీకి మార్గదర్శకాలపై చర్చ

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రిమండలి శుక్రవారం సమావేశం కానున్నది. సచివాలయంలో జరగనున్న క్యాబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్టు సమాచారం. ఇటీవల భారీ వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ఆర్థిక సాయంపై చర్చించి, ఆమోదించే అవకాశం ఉన్నది. చెరువులు, నీటి వనరుల పరిరక్షణకు ఉద్దేశించిన 'హైడ్రా'ను మరింత బలోపేతం చేయడంపై చర్చించి, ఆర్డినెన్స్ జారీకి ఆమోదం తెలుపనున్నట్టు సమాచారం. కొత్త ఆర్వోఆర్ చట్టంపై కూడా మంత్రివర్గం చర్చించి, నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నది. ఇటీవలే ముసాయిదాపై ప్రజాభిప్రాయ సేకరణ పూర్తికాగా, వాటిని క్రోడీకరిస్తూ అధికారులు కొత్త ఆర్వోఆర్ చట్టానికి తుదిరూపు ఇచ్చారు. దీనిపై చర్చించి, ఆర్డినెన్స్ జారీ చేయాలా? అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి నిర్ణయం తీసుకోవాలా? అనే అంశంపై మంత్రివర్గం తుది నిర్ణయం తీసుకోనున్నట్టు సమాచారం. ప్రభుత్వం ఇటీవల నియమించిన వ్యవసాయ, విద్యా కమిషన్లకు చట్టబద్ధత కల్పించే అవకాశం ఉన్నది. కొత్త రేషన్‌కార్డులు, హెల్త్‌కార్డుల జారీకి రూపొందించిన మార్గదర్శకాలపై చర్చించనున్నట్టు తెలిసింది. దీంతోపాటు రాష్ట్రంలో వయసు, అర్హతతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ ఆరోగ్యబీమా ఇచ్చే అంశంపై చర్చించనున్నట్టు సమాచారం. కొత్తగా దాదాపు 200 గ్రామ పంచాయతీల ఏర్పాటుకు ఆమోదం తెలుపనున్నట్టు సచివాలయ వర్గాలు తెలిపాయి. యూనివర్సిటీలకు కొత్త పేర్లకు ఆమోదం తెలుపనున్నది. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, కొండా లక్ష్మణ్ బాపూజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ పేర్లకు ఆమోదం తెలుపనున్నది.

జనం లేని సదస్సుకు పది కోట్లా?

- ఏఐ సదస్సు పేరిట కాంగ్రెస్ నిధుల వరద
- పెద్ద స్కాం ఉన్నట్టు సర్కార్‌పై ఆరోపణలు

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సదస్సు పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేసిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. హైదరాబాద్ వేదికగా సెప్టెంబర్ 5-6 తేదీల్లో నిర్వహించిన ఏఐ సదస్సుకు రూ.10 కోట్లు విడుదల చేయగా, జనాలు, ప్రతినిధుల్లేని సదస్సుకు ఇంతమొత్తంలో ఎలా ఖర్చు చేశారనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. కాన్ఫరెన్స్ పేరిట కోట్లు పక్కదారి పట్టించిందనే ఆరోపణలు జోరందుకుంటున్నాయి. హైదరాబాద్ వేదికగా గతంలో ఎన్నో అంతర్జాతీయ సదస్సులు జరిగినా ఈ స్థాయిలో ఖర్చు జరగలేదని.. ఇదో స్కాంలా ఉన్నదని ఐటీ వర్గాల్లో చర్చ నడుస్తున్నది. బడ్జెట్ రిలీజ్ ఆర్డర్ ద్వారా రూ.9.5 కోట్లు విడుదల చేయగా, దీనికి అదనంగా స్పాన్సర్లు ఇచ్చే సొమ్ము కలుపుకుంటే రూ.పది కోట్లపైనే ఉంటుందని, ఇదంతా ఖర్చు చేశారా? ఆ పేరిట స్వాహా చేశారా? అన్న చర్చ జరుగుతున్నది. ఈ సదస్సుతో ఒక్క రూపాయి కూడా పెట్టుబడి రాలేదని పేర్కొంటున్నారు.

అవయవాల దానంతో 'విశాల' ఆదర్శం

పెద్దఅంబర్‌పేట, సెప్టెంబర్ 19: కౌతా అన్నపూర్ణ విశాలాక్షి (62) బ్రెయిన్ స్ట్రోక్‌తో దవాఖానలో చేరి.. ఈ నెల 16న కన్నుమూశారు. కిడ్నీలు, లివర్ దానం చేసి ఆదర్శంగా నిలిచారు. కౌతా శ్రీనివాస్, అన్నపూర్ణ విశాలాక్షి ఆదర్శ దంపతులు. రెండున్నర దశాబ్దాలుగా రంగారెడ్డి జిల్లా పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధిలోని తట్టిఅన్నారంలో నివసిస్తున్నారు. ఈ నెల మొదటి వారంలో విశాలాక్షికి బీపీ పెరిగిపోయి బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. బంధువుల సాయంతో ఆమెను ఓ ప్రైవేటు దవాఖానలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందారు. భర్త శ్రీనివాస్ అంగీకారంతో విశాలాక్షి కిడ్నీలు, లివర్‌ను జీవన్‌దాన్‌కు అందజేశారు. విశాలాక్షి మరణించినా.. అవయవాల దానంతో ఆమె ఎప్పటికీ బతికే ఉంటుందని భర్త పేర్కొన్నారు. అంత్యక్రియలు గురువారం నిర్వహించారు.

నిర్ణయాలు ఘనం.. అమలు మందగమనం

ఒక్కటీ సరిగా అమలుకాని రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయాలు • ఉపసంఘం పేరుతో కాలయాపన



హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర మంత్రిమండలి ఒక నిర్ణయం తీసుకున్నదంటే కచ్చితంగా అమలవుతుందని ప్రజలు నమ్ముతుంటారు. అయితే రాష్ట్ర క్యాబినెట్ ఇప్పటివరకు తీసుకున్న నిర్ణయాల్లో కొన్ని అమలు కావటం లేదు. సమావేశం తర్వాత ఫలానా నిర్ణయం తీసుకున్నామని ప్రభుత్వం ఘనంగా చెప్పుకుంటున్నా.. అమల్లో మాత్రం మందగమనం కనిపిస్తున్నదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత క్యాబినెట్‌లో తీసుకున్న నిర్ణయాల అమలుపై సమీక్షించి, వేగంగా పూర్తిచేసే వ్యవస్థ లేకపోవటమే ఇందుకు కారణమని అంటున్నారు. కీలక నిర్ణయాలపై మంత్రివర్గ ఉపసంఘం వేసి కాలయాపన చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

మార్చి 12న జరిగిన క్యాబినెట్ సమావేశంలో.. 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఆమోదం తెలిపారు. గ్రామ సభలు పెట్టి దరఖాస్తులపై చర్చించి, జాబితా రూపొందిస్తామని చెప్పారు. కానీ ఇంతవరకు ఒక్క ఇల్లుకు కూడా నిధులు విడుదల కాలేదు. మహిళా సంఘాల బ్రాండింగ్ కోసం ఓఆర్‌ఆర్ చుట్టూ 30 ఎకరాల స్థలం కేటాయించాలని నిర్ణయించినా ఇప్పటివరకు అమలు కాలేదు. డీఎస్సీ 2008 బాధితులకు ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. విధివిధానాల ఖరారును సబ్ కమిటీకి అప్పగించారు. అయితే ఇప్పటివరకు పూర్తి కాలేదు.

జూన్ 21న జరిగిన క్యాబినెట్ సమావేశంలో అందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయాలని నిర్ణయించారు. ఇందుకు రూ.31 వేల కోట్లు అవసరం అవుతాయని చెప్పారు. కానీ.. ఇప్పటికీ పూర్తికాలేదు. రూ.18 వేల కోట్లతో రుణమాఫీ చేశామని స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. అంటే ఇంకా రూ.13 వేల కోట్ల రుణమాఫీ కాలేదని రాజకీయ విశ్లేషకులు విమర్శిస్తున్నారు. రైతు భరోసాపై మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. కమిటీ జూలై 15లోగా ప్రభుత్వానికి నివేదిక ఇస్తుందని, అసెంబ్లీలో ప్రవేశపెట్టి చర్చ జరుపుతామని చెప్పారు. కానీ.. నివేదిక అందలేదు. అసెంబ్లీలో చర్చించలేదు.

ఆగస్టు 1న జరిగిన క్యాబినెట్ సమావేశంలో.. కొత్త రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు జారీ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. వీటికి సంబంధించిన విధివిధానాల రూపకల్పన బాధ్యతలను సబ్ కమిటీకి అప్పగించారు. రేషన్‌కార్డులకు కొత్తగా అక్టోబర్ 2 నుంచి దరఖాస్తులు తీసుకోవాలని సీఎం గురువారం ఆదేశించగా, ఆరోగ్యశ్రీ కార్డులపై స్పష్టత రాలేదు. క్రీడాకారులు నిఖత్ జరీన్, సిరాజ్‌కు గ్రూప్-1 ఉద్యోగాలు ఇస్తామని నిర్ణయించగా, సిరాజ్‌కు ఇప్పటివరకు ఉద్యోగం ఇవ్వలేదు. విధి నిర్వహణలో మరణించిన ఇంటెలిజెన్స్ డీజీ రాజీవ్‌రతన్ కుమారుడు హరిరతన్‌కు మున్సిపల్ కమిషనర్ ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయించినా అమల్లోకి రాలేదు. నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు చర్యలు చేపడుతామని చెప్పినా ఆచరణలోకి రాలేదు. ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తామని, ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల చేసిన ఉద్యోగాలకు సంబంధించి అవసరమైతే ఆర్డినెన్స్ తీసుకొచ్చి అయినా అమలు చేస్తామని మీడియా ముందు చెప్పారు. కానీ ఇప్పటికీ ఆర్డినెన్స్ తేలేదు.

3 రోజులు వర్షాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రానున్న మూడు రోజులపాటు ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. నైరుతి రుతుపవనాల తిరోగమన ప్రక్రియ ప్రారంభమైందని, వీటి ప్రభావంతో ఉత్తర, మధ్య బంగాళాఖాతంలో 24న అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని, ఈ రుతుపవనాల తిరోగమనంలోనూ భారీ వర్షాలకు అవకాశం ఉన్నదని అధికారులు చెప్తున్నారు.

'స్త్రీనిధి' ఎండీపై విచారణ కమిటీ

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): స్త్రీ నిధి సహకార సమాఖ్య ఎండీ విద్యాసాగర్‌రెడ్డిపై వచ్చిన అవినీతి ఆరోపణలపై ప్రభుత్వం కమిటీ వేసింది. ఐఏఎస్ అనితారామచంద్రన్, సహకార శాఖ అదనపు రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు, ఆర్థిక శాఖ ఉప కార్యదర్శి చంద్రకళ, ఐటీ శాఖ ఎంజీఎం శ్రీనివాస్‌ను సభ్యులుగా చేర్చింది. స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు విచారణ జరుపుతున్నారు.



ఎన్నికల కమిషనర్ బాధ్యతల స్వీకరణ

గవర్నర్‌ను కలిసిన రాణి కుముదిని

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా రాణి కుముదిని బాధ్యతలు స్వీకరించారు. మాసాబ్ ట్యాంక్‌లోని ఎన్నికల కమిషన్ కార్యాలయంలో గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఈసీ కార్యదర్శి అశోక్ కుమార్, ఇతర అధికారులు ఆమెను అభినందించి స్థానిక సంస్థల ఓటరు జాబితా షెడ్యూల్ వివరించారు. అనంతరం ఆమె రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. మూడేండ్ల పాటు ఆమె బాధ్యతల్లో కొనసాగనున్నారు.

15 ఏండ్లు దాటిన వాహనాలు తుక్కుకే

జనవరి 1 నుంచే అమల్లోకి!

హైదరాబాద్, సెప్టెంబర్ 19(నమస్తే తెలంగాణ) : జనవరి 1 నుంచి కాలుష్య కారక వాహనాల రద్దుకు ప్రభుత్వం సిద్ధమైనట్లు తెలిసింది. దీని అమలు ప్రకారం ఏదైనా వెహికిల్ 15ఏండ్లు దాటితే రోడ్లపై తిరగడానికి వీలు ఉండదు. ఒకవేళ వాహనం కండీషన్‌లో ఉంటే ప్రభుత్వం నిర్వహించే ఫిట్‌నెస్ టెస్టులో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. లేకుంటే వాటిని రోడ్లపైకి అనుమతించరు. త్వరలోనే ప్రభుత్వం దీనిపై నిర్ణయం తీసుకునే అవకాశాలున్నట్టు సమాచారం. 15 ఏండ్లకు పైబడిన వాహనాలకు ఫిట్‌నెస్ లేనట్లు తేలితే యజమానులు వాహనాన్ని స్క్రాప్ చేయాల్సి ఉంటుంది. నిబంధనలు ఉల్లంఘిస్తే ట్రాఫిక్ నియమాల మేరకు ఫైన్ లేదా వాహనాన్ని సీజ్ చేసే అవకాశం ఉంటుంది. అయితే టెస్టులో ఫిట్‌నెస్ ఉన్నట్టు గుర్తించిన వాహనాలకు గ్రీన్ ట్యాక్స్ చెల్లించి అదనంగా 3-5 ఏండ్లపాటు కొనసాగించవచ్చు. రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ వెహికిల్ స్క్రాపేజ్ పాలసీ ముసాయిదా బిల్లును రూపొందించి ఆమోదం కోసం ప్రభుత్వానికి సమర్పించినట్టు తెలిసింది.

సీఎం సహాయనిధికి ఒకరోజు మూలవేతనం

ఆయా విభాగాలకు స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆదేశాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): సీఎం సహాయ నిధికి ఉద్యోగుల ఒకరోజు మూలవేతనాన్ని విరాళంగా జమచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు గురువారం ఆదేశాలు జారీచేశారు. సెప్టెంబర్ వేతనాల్లోంచి ఒకరోజు మూలవేతనం కుదింపు ద్వారా సీఎం సహాయనిధికి ఇవ్వాలని పేర్కొన్నారు.

సింగరేణి 10.25 కోట్ల విరాళం

వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి సింగరేణి రూ. 10.25 కోట్ల విరాళాన్ని ఇచ్చింది. గురువారం ఇందుకు సంబంధించిన చెక్కును సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమక్షంలో సింగరేణి సీఎండీ బలరాం, ఎనర్జీ సెక్రటరీ రొనాల్డ్ రాస్ అందజేశారు. సింగరేణి కాలరీస్ అధికారులు, ఉద్యోగుల ఒక్కరోజు బేసిక్ వేతనాన్ని అందించారు. సీపీఐ నేత కొత్తగూడెం ఎమ్మెల్యే రూ. 2.50 లక్షల విరాళం చెక్కును సీఎం రేవంత్‌కు అందించారు.


ఆ కేసును కొట్టేయండి

డిప్యూటీ కమిషనర్ నందగిరి సుధాంశ్

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ) : హైడ్రా ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సైబరాబాద్ పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టేయాలని చందానగర్ సర్కిల్ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ నందగిరి సుధాంశ్ హైకోర్టులో గురువారం పిటిషన్ వేశారు. శేరిలింగంపల్లి మండలం మదీనగూడలోని ఈర్ల చెరువు బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలకు అనుమతులివ్వడం, వాటిని అడ్డుకోవడంలో విఫలమైన అధికారులపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఫిర్యాదు చేశారు. నీటి పారుదల శాఖ అధికారులు మున్సిపల్ అధికారులకు లేఖ రాసినా చర్యలు తీసుకోవడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. నిబంధనల మేరకు విధులు నిర్వహించానని, తనపై నమోదు చేసిన కేసు చట్ట వ్యతిరేకమని, అందులోని అభియోగాలు నిరాధారమని, వాటిని కొట్టివేయాలని సుధాంశ్ కోరారు.


ఎఫ్‌ఎస్‌ఎన్‌ఎల్‌ను అమ్మేసిన కేంద్రం

రూ.320 కోట్లకు జపాన్ సంస్థకు విక్రయం



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19: కేంద్ర సర్కార్ మరో ప్రభుత్వరంగ సంస్థను అమ్మేసింది. వాటాల విక్రయంలో భాగంగా ఫెర్రో స్క్రాప్ నిగం లిమిటెడ్(ఎఫ్‌ఎస్‌ఎన్‌ఎల్)ని జపాన్‌కు చెందిన కోనాయికీ ట్రాన్స్‌పోర్ట్ కో లిమిటెడ్‌కు రూ.320 కోట్లకు విక్రయించింది. స్టీల్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ ఎఫ్‌ఎస్‌ఎన్‌ఎల్..ఎంఎస్‌టీసీ లిమిటెడ్‌కు చెందిన 100 శాతం సబ్సిడరీ సంస్థ. ఈ ఎఫ్‌ఎస్‌ఎన్‌ఎల్ విక్రయానికి కేంద్రం గతంలోనే నిర్వహించిన బిడ్డింగ్ ప్రక్రియకు రెండు బిడ్డింగ్‌లు టెక్నికల్‌గా అర్హత సాధించాయి. వీటిలో జపాన్‌కు చెందిన కోనాయికీ అత్యధికంగా రూ.320 కోట్ల బిడ్డింగ్ దాఖలుకు కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, నిర్మలా సీతారామన్, హెచ్‌డీ కుమార స్వామి నేతృత్వంలోని ప్రత్యేక కమిటీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రిజర్వు ధర రూ.262 కోట్లుకాగా, బిడ్డింగ్ రూ.320 కోట్లు దాఖలవడంతో దీనికి మొగ్గుచూపింది కేంద్రం. మరో బిడ్ ఇండిక్ జియో రిసోర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్(చందన్ స్టీల్ లిమిటెడ్‌కు చెందిన సబ్సిడరీ సంస్థ) దాఖలు చేసినట్లు తెలిపింది. టోక్యో స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో లిస్టైన కోనాయిక్ ట్రాన్స్‌పోర్ట్ కో లిమిటెడ్. సంస్థకు స్టీల్ రంగంలో 140 ఏండ్లకు పైగా అనుభవం ఉన్నది. 1979 నుంచి ఎఫ్‌ఎస్‌ఎన్‌ఎల్ స్టీల్ మిల్ సేవలను అందిస్తున్నది. పలు స్టీల్ ప్లాంట్ల నుంచి సేకరించిన స్క్రాప్ స్టీల్‌ను తిరిగి వినియమయంలో తెస్తున్నది సంస్థ.

హైదరాబాద్‌లో అల్ట్రావయలెట్



హైదరాబాద్, సెప్టెంబర్ 19: ప్రముఖ ఎలక్ట్రిక్ వాహన మోటార్‌సైకిళ్ల తయారీ సంస్థ అల్ట్రావయలెట్... తాజాగా రాష్ట్రంలోకి అడుగుపెట్టింది. హైదరాబాద్‌లో తన తొలి షోరూంను గురువారం ప్రారంభించింది. దీంతో సంస్థకు ఇది ఐదో షోరూం కావడం విశేషం. ఈ సందర్భంగా కంపెనీ సీఈవో, కో-ఫౌండర్ నారాయణ్ సుబ్రమణియమ్ మాట్లాడుతూ.. వ్యాపార విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లో అడుగుపెట్టినట్లు, ఈ ఏడాది చివరినాటికి మొత్తం అవుట్‌లెట్ల సంఖ్యను పదికి పెంచుకోబోతున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో అధిక మైలేజీని కోరుకుంటున్నవారిని దృష్టిలో పెట్టుకొని తొలి మాడల్ ఎఫ్77ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ బైకు సింగిల్ చార్జింగ్‌తో 320 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నదన్నారు. దీంట్లో 7.1 కిలోవాట్లా బ్యాటరీ కలిగిన మాడల్ ధర రూ.2.99 లక్షలుగాను. 10.1 కిలోవాట్లా బ్యాటరీ మాడల్ రూ.3.99 లక్షలుగా నిర్ణయించింది. మరోవైపు, శుక్రవారం సంస్థ గంటకు 265 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోయే ఎఫ్99ని స్పోర్ట్స్ బైకును ఆవిష్కరించనున్నట్లు చెప్పారు. వచ్చే 2-3మూడేండ్లలో మరో 3-4 మాడళ్లను దేశీయ మార్కెట్లోకి విడుదల చేయనున్నట్లు ప్రకటించిన ఆయన... ఈ బైకులపై ఎనిమిదేండ్లు లేదా 8 లక్షల కిలోమీటర్ల వ్యారెంటీ కల్పిస్తున్నది.

సేల్స్‌ఫోర్స్ విస్తరణ


శాన్ ఫ్రాన్సిస్కో, సెప్టెంబర్ 19: కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్ సేవల సంస్థ సేల్స్‌ఫోర్స్..భారత్‌లో తన వ్యాపారాన్ని శరవేగంగా విస్తరిస్తున్నది. హైదరాబాద్‌తోపాటు బెంగళూరులలో ఉన్న సెంటర్లను ఆధునీకరించడానికి మరిన్ని పెట్టుబడులు పెట్టబోతున్నట్లు కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ అధికారి బ్రియాన్ మిల్హమ్ తెలిపారు. మరోవైపు, కంపెనీ దేశీయ హెడ్ అరుంధతీ భట్టాచార్య మాట్లాడుతూ..భారత్‌లో ఉద్యోగుల సంఖ్యను గడిచిన రెండేండ్లలో రెండింతలు పెంచినట్లు, ప్రస్తుతం 13 వేల మంది విధులు నిర్వహిస్తున్నారని, మరింత మందిని తీసుకునే అవకాశాలున్నట్లు చెప్పారు.

హెరిటేజ్ ఐస్‌క్రీం ప్లాంట్

హైదరాబాద్, సెప్టెంబర్ 19: ప్రముఖ పాల ఉత్పత్తుల సంస్థ హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్..తాజాగా తెలంగాణలో ఐస్‌క్రీం ప్లాంట్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించింది. షామీర్‌పేట్‌లో రూ.204 కోట్ల పెట్టుబడితో నెలకొల్పబోతున్నట్లు తెలిపింది. ఈ ప్లాంట్ ఏర్పాటునకు సంబంధించి కంపెనీ బోర్డు డైరెక్టర్లు సమావేశమై గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. తెలుగు రాష్ట్రాల్లో ఐస్‌క్రీంకు పెరుగుతున్న గిరాకీని దృష్టిలో పెట్టుకొని ఈ యూనిట్‌ను నెలకొల్పాలని నిర్ణయించినట్లు, వచ్చే ఏడాది నవంబర్ నాటికి ఈ యూనిట్ అందుబాటులోకి రానున్నట్లు కంపెనీ వర్గాల వెల్లడించాయి.

వాణిజ్య

టప్పర్‌వేర్ దివాలా



ఆర్థిక సంక్షోభంలో ప్లాస్టిక్ కిచెన్‌వేర్ దిగ్గజం • అమెరికా కోర్టులో పిటిషన్ దాఖలు

తగ్గిన గిరాకీ, పెరిగిన పోటీతో కుదేలు • రూ.10వేల కోట్ల రుణ భారం



న్యూయార్క్, సెప్టెంబర్ 19: ప్రముఖ ప్లాస్టిక్ కిచెన్‌వేర్ బ్రాండ్ టప్పర్‌వేర్ దివాలా తీసింది. అమెరికా బ్యాంక్‌రప్సీ కోర్టులో చాప్టర్ 11 బ్యాంక్‌రప్సీ రక్షణను కోరుతూ పిటిషన్‌ను దాఖలు చేసింది. ఆహార పదార్థాల నిల్వలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చిన ఈ సంస్థ.. ప్రస్తుత మార్కెట్‌లో నెలకొన్న పోటీని తట్టుకోలేక చతికిలపడింది. పర్యావరణ పరిరక్షణపై పెరిగిన అవగాహన, ప్లాస్టిక్ వినియోగంపై మారుతున్న కస్టమర్ల అభిప్రాయాలు సైతం టప్పర్‌వేర్ అమ్మకాలకు గండి కొట్టాయి.

80 ఏండ్ల కిందట..

అమెరికాలోని ఫ్లోరిడాలోగల ఓర్లాండో ప్రధాన కేంద్రంగా 1942లో టప్పర్‌వేర్ బ్రాండ్‌ను ఎర్ల్ టప్పర్ స్థాపించారు. 1946లో మార్కెట్‌కు వీటి ఉత్పత్తులు పరిచయమయ్యాయి. అప్పట్నుంచి టప్పర్‌వేర్ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పెరుగుతూ వచ్చింది. కానీ మార్కెట్‌లో పెరిగిన పోటీతో అమ్మకాలు తగ్గుముఖం పట్టడం ప్రారంభమైంది. క్లీనెక్స్, టెఫ్లాన్, ఇతర బ్రాండ్ల దూకుడు ముందు టప్పర్‌వేర్ నిలదొక్కుకోలేకపోయింది. ఇక డైరెక్ట్ సేల్స్ నుంచి వినియోగదారులు దూరం జరుగడం కూడా సంస్థ వ్యాపారాన్ని దెబ్బతీసిందని దివాలా పిటిషన్‌లో టప్పర్‌వేర్ పేర్కొన్నది.

పీకల్లోతు అప్పులు

దివాలా పిటిషన్ ప్రకారం టప్పర్‌వేర్‌పై రూ.10,000 కోట్ల (1.2 బిలియన్ డాలర్లు) రుణ భారం ఉన్నది. రుణదాతలతో చేసుకున్న ఒప్పందాలనూ ఇది మీరినట్టు తెలుస్తున్నది. అయితే సుమారు రూ.5,700 కోట్ల (679.5 మిలియన్ డాలర్ల) ఆస్తులు కూడా ఉన్నట్టు కంపెనీ చెప్తున్నది. ఇక ప్రస్తుతం సంస్థ ఉద్యోగుల సంఖ్య 5,500. భారత్‌తోపాటు 41 దేశాల్లో వీరంతా పనిచేస్తున్నారు. 4.65 లక్షల కన్సల్టెంట్లు ఉన్నారు. ఫ్రీలాన్స్ బేసిస్‌లో దాదాపు 70 దేశాల్లో టప్పర్‌వేర్ ఉత్పత్తులను అమ్ముతున్నారు.

భారత్‌లో యథాతథంగానే..

అమెరికా దివాలా కోర్టులో పిటిషన్ దాఖలు చేసినప్పటికీ.. భారత్‌లో టప్పర్‌వేర్ అమ్మకాలు యథాతథంగానే సాగుతాయని సంబంధిత వర్గాల నుంచి అందుతున్న సమాచారం. దేశీయంగానే టప్పర్‌వేర్ ఉత్పత్తుల తయారీ జరుగుతున్నది కాబట్టి.. అంతర్జాతీయ మార్కెట్‌లో తలెత్తిన ఇబ్బందులు ఇక్కడ ప్రభావం చూపబోవని వారంటున్నారు. అంతేగాక మునుపటిలాగే విస్తరణ ఉంటుందని, కస్టమర్ల అభిరుచులకు తగ్గట్టుగా నాణ్యమైన ఉత్పత్తులను మార్కెట్‌లోకి తెస్తామని చెప్తున్నారు. ఇప్పటికే గ్లాస్, స్టీల్ ఉత్పత్తులనూ టప్పర్‌వేర్ బ్రాండ్ అమ్ముతున్న విషయం తెలిసిందే.

'దివాలా ప్రక్రియ అంటే సంస్థ మనుగడకు కావాల్సిన వెసులుబాట్లను కల్పించడమే. ఈ కంపెనీ ఎక్కడికీ పోదు. ఎప్పట్లాగే ఇకపైనా మా నాణ్యమైన ఉత్పత్తులు మార్కెట్‌లో లభిస్తాయి'
-లారీ అన్ గోల్డ్‌మన్, టప్పర్‌వేర్ అధ్యక్షుడు, సీఈవో

దేశానికే ఆదర్శంగా స్కిల్ వర్సిటీ

- కంపెనీలు, పారిశ్రామికవేత్తలు భాగస్వాములవ్వాలి: సీఎం రేవంత్
- దసరా తర్వాత కోర్సులు ప్రారంభం



స్కిల్ యూనివర్సిటీపై సచివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి. చిత్రంలో మంత్రి శ్రీధర్ బాబు, వర్సిటీ చైర్మన్ ఆనంద్ మహీంద్రా

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలు, ప్రముఖ కంపెనీలు ఈ యూనివర్సిటీలో భాగస్వాములవ్వాలని, యువతకు నైపుణ్యాలను పెంచి.. వారికి ఉపాధి కల్పించేందుకు తమవంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. యూనివర్సిటీ బోర్డుతోపాటు రాష్ట్రంలోని వివిధ రంగాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, కంపెనీల ప్రతినిధులతో గురువారం సచివాలయంలో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. వర్సిటీకి రాష్ట్ర ప్రభుత్వం తరపున 150 ఎకరాల స్థలంతోపాటు రూ.100 కోట్లు కేటాయించామన్నారు. రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలు యూనివర్సిటీ నిర్వహణ కోసం కార్పస్ ఫండ్ ఏర్పాటుకు, భవనాల నిర్మాణానికి ముందుకు రావాలని కోరారు. బోర్డు చైర్మన్‌గా ఆనంద్ మహీంద్రా యూనివర్సిటీకి బ్రాండ్ ఇమేజీని తీసుకువస్తారనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. అలాగే ఇకపై తమ ప్రభుత్వం యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుపై దృష్టి సారిస్తుందన్నారు. దాదాపు 200 ఎకరాల్లో స్పోర్ట్స్ యూనివర్సిటీని నెలకొల్పి.. 2028 ఒలింపిక్స్‌లో దేశానికి గోల్డ్ మెడల్ తీసుకురావాలనే లక్ష్యంతో క్రీడాకారులకు శిక్షణను అందిస్తామన్నారు. ఇందుకోసం రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేసేందుకైనా సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. ఆనంద్ మహీంద్రా మాట్లాడుతూ.. ప్రపంచానికి నైపుణ్యమున్న యువతను అందించే గమ్యస్థానంగా తెలంగాణ నిలబడుతుందనడంలో సందేహం లేదన్నారు. కాగా, దసరా తర్వాత కోర్సులను ప్రారంభించనున్నట్టు బోర్డు సూచనప్రాయంగా వెల్లడించింది. తొలి ఏడాది 2వేల మందికి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు, బోర్డు కో చైర్మన్ శ్రీని రాజు, సభ్యులు దేవయ్య, సుచిత్రా ఎల్లా, సతీష్ రెడ్డి, సీఎస్ శాంతి కుమారి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ తదితరులు పాల్గొన్నారు. కాగా, స్పెయిన్ రాయబారి జువాన్ ఆంటోనియో మార్చ్ పుజోల్ గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడంపై సీఎంను అభినందించారు. స్పెయిన్‌ను సందర్శించాల్సిందిగా ఆహ్వానించారు.

భారత్‌పై ఫెడ్ ప్రభావమెంత!

అర శాతం వడ్డీరేట్ల కోతపై భిన్నాభిప్రాయాలు

ముంబై, సెప్టెంబర్ 19: వడ్డీరేట్లను అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ అర శాతం కోత పెట్టిన నేపథ్యంలో భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న మార్కెట్ల మీద ఆ ప్రభావం ఎంతన్నదానిపై నిపుణుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు దేశీయ ఎక్స్‌పర్ట్స్ పెట్టుబడులు పెరుగుతాయంటుంటే.. మరికొందరు ఈక్విటీలపై రాబడులు తగ్గుతాయని, బంగారం ధరలు పెరుగవచ్చని అభిప్రాయపడుతున్నారు. అమెరికా ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ.. బెంచ్ మార్క్ రేటును 50 బేసిస్ పాయింట్లు తగ్గించి 4.75-5 శాతంగా నిర్ణయించిన విషయం తెలిసిందే. మునుపు ఇది 5.25-5.50 శాతంగా ఉండేది. గాడి తప్పిన దేశ ఆర్థిక వ్యవస్థను పట్టాలెక్కించేందుకు వరుసగా 14 నెలలపాటు 20 ఏండ్ల గరిష్ఠ స్థాయిలోనే కీలక వడ్డీరేటును అగ్రరాజ్య సెంట్రల్ బ్యాంక్ ఉంచింది. 'ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల కోత ఊహించిందే. బంగారం ధరల్లో పెరుగుదలకు, ఈక్విటీ మార్కెట్లలో పెట్టుబడులపై లాభాల తరుగుదలకు ఈ నిర్ణయం దారితీయవచ్చు' అని పీహెచ్‌డీసీసీఐ అధ్యక్షుడు సంజీవ్ అగర్వాల్ అంచనా వేస్తున్నారు. అలాగే ఫెడ్ నిర్ణయంతో పెట్టుబడులన్నీ స్టాక్ మార్కెట్ల నుంచి పసిడి వైపునకు మళ్లీ ధరలు కొత్త రికార్డులకు చేరవచ్చని కామా జ్యుయెల్లరీ ఎండీ కొలిన్ షా అభిప్రాయపడ్డారు. అయితే భారత్ వంటి దేశాల్లో సెంట్రల్ బ్యాంకులు వడ్డీరేట్లను తగ్గించడానికి ఫెడ్ రిజర్వ్ మార్గం సుగమం చేసిందని బిజ్2క్రెడిట్ సీఈవో రోహిత్ అరోరా అంటున్నారు. వచ్చే నెల ద్రవ్యసమీక్షలో రెపో రేటు తగ్గవచ్చని చెప్తున్నారు.

రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టండి : తుమ్మల

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీలకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు కోరారు. ఈ మేరకు ఢిల్లీలో జరుగుతున్న ప్రపంచ ఆహార సమ్మిట్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీలతో ఆయన సమావేశమై..రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడులకు భారీగా అవకాశాలున్నాయని సూచించారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న వనరులు, ప్రభుత్వం నుంచి అందించే సహకారాన్ని వివరించారు. అంతకు ముందు కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కలిసిన ఆయన.. పామాయిల్‌పై దిగుమతి సుంకం పెంచినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

పాక్షికంగా సమ్మె విరమణ!

- రేపటి నుంచి అత్యవసర సేవలకు హాజరు
- ఓపీడీ విధులకు మాత్రం దూరం.. కోల్‌కతా జూనియర్ వైద్యుల ప్రకటన
- హత్యాచార ఘటనపై ఆందోళన కొనసాగుతుందని వెల్లడి



కోల్‌కతాలోని మెడికల్ కౌన్సిల్ ఆఫీస్ వద్ద వైద్యుల ఆందోళన

కోల్‌కతా, సెప్టెంబర్ 19: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్‌కతా హత్యాచార ఘటనపై గత 42 రోజులుగా నిరసనను చేపడుతున్న అక్కడి జూనియర్ డాక్టర్లు ఒక మెట్టు దిగారు. తమ డిమాండ్లను నెరవేర్చుతామని మమతా బెనర్జీ సర్కార్ అంగీకరించిన నేపథ్యంలో, పాక్షికంగా సమ్మెను విరమిస్తున్నట్టు గురువారం రాత్రి ప్రకటించారు. శనివారం నుంచి అత్యవసర వైద్య సేవలకు హాజరవుతున్నట్టు తెలిపారు. ఔట్ పేషెంట్ విభాగం (ఓపీడీ)లో విధులకు మాత్రం దూరంగా ఉంటామని, హత్యాచార ఘటనపై తమ నిరసన కొనసాగుతుందని వైద్యులు ప్రకటించారు. కోల్‌కతా స్వాస్థ్య భవన్ ముందు చేపట్టిన ధర్నాను ఉపసంహరిస్తున్నట్టు 'వెస్ట్ బెంగాల్ జూనియర్ డాక్టర్స్' ఫ్రంట్ సభ్యులు ప్రకటించారు. సీఎం మమతా బెనర్జీతో ముఖాముఖి చర్చల అనంతరం, కోల్‌కతా జూనియర్ డాక్టర్లు కీలక నిర్ణయం ప్రకటించారు. తమకు న్యాయం జరిగేవరకు రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ డాక్టర్లు ఓపీడీ విధులకు దూరంగా ఉంటారని, రాష్ట్రవ్యాప్తంగా తమ ధర్నా కొనసాగుతుందని స్పష్టం చేశారు. హామీలు నెరవేర్చేందుకు వారం రోజులు ఎదురుచూస్తామని, అవసరం అనుకుంటే ఉద్యమాన్ని మళ్లీ ఉధృతంగా చేపడతామని అన్నారు. హత్యాచార ఘటనలో న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం కోల్‌కతాలోని సీబీఐ కార్యాలయం వైపు భారీ ర్యాలీ చేపడుతున్నట్టు ప్రకటించారు. హత్యాచార ఘటనలో న్యాయం చేయడానికి ఇంకెంత కాలం పడుతుందని సీబీఐని ప్రశ్నించదలుచుకున్నామని అన్నారు. దీనికి సీబీఐ వర్గాలు తప్పకుండా సమాధానం చెప్పి తీరాలని డాక్టర్లు డిమాండ్ చేశారు.

ఆర్జీ కర్ మాజీ ప్రిన్సిపాల్ మెడికల్ రిజిస్ట్రేషన్ రద్దు

కోల్‌కతా ఆర్‌జీ కర్ హాస్పిటల్ పీజీ ట్రైనీ వైద్యురాలు హత్యాచార ఘటనకు సంబంధించిన కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ, హాస్పిటల్ మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్ మెడికల్ రిజిస్ట్రేషన్‌ను పశ్చిమ బెంగాల్ మెడికల్ కౌన్సిల్ గురువారం రద్దు చేసింది. ప్రస్తుతం సీబీఐ కస్టడీలో ఉన్న ఘోష్ పేరును రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్స్ జాబితా నుంచి తొలగిస్తున్నట్టు ప్రకటించింది. బెంగాల్ మెడికల్ యాక్టు 1914 ప్రకారం అతని లైసెన్స్‌ను రద్దు చేసినట్టు తెలిపింది. ఈ చర్యతో ఆర్థోపెడిక్ సర్జన్ అయిన ఘోష్ ఇక నుంచి ప్రాక్టీస్ చేయలేరు. కాగా, ఘోష్ లైసెన్స్ రద్దు తమ ఉద్యమ విజయంగా జూనియర్ డాక్టర్స్ ఆందోళనకు నేతృత్వం వహిస్తున్న అకికెట్ మహతో వ్యాఖ్యానించారు. 'బెంగాల్ మెడికల్ కౌన్సిల్ ఎట్టకేలకు స్పందించి ఈ చర్యకు ఉపక్రమించినందుకు సంతోషంగా ఉంది. దివంగత సోదరి సాధించిన విజయమిది' అని ఆయన అన్నారు.

బెంగాల్‌లో వరదల వెనుక కుట్ర!

కేంద్రంపై మమతా బెనర్జీ ఆరోపణ

కోల్‌కతా: దామోదర్ వ్యాలీ కార్పొరేషన్ (డీవీసీ) డ్యాముల నుంచి ఇష్టమున్నట్టు నీటిని దిగువకు విడుదల చేశారని, ఇదంతా పక్కా ప్లాన్ ప్రకారమే జరిగిందని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. కేంద్రం ఆడుతున్న నాటకంలో ఇదొక కుట్రగా ఆమె పేర్కొన్నారు. దీనిపై తాము ఉద్యమిస్తామని హెచ్చరించారు. గురువారం పూర్వ మిడ్నాపూర్, హౌరా జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాల్ని ఆమె సందర్శించారు. పశ్చిమ బెంగాల్‌లో వరదలకు దామోదర్ వ్యాలీ కార్పొరేషన్ (డీవీసీ) కారణమని ఆరోపించారు. 'ఇది వర్షం నీరు కాదు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని డీవీసీ డ్యాముల నుంచి విడుదలైన నీరు ఇది. డ్యాముల్లో నీటి నిల్వ సామర్థ్యం 36 శాతం తగ్గింది. ఇందుకు కారణం కేంద్రం నిర్లక్ష్యమే. ఇదొక పెద్ద కుట్ర. దీన్ని అడ్డుకుంటాం' అని మమతా అన్నారు.

ఆకాశంలో లగ్జరీ బార్





లగ్జరీ బార్, రెక్లైనర్ సీట్లు, లౌడ్ మ్యూజిక్.. ఇలా విలాసవంతమైన సౌకర్యాలతో స్పేస్ బెలూన్, క్యాప్సూల్‌ను తయారు చేసింది అమెరికాకు చెందిన 'స్పేస్ పెర్స్‌పెక్టీవ్' అనే అంతరిక్ష పర్యాటక సంస్థ. 'నెప్ట్యూన్' పేరుతో తయారు చేసిన ఈ స్పేస్ బెలూన్‌ను ఫ్లోరిడా నుంచి విజయవంతంగా ప్రయోగించింది.ఇందులో ప్రయాణానికి 1,25,000 డాలర్లకు ఒక టికెట్ విక్రయిస్తున్నది. ఇప్పటికే 1800 టికెట్లు అమ్ముడయ్యాయి.

కాంగ్రెస్-పాక్‌ది ఒకటే అజెండా

ఆర్టికల్ 370పై పాకిస్థాన్ మంత్రి వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19: కశ్మీర్ ఎన్నికల వేళ పొరుగు దేశమైన పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజ ఆసిఫ్ కీలక వ్యాఖ్యలు చేశారు. జమ్ముకశ్మీర్‌లో ఆర్టికల్ 370 పునరుద్ధరణపై పాక్ ప్రధాని షెబాజ్ షరీఫ్, కాంగ్రెస్, నేషనల్ కాంగ్రెస్ ఒకే అజెండాతో ఉన్నాయని స్పష్టం చేశారు. జమ్ముకశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తి కల్పించే 370వ అధికరణను మోదీ ప్రభుత్వం 2019లో రద్దు చేసింది. అనంతరం తొలిసారిగా కశ్మీర్ అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతున్న క్రమంలో పాక్ మంత్రి జియో న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో కశ్మీర్‌లో కాంగ్రెస్-నేషనల్ కాంగ్రెస్ కూటమి అధికారంలోకి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆయన చెప్పారు. ఈ ఎన్నికల్లో ఆ కూటమి ఇదే అంశాన్ని ఎన్నికల ప్రధాన అంశంగా ప్రచారం చేసిందని ఆయన తెలిపారు. పాక్ మంత్రి చేసిన వ్యాఖ్యలతో కాంగ్రెస్‌పై విమర్శలు చేయడానికి బీజేపీకి ఊతం లభించినట్టయ్యింది. దీనిపై హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ కాంగ్రెస్ ఎప్పుడూ దేశ వ్యతిరేక శక్తులతో చేయి కలుపుతుందని విమర్శించారు. కశ్మీర్‌లో 370వ అధికరణ పునరుద్ధరణ, ఉగ్రవాదం తిరిగి వచ్చే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు.

పట్టాలపై ఇనుప స్తంభం

గుర్తించిన లోకోపైలట్ • తప్పిన పెను ప్రమాదం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19: బిలాస్‌పూర్ రోడ్-రుద్రాపూర్ సిటీ మధ్య ప్రయాణిస్తున్న గుజరాత్ మెయిల్‌కు తాజాగా పెను ప్రమాదం తప్పింది. రైలు పట్టాలపై అడ్డంగా ఉన్న 6 మీటర్ల ఇనుప స్తంభాన్ని లోకో పైలట్ గుర్తించి రుద్రాపూర్ సిటీ స్టేషన్ మాస్టర్‌కు తెలియజేశాడు. ఇనుప స్తంభానికి తగలకుండా రైలును ఆపగలిగారు. ఆ తర్వాత స్తంభాన్ని పట్టాలపై నుంచి తొలగించి రైలును



యథావిధిగా నడిపారు. ఇటీవలి కాలంలో ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్న విషయం తెలిసిందే. పట్టాలపై సిలిండర్లు, సిమెంట్ దిమ్మెలు ఉంచిన ఘటనలు వెలుగులోకి వచ్చాయి.

భారత్‌కు తీవ్ర ఉగ్రముప్పు: ఎఫ్ఏటీఎఫ్

న్యూఢిల్లీ: అక్రమ నగదుకు అడ్డుకట్ట వేయడంలో భారత్ సమర్థంగా వ్యవహరిస్తున్నదని ఉగ్రవాద నిధులపై నిఘా ఉంచే ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్(ఎఫ్ఏటీఎఫ్) ప్రశంసించింది. భారత్ తమ సిఫారసులు అమలు చేసి అక్రమంగా నిధులు ప్రవేశించకుండా అత్యున్నత సాంకేతిక సామర్థ్యాన్ని పొందిందని పేర్కొన్నది. భారత్‌కు సైబర్ మోసాలు, అవినీతి, మాదక ద్రవ్యాల రవాణా వంటి అక్రమాలతో మనీ లాండరింగ్ ముప్పు ఉందని పేర్కొన్నది. జమ్ముకశ్మీర్‌తో పాటు చుట్టుపక్కల ఇస్లామిక్ స్టేట్, అల్ ఖైదా వంటి వంటి ఉగ్ర సంస్థలతో భారత్‌కు తీవ్రమైన ఉగ్రవాద, ఉగ్ర నిధుల ముప్పు ఉన్నట్టు హెచ్చరించింది.

ట్రంప్ ర్యాలీలో పాల్గొన్న వారికి అంతుబట్టని అనారోగ్యం

అరిజోనా, సెప్టెంబర్ 19: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై రెండు సార్లు హత్యాయత్నం జరగడం సంచలనం రేపింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా గత వారం టక్సన్‌లో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న ట్రంప్ మద్దతుదారులు కొందరు అంతుబట్టని అనారోగ్యానికి గురికావడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. కొంతమంది తమ కండ్లలో తీవ్ర అసౌకర్యం ఉందని తెలిపారు. తన కండ్లు మండటంతో తానేమీ చూడలేకపోయాయని, వెంటనే దవాఖానకు వెళ్లాలని ట్రంప్ అభిమాని మేరా రొడ్రిగజ్ చెప్పారు.

మునిరత్నపై రేప్ కేసు

చిక్కుల్లో బీజేపీ ఎమ్మెల్యే • వారంలో 3 ఎఫ్ఐఆర్‌లు


(స్పెషల్ టాస్క్ బ్యూరో)



హైదరాబాద్ (నమస్తే తెలంగాణ): కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే మునిరత్నపై అత్యాచారం కేసు నమోదైంది. ఎమ్మెల్యే తనపై లైంగిక దాడి చేశారంటూ 40 ఏండ్ల మహిళ ఒకరు కగ్గలిపుర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు మునిరత్నపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కాగా, వారం వ్యవధిలో మునిరత్నపై మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదవ్వడం కన్నడ రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. తనను, తన కుటుంబంలోని మహిళలను మునిరత్న కులం పేరిట దూషించినట్టు చెలువరాజు అనే కాంట్రాక్టర్ కేసు పెట్టడంతో మునిరత్నపై రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. కాగా, వాల్మీకి స్కామ్ పేరిట కాంగ్రెస్ సర్కారును చిక్కుల్లో పెట్టాలనుకొన్న బీజేపీ పరివారానికి మునిరత్న వ్యవహారం కొత్త చిక్కులను తీసుకొచ్చినట్టు రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

గాలి కాలుష్యం, అధిక ఉష్ణోగ్రతలతో బ్రెయిన్ స్ట్రోక్!

- తాజా అధ్యయనంలో వెల్లడి



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19: ప్రపంచవ్యాప్తంగా 'బ్రెయిన్ స్ట్రోక్' మరణాలు పెరుగుతున్నాయి. జీవన శైలి వ్యాధులు సహా గాలి కాలుష్యం, అధిక ఉష్ణోగ్రతలు కూడా బ్రెయిన్ స్ట్రోక్ మరణాలు పెరగడానికి ముఖ్య కారణమని 'లాన్సెట్ న్యూరాలజీ జర్నల్' తాజా కథనం పేర్కొన్నది. రిస్క్ ఫ్యాక్టర్స్‌ని (అధిక బరువు, రక్తపోటు, శారీరక శ్రమలేకపోవటం.. మొదలైనవి) పెంచటంలో గాలి కాలుష్యం, అధిక ఉష్ణోగ్రతలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పరిశోధకులు కనుగొన్నారు. 1990 తర్వాత బ్రెయిన్ స్ట్రోక్ మరణాలు 72 శాతం పెరగడానికి అధిక ఉష్ణోగ్రతలూ ఒక కారణమని గణాంకాలు చెబుతున్నాయి. భవిష్యత్తులోనూ ఇది మరింత పెరిగే అవకాశముందని సైంటిస్టులు అంచనా వేశారు. అలాగే, 'బ్రెయిన్ స్ట్రోక్' కేసులు పెరగడానికి గాలి కాలుష్యానికి సంబంధముందన్న సంగతి తొలిసారి బయటపడింది. 1990లో 73 లక్షల మందికి తొలిసారి బ్రెయిన్ స్ట్రోక్ రాగా, వీరి సంఖ్య 2021నాటికి 1.19 కోట్లకు చేరుకుంది. స్ట్రోక్స్‌ను అరికట్టేందుకు ప్రస్తుతం అనుసరిస్తున్న విధానాలతో సమస్యను ఎదుర్కోలేమని అక్లాండ్ యూనివర్సిటీ శాస్త్రవేత్త వాలెరీ ఫిజిన్ చెప్పారు. శుభ్రమైన గాలి, బహిరంగంగా పొగతాగటాన్ని నిషేధించటం.. గత మూడు దశాబ్దాల్లో 'బ్రెయిన్ స్ట్రోక్' బారినపడే ముప్పును గణనీయంగా తగ్గించాయని పరిశోధకులు పేర్కొన్నారు.

ఇక టార్గెట్ హెజ్బొల్లా!

- గాజాలో తగ్గిన యుద్ధ తీవ్రత
- లెబనాన్ వైపు ఇజ్రాయెల్ సైన్యం
- పూర్తిస్థాయి యుద్ధానికి సిద్ధం!



జెరూసలేం, సెప్టెంబర్ 19: హెజ్బొల్లాపై పూర్తిస్థాయి యుద్ధానికి ఇజ్రాయెల్ సిద్ధమవుతున్నది. గత ఏడాదికాలంగా గాజాలో హమాస్‌పై పోరాడుతున్న ఇజ్రాయెల్ ఇప్పుడు హెజ్బొల్లాను లక్ష్యంగా చేసుకున్నది. గాజాలో యుద్ధ తీవ్రత తగ్గడంతో ఇప్పుడు హెజ్బొల్లాకు కేంద్రమైన లెబనాన్ సరిహద్దుకు బలగాలను మోహరిస్తున్నది. గాజాలో జరిగిన పోరులో కీలకంగా వ్యవహరించిన వేలాది మంది సైనికులతో కూడిన 98వ డివిజన్‌ను లెబనాన్ వైపు పంపిస్తున్నది. రెండు రోజులుగా హెజ్బొల్లా మిలిటెంట్లే లక్ష్యంగా పేజర్లు, వాకీటాకీలు, ఇతర పరికరాలు పేలుతున్న ఘటనల వెనుక కూడా ఇజ్రాయెల్ ఉందని హెజ్బొల్లా ఆరోపిస్తున్నది. మరోవైపు 'యుద్ధంలో కొత్త దశ మొదలైంది' అంటూ ఇజ్రాయెల్ రక్షణ మంత్రి యావ్ గాల్లంట్ ప్రకటించారు. హెజ్బొల్లాను ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకోనున్నదని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.



లెబనాన్‌లో వాకీటాకీలు పేలాయని భావించిన ఓ మొబైల్స్ దుకాణం ముందు గుమికూడిన స్థానికులు

2006 తర్వాత మళ్లీ యుద్ధం?

గత ఏడాది అక్టోబరు 8 నుంచి హెజ్బొల్లా, ఇజ్రాయెల్ మధ్య దాడులు, ప్రతిదాడులు జరుగుతున్నప్పటికీ ఇరుపక్షాలు పూర్తిస్థాయి యుద్ధానికి దిగలేదు. ఏడాదిగా ఇప్పటివరకు ఇజ్రాయెల్ దాడుల్లో లెబనాన్‌లో 500 మందికి పైగా మరణించారు. హెజ్బొల్లా దాడుల్లో 23 మంది ఇజ్రాయెల్ సైనికులు, 26 మంది ప్రజలు మరణించారు. కాగా, 2006లోనూ ఇజ్రాయెల్, హెజ్బొల్లా మధ్య 34 రోజుల పాటు జరిగిన యుద్ధంలో హెజ్బొల్లా తీవ్రంగా నష్టపోయింది. అయితే, అప్పటి నుంచి హెజ్బొల్లా కూడా యుద్ధ సామర్థ్యాలను పెంచుకుందనే అభిప్రాయాలు ఉన్నాయి. ప్రస్తుతం హెజ్బొల్లా దగ్గర 1,50,000 రాకెట్‌లు, క్షిపణులు ఉన్నాయని, ఇజ్రాయెల్ భూభాగంలో ఏ ప్రాంతంపైనైనా లక్షిత దాడులు చేసే సామర్థ్యమూ హెజ్బొల్లాకు ఉందని యుద్ధ నిపుణులు అంచనా వేస్తున్నారు. దీంతో ఇజ్రాయెల్, హెజ్బొల్లా మధ్య యుద్ధం జరిగితే ఇరువైపులా నష్టం భారీగానే ఉండే అవకాశం ఉంది.

బందీలందరినీ విడుదల చేస్తే యుద్ధం ఆపేస్తాం

ఇజ్రాయెల్-హమాస్ మిలిటెంట్ల మధ్య నెలల తరబడి జరుగుతున్న యుద్ధంలో అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. అటు ఇజ్రాయెల్ కానీ, ఇటు హమాస్ కానీ ఎవరూ వెనక్కి తగ్గడం లేదు. ఫలితంగా వేలాదిమంది ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. గాజాస్ట్రిప్ శవాల దిబ్బగా మారుతున్నది. అక్కడి ప్రజలు నిత్యం బిక్కుబిక్కుమంటూ క్షణమొక యుగంగా గడుపుతున్నారు. యుద్ధాన్ని నివారించేందుకు ప్రపంచ దేశాలు చేస్తున్న ప్రయత్నాలు ఫలించకపోగా పరిస్థితులు రోజురోజుకు మరింత ఉద్రిక్తంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ తనంత తానే ఓ సరికొత్త ప్రతిపాదనతో ముందుకొచ్చింది. తమ వద్దనున్న బందీలందరినీ ఒకేసారి విడుదల చేస్తే గాజా స్ట్రిప్‌లో యుద్ధాన్ని విరమిస్తామంటూ హమాస్‌కు ఆఫర్ ఇచ్చింది. అంతేకాదు, ఇజ్రాయెల్ జైళ్లలో మగ్గుతున్న పాలస్తీనా ఖైదీలందరినీ విడిచిపెట్టడంతోపాటు గాజా స్ట్రిప్ నుంచి తమ మిలటరీని వెనక్కి పిలిపిస్తామని, గాజాలో కొత్త పాలనా వ్యవస్థ ఏర్పాటు చేస్తామని ప్రతిపాదించింది.

పేజర్ పేలుళ్లు యుద్ధ ప్రకటనే

ఇజ్రాయెల్‌ది ఉగ్రవాద చర్య


హెజ్బొల్లా నాయకుడు నస్రల్లా

బీరుట్, సెప్టెంబర్ 19: పేజర్లు, వాకీటాకీలు పేల్చేయడం ఇజ్రాయెల్ చేపట్టిన ఉగ్రవాద చర్య అని హెజ్బొల్లా నాయకుడు హస్సన్ నస్రల్లా పేర్కొన్నారు. ఇది లెబనాన్ ప్రజలు, దేశ సార్వభౌమాధికారంపై యుద్ధాన్ని ప్రకటించడమేనని అన్నారు. లెబనాన్‌లో హెజ్బొల్లా లక్ష్యంగా పేజర్లు, వాకీటాకీలు పేలిన తర్వాత నస్రల్లా మొదటిసారి మాట్లాడారు. లెబనాన్‌లో ఇజ్రాయెల్ నరమేధానికి పాల్పడిందని, అన్ని హద్దులూ దాటిందని ఆయన పేర్కొన్నారు. సాధారణ ప్రజలు ఉండే దవాఖానలు, మార్కెట్‌లు, దుకాణాలు, ఇండ్లు, వీధుల్లో ఇజ్రాయెల్ పేలుళ్లు జరిపిందని అన్నారు. ఇందుకు ఇజ్రాయెల్‌కు అమెరికా కూడా సాంకేతికంగా సహకరించిందని ఆరోపించారు. పేజర్ల పేల్చివేతతో నాలుగు వేల మందిని చంపాలని ఇజ్రాయెల్ ప్రయత్నించిందని అన్నారు. కాగా, పేజర్లు, వాకీ టాకీల పేలుళ్లలో 37 మంది మరణించారని, 287 మంది గాయపడ్డారని లెబనాన్ ఆరోగ్య మంత్రి ఫిరాస్ అబైద్ తెలిపారు. విమానాల్లో పేజర్లు, వాకీ టాకీలపై లెబనాన్ నిషేధం విధించింది.

లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు

హెజ్బొల్లా నాయకుడు నస్రల్లా ప్రసంగించిన వెంటనే లెబనాన్‌లోని హెజ్బొల్లా స్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ దళాలు దాడులు ప్రారంభించాయి. హెజ్బొల్లా ఉగ్రవాద సామర్థ్యాలు, సదుపాయాలను నిర్వీర్యం చేసేందుకు దాడులు చేస్తున్నట్టు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) ప్రకటించింది. ఉత్తర ఇజ్రాయెల్‌లో రక్షణను పటిష్ఠం చేయడమే ఈ దాడుల లక్ష్యమని తెలిపింది.


పేజర్ల పేలుళ్ల వెనుక 'యూనిట్ 8200'?



లెబనాన్‌లో హెజ్బొల్లా మిలిటెంట్లే లక్ష్యంగా జరిగిన పేజర్లు, వాకీటాకీల పేలుళ్లు యుద్ధరంగ నిపుణులను కూడా ఆశ్చర్యపరిచాయి. ఏకకాలంలో వందలాది వైర్‌లెస్ పరికరాలను ఎలా పేల్చేశారనేది ఎవరికీ అంతుచిక్కడం లేదు. ఈ దాడికి పాల్పడింది ఇజ్రాయెల్ అనే అనుమానాలు బలంగా ఉన్నాయి. అయితే, ఈ దాడులకు ప్రణాళిక, అమలు అంతా ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్‌కు చెందిన 'యూనిట్ 8200' పనేనని అంతర్జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఈ పేలుళ్లపై ఏడాది కాలంగా 'యూనిట్ 8200' పని చేస్తున్నదని, 5,000 పేజర్లలో తయారీ సమయంలోనే చిన్న మొత్తంలో పేలుడు పదార్థాలు అమర్చిందని తెలుస్తున్నది. అత్యాధునిక సాంకేతికతలపై పట్టుండే మెరికల్లాంటి యువతీ యువకులను 'యూనిట్ 8200'కు ఎంపిక చేస్తారు. సైబర్ దాడుల నుంచి రక్షణ కోసం దీనిని ఏర్పాటు చేసినా తర్వాత సాంకేతికత దాడులు, స్ట్రైక్స్ చేసేలా ఇజ్రాయెల్ మార్చింది. అధునాతన సాంకేతికతలను వినియోగించి ఎవరూ కలలో కూడా ఊహించని దాడులను 'యూనిట్ 8200' చేపట్టగలదట. ఇరాన్ అణు ప్రయోగాలను నిర్వీర్యం చేయడంలోనూ దీని పాత్ర ఉందనే కథనాలు ఉన్నాయి.

మానవాళి అంతర్ధానం కాకుండా..!

- 5డీ క్రిస్టల్‌లో మనిషి జన్యువు చేర్పు
- సుమారు 13.8 బిలియన్ ఏండ్లు చెక్కుచెదరకుండా జీనోమ్ డాటా
- సౌతాంప్టన్ యూనివర్సిటీ శాస్త్రవేత్తల బృందం అద్భుతం



లండన్, సెప్టెంబర్ 19: భూమిపై మానవాళి అంతరించిపోతే? దీనికి సమాధానంగా బ్రిటన్‌లోని సౌతాంప్టన్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తల బృందం.. సైన్స్ ఫిక్షన్‌ను తలపించే ఆవిష్కరణ చేశారు. మనిషి జన్యువులను ఒక '5డీ మెమరీ క్రిస్టల్'లో భద్రంగా దాచిపెట్టారు. అంతరించే జాతిని తిరిగి రప్పించాలన్న సంకల్పంతో.. ఆస్ట్రియాలోని హాల్‌స్టాట్‌లో ఉన్న ఓ గుహలో భద్రంగా ఉంచారు. 360 టెరాబైట్ల మెమరీ కలిగిన ఆ క్రిస్టల్ ఎంత పటిష్ఠం అంటే.. 1000 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతను, గడ్డకట్టే చలిని సైతం తట్టుకుంటుంది. 13.8 బిలియన్ సంవత్సరాల వరకు డాటా భద్రంగా ఉంటుంది. ఒకవిధంగా చెప్పాలంటే ఆ క్రిస్టల్ క్వార్ట్జ్‌లా అత్యంత గట్టిదనం కలిగినది. ఈ 5డీ క్రిస్టల్‌లో జన్యువును దాచేందుకు అల్ట్రా ఫాస్ట్ లేజర్లను ఉపయోగించారు. శాస్త్రవేత్తల ఘనతకుగానూ గిన్నిస్ బుక్‌లో చోటు కూడా దక్కింది.

5డీ మెమరీ క్రిస్టల్ విశేషాలివీ..

- తొలి 5డీ మెమరీ క్రిస్టల్‌ను 2014 జనవరి 23న యూనివర్సిటీ ఆఫ్ సౌతాంప్టన్ శాస్త్రవేత్తలు తయారుచేశారు.
- గది ఉష్ణోగ్రత వద్ద 300 క్వింట్రిలియన్ సంవత్సరాల వరకు చెక్కు చెదరకుండా ఉంటుంది.
- సాధారణంగా దీని జీవిత కాలం 13.8 బిలియన్ సంవత్సరాలు (అంటే.. ప్రస్తుతం మన విశ్వం వయసు అన్నమాట).

భారత్‌కు అమెరికా కోర్టు సమన్లు

- సివిల్ దావా వేసిన ఖలిస్థానీ ఉగ్రవాది పన్నూ
- తన హత్యకు ప్రయత్నించినట్టు ఆరోపణలు
- ప్రధాని మోదీకీ తెలిసే జరిగిందని వాదన
- తీవ్రంగా తప్పుబట్టిన భారత విదేశాంగ శాఖ



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19: ఖలిస్థానీ ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూ దాఖలు చేసిన సివిల్ దావాపై భారత ప్రభుత్వానికి అమెరికా కోర్టు సమన్లు జారీ చేసింది. తన హత్యకు భారత ప్రభుత్వం, భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, రా మాజీ చీఫ్ సమంత్ గోయెల్, రా అధికారి విక్రమ్ యాదవ్, భారతీయ వ్యాపారవేత్త నిఖిల్ గుప్తాతో పాటు ప్రస్తుతం అమెరికా జైలులో ఉన్న ఓ భారతీయుడు సహా గుర్తు తెలియని ఇతరులు ప్రయత్నించారని పన్నూ న్యూయార్క్‌లోని సదరన్ డిస్ట్రిక్ కోర్టును ఆశ్రయించాడు. ఈ ప్రణాళిక గురించి ప్రధాని నరేంద్ర మోదీకి కూడా తెలుసని ఇందులో ఆరోపించాడు. 'నవ భారత్ ఇప్పుడు శత్రువుల ఇండ్లకు వెళ్లి మట్టుబెడుతుంది' అని ఏప్రిల్‌లో జరిగిన ఓ ర్యాలీలో ప్రధాని మోదీ మాట్లాడిన అంశాన్నీ తన పిటిషన్‌లో పేర్కొన్నాడు. తన హత్య ప్రణాళిక విఫలమైనప్పటికీ తాను అనుభవించిన మానసిక ఆందోళనకుగానూ పరిహారం చెల్లించేలా ఆదేశించాలంటూ పన్నూ కోర్టును కోరాడు. పన్నూ పిటిషన్‌పై స్పందించిన కోర్టు.. భారత ప్రభుత్వం, అజిత్ దోవల్, సమంత్ గోయెల్, విక్రమ్ యాదవ్, నిఖిల్ గుప్తాకు 21 రోజుల్లో స్పందన తెలియజేయాల్సిందిగా సమన్లు జారీ చేసింది.

పూర్తిగా అసమంజసం: భారత్

భారత ప్రభుత్వానికి అమెరికా కోర్టు సమన్లు జారీ చేయడం పూర్తిగా అసమంజసమని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి పేర్కొన్నారు. 'ఈ విషయం(పన్నూ హత్యాయత్నం) గురించి మా దృష్టికి రాగానే మేము స్పందించాం. ఉన్నత స్థాయి కమిటీ ఈ విషయంపై విచారణ జరుపుతున్నది. పిటిషన్ దాఖలు చేసిన పన్నూ చరిత్ర అందరికీ తెలిసిందే. అతడు చట్టవ్యతిరేక, ర్యాడికల్ సంస్థ అయిన సిక్స్ ఫర్ జస్టిస్‌కు చెందిన వ్యక్తి. 2020లో అతడిని భారత్ ఉగ్రవాదిగా గుర్తించింది' అని మిస్రి వ్యాఖ్యానించారు.

స్టడీ పర్మిట్లకు కెనడా కోత

భారత విద్యార్థులపై ప్రభావం

ఒట్టావా, సెప్టెంబర్ 19: విదేశీ విద్యార్థుల స్టడీ పర్మిట్లను తగ్గించనున్నట్టు కెనడా ప్రకటించింది. 'ఈ ఏడాది 35 శాతం తక్కువగా అంతర్జాతీయ స్టడీ పర్మిట్లను మంజూరు చేస్తున్నాం. వచ్చే ఏడాది ఈ సంఖ్య మరో 10 శాతం తగ్గనుంది. వలస మా ఆర్థిక వ్యవస్థకు ప్రయోజనకరమే. కానీ కొందరు ఈ వ్యవస్థను దుర్వినియోగం చేసి విద్యార్థుల ప్రయోజనాన్ని పొందినప్పుడు దాన్ని కట్టడి చేస్తాం' అని కెనడా ప్రధాని జస్టిస్ ట్రూడో బుధవారం స్పష్టంచేశారు. తాత్కాలిక నివాసితుల సంఖ్యను తగ్గించాలని కెనడా ప్రభుత్వం ప్రయత్నిస్తున్న తరుణంలో ఈ నిర్ణయం వెలువడింది. భారత విద్యార్థులు కెనడాలో ఉన్నత విద్యాభ్యాసానికి ఎక్కువ ప్రాధాన్యమిస్తారు. ఈ నేపథ్యంలో విదేశీ విద్యార్థులకు స్టడీ పర్మిట్లను తగ్గించాలన్న ఆ దేశ నిర్ణయం చాలా మంది భారత విద్యార్థులపై ప్రభావం చూపనుంది.



తొలి కశ్మీర్ ముస్లిం ఐఏఎస్ అధికారి మహమ్మద్ షఫీ మృతి

శ్రీనగర్, సెప్టెంబర్ 19: తొలి కశ్మీర్ ముస్లిం ఐఏఎస్ అధికారి మహమ్మద్ షఫీ పండిట్ (80) కన్నుమూశారు. గత కొద్దికాలంగా అస్వస్థతతో ఢిల్లీలో చికిత్స పొందుతున్న ఆయన.. గురువారం తుదిశ్వాస విడిచారు. ఆయన మృతదేహాన్ని శ్రీనగర్‌కు తీసుకువెళ్లారు. 1969లో సివిల్ సర్వీస్ పరీక్షలకు అర్హత సాధించిన తొలి ముస్లింగా పేరొందిన ఆయన చివరిగా జమ్ముకశ్మీర్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో సేవలందించారు. పండిట్ మండల కమిషన్ నివేదికలో కీలక పాత్ర పోషించారు ప్రభుత్వ సంయుక్త కార్యదర్శిగా సేవలందించారు.

మనుషుల్లో 3,600కు పైగా

ఫుడ్ ప్యాకేజింగ్ రసాయనాలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19: ఆహార ప్యాకేజీ లేదా తయారీలో వాడే 3,600కు పైగా రసాయనాలను మనుషుల శరీరాల్లో గుర్తించినట్టు జర్నల్ ఆఫ్ ఎక్స్‌పోజర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఎపిడెమియాలజీలో ప్రచురితమైన అధ్యయనం వెల్లడించింది. ఇందులో సుమారు 100 దాకా ఆరోగ్యానికి హానికరమైనవి ఉన్నాయని అధ్యయనానికి నేతృత్వం వహించిన బిర్గిట్ గుయెకా తెలిపారు. వీటిలో పీఎఫ్ఏఎస్, బిస్ఫెనాల్ ఎ లాంటి నిషేధిత జాబితాలో ఉన్న రసాయనాలు ఉన్నాయన్నారు. గతంలో సుమారు 14 వేల ఫుడ్ కాంటాక్ట్ కెమికల్స్‌ను పరిశోధకులు గుర్తించారు. ఇవి వివిధ రకాల ప్యాకేజింగ్ పదార్థాలు, వంట పాత్రల నుంచి ఆహారంలో కలిసిపోయే సామర్థ్యం ఉన్నవి. అయితే తాజాగా కనుగొన్న 3600 రసాయనాలు ఫుడ్ ప్యాకేజింగ్ ద్వారానే శరీరంలోకి చొచ్చుకు వెళ్లాయని అధ్యయనం తేల్చలేకపోయిందని.. ఇందుకు ఇతర కారణాలు ఉండొచ్చని గుయెకా అభిప్రాయపడ్డారు. పీఎఫ్ఏఎస్ రసాయనాలకు అనేక ఆరోగ్య సమస్యలకు సంబంధం ఉందని తెలిపారు. ప్యాకేజీ సామగ్రిని ఎక్కువ సేపు వాడొద్దని, ప్యాకేజ్డ్ ఆహారాన్ని వేడి చేయడాన్ని నివారించాలని ఆమె ప్రజలకు సలహా ఇచ్చారు.

ఎన్డీయే సర్కారు ఎప్పుడైనా కూలొచ్చు

- మోదీ ప్రభుత్వం పూర్తికాలం ఉండదు
- నితీశ్‌కుమార్-చంద్రబాబు ఎప్పుడైనా మద్దతు ఉపసంహరించుకోవచ్చు
- కర్ణాటక సీఎం సిద్ధరామయ్య



బెంగళూరు, సెప్టెంబర్ 19: కేంద్రంలోని ఎన్డీయే సర్కారు ఏ క్షణమైనా కూలొచ్చని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య జోస్యం చెప్పారు. మోదీ ప్రభుత్వం ఐదేండ్ల పదవీ కాలాన్ని పూర్తి చేయలేదని ఆయన అన్నారు. 'భవిష్యత్‌పై జోస్యం చెప్పడంపై నాకు నమ్మకం లేదు. అయినప్పటికీ ప్రస్తుత రాజకీయ పరిస్థితుల ఆధారంగా నరేంద్ర మోదీ ప్రభుత్వం ఐదేండ్ల పాటు పాలన చేయలేదని కచ్చితంగా చెప్పగలను' అని ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని తెలుగు దేశం పార్టీ, బీహార్‌లోని జేడీ(యూ) సహాయంతో మోదీ ప్రభుత్వాన్ని నెట్టుకొస్తున్నారని, వారు ఏ క్షణంలోనైనా తమ మద్దతు ఉపసంహరించుకోవచ్చునని ఆయన అన్నారు. కర్ణాటకలో తన నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని బీజేపీ చేస్తున్న ఆరోపణలను ఆయన ప్రస్తావిస్తూ తమకు 136 సీట్లు ఉన్నాయని, అలాంటప్పుడు ప్రభుత్వం ఎలా మారుతుందని ప్రశ్నించారు. బీజేపీ చేస్తున్న అలాంటి విమర్శలకు అంతగా ప్రాధాన్యం ఇవ్వమని సిద్ధరామయ్య అన్నారు.

మౌఖిక ఆదేశాల పనులపై నివేదిక కోరిన గవర్నర్

ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మౌఖిక ఆదేశాలపై రూ.387 కోట్ల వ్యయంతో జరిగిన పనులపై నివేదిక అందజేయాలని కర్ణాటక ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలినీ రాజ్‌నీశ్‌ను గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్ ఆదేశించారు. సిద్ధరామయ్య సొంత నియోజకవర్గమైన వరుణతో పాటు శ్రీరంగపట్నలో మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) నిబంధనలకు విరుద్ధంగా పనులు చేపట్టిందని పీఎస్ నాగరాజు అనే వ్యక్తి తనకు ఫిర్యాదు చేసినట్టు గవర్నర్ తన లేఖలో పేర్కొన్నారు. ముడా వద్ద నిధులు లేకపోయినా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మౌఖిక ఆదేశాలతోనే నిబంధనలకు విరుద్ధంగా ఈ పనులు చేపట్టిందని తన దృష్టికి తెచ్చినట్టు చెప్పారు. ఇది తీవ్రమైన అంశమని, దీనిపై డాక్యుమెంట్లతో పాటు సమగ్ర నివేదిక ఇవ్వాలని సీఎస్‌ను గవర్నర్ ఆదేశించారు. కాగా, ఇప్పటికే ముడా భూకుంభకోణం కేసులో సిద్ధరామయ్యపై విచారణకు గవర్నర్ అనుమతిని ఇచ్చిన సంగతి తెలిసిందే. గవర్నర్ నిర్ణయాన్ని సిద్ధరామయ్య హైకోర్టులో సవాల్ చేయగా, తీర్పు రిజర్వులో ఉంది.

ఉక్రెయిన్‌కు భారత్‌లో తయారైన ఆయుధాలు!

దిగుమతి చేసుకుంటున్న ఐరోపా దేశాలు

'రాయిటర్స్'లో కథనం.. ఖండించిన భారత్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19: భారత్‌లో తయారైన ఆయుధాలు, యుద్ధసామాగ్రిని రష్యాపై యుద్ధంలో ఉక్రెయిన్ వినియోగిస్తున్నదని 'రాయిటర్స్' సంచలన కథనాన్ని ప్రచురించింది. ఇటలీ, చెక్ రిపబ్లిక్ వంటి ఐరోపా దేశాలు భారతీయ తయారీదారుల నుంచి ఆయుధాలు, ఇతర యుద్ధసామాగ్రిని కొనుగోలు చేసి ఉక్రెయిన్‌కు సరఫరా చేస్తున్నట్టు ఈ కథనం పేర్కొన్నది. ఆయుధాల ఎగుమతి అంశాన్ని రష్యా రెండుసార్లు భారత్ ముందు లేవనెత్తిందని, జూలైలో కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్‌కు రష్యా మంత్రి సెర్గీ లావ్రోవ్ ఈ విషయాన్ని చెప్పారని తెలిపింది. కాగా, ఈ కథనాన్ని భారత విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ గురువారం తీవ్రంగా ఖండించారు. ఉనికిలో లేని ఉల్లంఘనలకు భారత్ పాల్పడిందని ఈ కథనం పేర్కొన్నదని, ఇది కేవలం ఊహాజనితమైనదని, తప్పుదోవ పట్టించేదని అన్నారు.

దళితుల ఇండ్లకు నిప్పు

- బీహార్‌లోని నవాడా జిల్లాలో దారుణం
- 34 ఇండ్లను తగలబెట్టిన దుండగులు
- జంగిల్ రాజ్ పాలనకు నిదర్శనం
- నితీశ్ సర్కార్‌పై విపక్షాల ఆగ్రహం



దళితుల ఇండ్లు దహనమైన చోట చెల్లాచెదురుగా పడి ఉన్న ఇంటి వస్తువులు

నవాడా, సెప్టెంబర్ 19: బీహార్‌లో దారుణం చోటు చేసుకుంది. దళితులకు చెందిన 34 ఇండ్లను దుండగులు తగలబెట్టారు. దీంతో పేద దళితులు కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు. నవాడా జిల్లా మంజి తోలలోని తోల ముఫాసిల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. ఇందులో ఎవరూ గాయపడలేదని, దీనికి కారకులుగా భావిస్తూ 15 మందిని అదుపులోకి తీసుకున్నామని, మిగిలిన వారి కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు. ఈ దారుణాన్ని బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఖండించారు. వెంటనే ఘటనా స్థలికి వెళ్లి పరిస్థితులను పరిశీలించాలని అడిషనల్ జనరల్ ఆఫ్ పోలీస్ (లా అండ్ ఆర్డర్)ను ఆదేశించారు. దీనిపై సిట్ ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు. కాగా, బీహార్‌లో జంగిల్ రాజ్ పాలనకు ఇది మరో నిదర్శనమని కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, మల్లి ఖార్జున్ ఖర్గే విమర్శించారు. బహుజనులకు వ్యతిరేకంగా రాష్ట్రంలో జరిగిన మరో అన్యాయమని విపక్షాలు విమర్శించాయి. దహనమైన ఇండ్లు 80 వరకు ఉన్నాయని కాంగ్రెస్ తెలిపింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. కొంత మంది వ్యక్తులు రాత్రి ఏడు గంటలకు వచ్చి గాలిలోకి కాల్పులు జరిపి తమ ఇండ్లను తగులబెట్టారని చెప్పారు. కాగా, భూ వివాదమే దీనికి కారణంగా భావిస్తున్నట్టు ఎస్పీ అభినవ్ దిమాన్ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అలాగే బాధితుల తాత్కాలిక నివాసానికి టెంట్లు ఏర్పాటు చేశామని, ఆహారం, మంచి నీరు, ఇతర నిత్యావసరాలు సరఫరా చేసినట్టు చెప్పారు. దళితుల ఇండ్ల దహనాన్ని కేంద్ర మంత్రి జితిన్ రాం మాంఝీ, బీఎస్పీ అధినేత్రి మాయావతి, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ఖండించారు.

శాంతిభద్రతలు కుప్పకూలాయి: లాలూ

బీహార్‌లో శాంతిభద్రతలు పూర్తిగా కుప్పకూలాయని, ఇది కచ్చితంగా నితీశ్ కుమార్ పాలనా వైఫల్యమేనని ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ విమర్శించారు. 'మీ హయాంలో దళితుల ఇండ్లను దుండగులు తగులబెడుతున్నారు. దీనిపై మీరు కానీ, నితీశ్ ప్రభుత్వం కానీ ఎందుకు మాట్లాడరు' అని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ విమర్శించారు.



అధిక పని ఒత్తిడితో ఈవై ఉద్యోగిని మృతి!

కంపెనీపై బాధితురాలి తల్లి ఆరోపణలు

దర్యాప్తు జరుపుతామన్న కేంద్ర కార్మికశాఖ


న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19: 'ఎర్నెస్ట్ అండ్ యంగ్ ఇండియా' కంపెనీలో పనిచేస్తున్న చార్టెడ్ అకౌంటెంట్ (26) అన్నా సెబాస్టియన్ పెరియాలి మృతి సర్వత్రా చర్చనీయాంశమైంది. ఆమె మృతిపై వచ్చిన ఆరోపణల్లో నిజానిజాల్ని తేల్చేందుకు విచారణ చేపట్టబోతున్నామని కేంద్ర కార్మిక శాఖ గురువారం 'ఎక్స్' వేదికగా తెలిపింది. సెబాస్టియన్ తల్లి అనిత చేసిన ఫిర్యాదును స్వీకరిస్తున్నట్టు కేంద్ర సహాయ మంత్రి శోభా కరంద్లాజే 'ఎక్స్'లో వెల్లడించారు. దేశంలో ఎంతోమంది యువతీ యువకులు కలలుగంటున్న 'సీఏ'ను సెబాస్టియన్ డిస్టింక్షన్‌లో పాసయ్యారు. పుణేలోని 'ఈవై గ్లోబల్' కంపెనీలో ఈ ఏడాది మార్చి 18న చేరారు. ఛాతిలో నొప్పితో జూలై 20న హఠాత్తుగా ఆమె చనిపోయారు. ఆమె మరణం.. తల్లిదండ్రుల్ని షాక్‌కు గురిచేసింది. కంపెనీలో నాలుగు నెలలు రాత్రిపగలు తన కూతురుపై పని భారం మోపారని, సరిగా నిద్ర పోనివ్వకుండా అధిక పని ఒత్తిడి వల్లే ఆమె మరణించిందని తల్లి అనిత ఆరోపిస్తున్నారు.

సిస్కోలో 5,600 మందిపై వేటు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19: టెక్ దిగ్గజ సంస్థ సిస్కో ఈ ఏడాది రెండో విడత లేఆఫ్‌లు ప్రకటించింది. సిబ్బందిలోని 7 శాతం అనగా, 5,600 మందిని తొలగించాలని నిర్ణయించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఈ కంపెనీ 4 వేల మందికి పైగా ఉద్యోగులను తీసేసింది. తాజా లేఆఫ్‌లలో ఏయే శాఖల ఉద్యోగులను ఇంటికి పంపుతారన్న విషయంపై స్పష్టత లేదు. కంపెనీ వర్గాలు తప్పుడు సమాచారం ప్రచారం చేయడం పట్ల ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మరణమే చివరి అంకం కాదు!

- చావు తర్వాత కూడా మూడో దశ ఉంది
- జీవి మరణించినా ప్రాణంతోనే కణాలు
- త్వరలో తేలిపోనున్న చావు రహస్యం?!



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): భూమి మీద పడగానే పుట్టుక మొదలవుతుందా? లేదా తల్లి కడుపులో పిండం జీవం పోసుకోగానే జననం ప్రారంభమైనట్టా? తుది శ్వాస విడిచాక మరణాన్ని ధ్రువీకరిస్తామా? బ్రెయిన్ డెడ్ అయ్యాక చావును డిసైడ్ చేస్తామా? మనిషి పుట్టుక, చావులోనే ఇన్ని సందేహాలున్నాయి అనుకొంటే.. జీవం, మరణం మాత్రమే కాకుండా మూడో దశ కూడా ఉన్నదని అమెరికా శాస్త్రవేత్తలు తాజాగా గుర్తించారు. అసలేమిటీ దశ? దాన్ని ఎలా నిర్ధారించారు?

ఏమిటీ మూడో దశ?

ఏ ప్రాణికి అయినా జీవం, మరణం అనే రెండు దశలే ఉంటాయని ఇప్పటివరకూ అనుకొన్నాం. అయితే, పుట్టుక, చావు మాత్రమే కాదు మూడో దశ కూడా ఉన్నదని పరిశోధకులు చెప్తున్నారు. వివరంగా చెప్పాలంటే.. గుండె కొట్టుకోవడం ఆగిపోయి, శ్వాస తీసుకోలేని స్థితిని చావుగా అర్థం చేసుకొంటాం. అయితే, మనిషి చనిపోయాక కూడా కొన్ని అవయవాలు పనిచేస్తూనే ఉంటాయి. అందుకే అవయవ దానం అనేది సాధ్యపడుతున్నది. అయితే, మనిషి చనిపోయాక కూడా అవయవాలు ఎలా పనిచేయగలుగుతున్నాయన్న దానిపై పరిశోధకులు తాజాగా ప్రయోగాలు చేశారు. జీవి మరణం తర్వాత కూడా అవయవాల్లోని కొన్ని కణాలు పని చేయడమే దీనికి కారణంగా గుర్తించారు. జీవం, మరణానికి మధ్యనున్న దీన్ని భిన్నమైన మూడో దశగా శాస్త్రవేత్తలు అభివర్ణిస్తున్నారు. మరణించిన జీవి శరీరంలోని ఓ అవయవం నుంచి తీసుకున్న కణాలు.. ఒక మల్టీసెల్యూలార్‌గా ఏర్పడి మళ్లీ జీవం పోసుకోవడానికి అవకాశం ఉన్నదని శాస్త్రవేత్తలు ఈ ప్రయోగం ద్వారా ఓ అవగాహనకు వచ్చారు. అదే జరిగితే, ఒకే జీవికి సంబంధించి జననం-మరణం-పునఃజననం అనే చక్రం సాధ్యమయ్యే అవకాశమున్నట్టు తెలిపారు.

ఎలా సాధ్యం?

మనిషి చనిపోయాక కూడా ఆ కణాలు ఎలా పని చేస్తున్నాయి? ఏ మెకానిజం వాటిని అలా పని చేయనిస్తున్నది? అనే ఆసక్తికర చర్చ పరిశోధకుల్లో మొదలైంది. దీంతో మరింత లోతుగా పరిశోధించిన శాస్త్రవేత్తలు చివరకు ఓ నిర్ధారణకు వచ్చారు. మనిషి మరణించినప్పటికీ.. సరైన పరిస్థితుల్లో కణాలను భద్రపరిచినప్పుడు అవి తిరిగి జీవాన్ని పోసుకుంటాయని తేల్చారు. ఈ కణాలకు పోషకాలు, ఆక్సిజన్ అందించినప్పుడు అవి మల్టిసెల్యూలర్ వ్యవస్థగా ఎదుగుతాయని, జీవక్రియలను కూడా కొనసాగించగలవని తెలిపారు. మూలకణాల నుంచి జీవులను సృష్టించడం ఇదే తరహా విధానమని గుర్తుచేశారు. అంతేకాదు, జీవి మరణించినప్పటికీ ప్రాణంతో ఉండే కణాలు గతంలో తమ సజీవ శరీరంలో ఉన్నప్పుడు చేయలేని కొత్త పనులను కూడా చేయగలవని, వాటి ఆకారంలో కూడా మార్పులు వచ్చే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు.

కప్పల్లో ఏం జరిగిందంటే?

ప్రయోగంలో భాగంగా చనిపోయిన కప్ప చర్మ కణాలను తీసి ఓ ల్యాబ్‌లో ప్రత్యేక పరిస్థితుల్లో శాస్త్రవేత్తలు భద్రపరిచారు. ఆ కణాలు జెనోబాట్స్ అనే బహుళ కణ జీవిగా రూపాంతరం చెందడాన్ని గమనించారు. అయితే, కొత్తగా ఏర్పడిన జీవి గతంలో కంటే భిన్నంగా ప్రవర్తించడాన్ని గుర్తించారు. అంటే, కప్ప సజీవంగా ఉన్నప్పుడు స్రవాలను పంప్ చేయడానికి ఉపయోగపడ్డ సిలియా.. జెనోబాట్‌గా మారాక ముందుకు కదలడానికి సాయపడ్డట్టు గమనించారు. ఇక, మరణించిన మనిషి ఊపిరితిత్తుల్లోని కొన్ని కణాలను ప్రత్యేక పరిస్థితుల్లో భద్రపరిస్తే.. అవి సొంతంగా ఒక సూక్ష్మ రూపాన్ని సంతరించుకుని దానికదిగా పనిచేసుకొనేంత శక్తిని సంతరించుకొన్నట్టు శాస్త్రవేత్తలు తెలిపారు.

చావు గుట్టు వీడబోతున్నదా?

'పుట్టక ముందు నువ్వెవరూ?.. మరణించాక ఏమౌతావు?' అనే తత్వపరమైన భావాలు, ఆత్మల ఊహాగానాలు, చావు గురించిన రహస్యాలు ఇప్పటివరకూ కథలుగానే ఉన్నాయి కానీ, శాస్త్రీయపరంగా ఎక్కడా రుజువైన దాఖలాలు లేవు. అయితే, పరిశోధకులు తాజాగా గుర్తించిన థర్డ్ స్టేట్‌తో చావు గురించిన గుట్టు ఒక్కొక్కటిగా విడిపోయే అవకాశం ఉన్నదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

నమస్తే తెలంగాణ

జిందగీ

హైదరాబాద్ | శుక్రవారం 20 సెప్టెంబర్ 2024 www.ntnews.com

సాంకేతిక సాయం.



అందివస్తున్న ఆధునిక సాంకేతికత.. ఆపదలో ఉన్న ఆడవాళ్లకు సహాయం అందిస్తున్నది. అర్ధరాత్రి వేళ విధులు నిర్వహించే మహిళలకు రక్షణగా నిలుస్తున్నది. ఈ క్రమంలోనే హర్యానా పోలీసులు.. మహిళల రక్షణ కోసం కొత్త భద్రతా ఫీచర్స్ రూపొందించారు. ప్రస్తుతం ప్రతి స్మార్ట్‌ఫోన్‌లోనూ ఉంటున్న 'వాట్సాప్'లో సరికొత్తగా రియల్ టైమ్ ట్రాకింగ్‌ని ప్రవేశపెట్టారు. దీన్ని ఆ రాష్ట్ర పోలీస్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ సపోర్ట్ సిస్టమ్‌కు అనుసంధానించారు. మహిళా ప్రయాణికులు, ముఖ్యంగా రాత్రిపూట ఒంటరిగా ప్రయాణించే మహిళల కోసం 'ట్రిప్ మానిటరింగ్ సిస్టమ్'ని రూపొందించినట్లు హర్యానా పోలీసులు తెలిపారు. ఇందులో భాగంగా మహిళలు 112 నెంబర్‌కు కాల్‌చేసి.. వారి పేరు, మొబైల్ నెంబర్, ఎక్కడినుంచి ఎక్కడికి వెళ్తున్నారు? ఆ ప్రయాణానికి ఎంత సమయం పడుతుంది? అనే వివరాలను పోలీసులతో పంచుకోవచ్చు. దీంతో హర్యానా డయల్ 112 బృందం.. సదరు మహిళల లొకేషన్‌ను ట్రాక్ చేస్తుంది. వాళ్లు తమ గమ్యాన్ని చేరుకునే వరకూ వాళ్లతో కాంటాక్ట్‌లో ఉంటుంది. ఏదైనా ఆపద వచ్చిందని గుర్తించిన వెంటనే.. దగ్గర్లోని పోలీసులను అప్రమత్తం చేస్తుంది. అలా.. మహిళల రక్షణకు భరోసానిస్తుంది.



ఈ ప్రపంచంలో ఓటమిని మించిన గురువు లేడంటారు. పరాజయాన్ని సోపానంగా మలుచుకుంటే ఎన్నటికైనా విజయం సాధించొచ్చు. వీళ్లంతా 'ఫెయిల్యూర్ గురూ' నుంచి స్ఫూర్తి పొందిన వారే. మన తెలుగు రాష్ట్రాలకు ఐపీఎస్‌లుగా సెలెక్ట్ అయినవారే! ఇటీవల శిక్షణ పూర్తి చేసుకొని.. పాసింగ్ అవుట్ పరేడ్‌కు సిద్ధమవుతున్నారు. ఒకరిది మొక్కవోని 'దీక్ష'.. మరొకరిది వెన్నుచూపని 'సంకల్పం'.. అమ్మకోసం ఇంకొకరు.. నాన్న ఆశయ సాధనకు మరొకరు.. సెల్యూట్ చేయించుకునే స్థాయికి చేరుకున్నారు. తొలి ప్రయత్నంలో విఫలమైనా.. పట్టుదలతో ప్రయత్నించి ఐపీఎస్ సాధించారు.

ఓటమిని జయించి.. ఐపీఎస్ సాధించి



నాన్న కోరిక నేను నెరవేర్చా..

ఉత్తర్‌ప్రదేశ్ ఉరుము వసుంధరా యాదవ్. ఇంజినీరింగ్ చేసిన ఈ ఫిరంగి.. తెలంగాణ క్యాడర్ సివంగి. ఐదుసార్లు విఫలమైనా అలుపెరగకుండా ఆరోసారి తన సత్తా చాటిన వసుంధర కథ ఆమె మాటల్లోనే...

మాది ఉత్తర్‌ప్రదేశ్. నాన్న ఫరూబీ యాదవ్. మాకు సొంతంగా వ్యాపారం ఉంది. మేము మొత్తం నలుగురు సంతానం. అన్నయ్య వ్యాపారం చేస్తున్నాడు. అక్క డాక్టర్. తమ్ముడు ఎల్ఎల్‌బీ చదువుతున్నాడు. చిన్నప్పటినుంచి పోలీసు అవ్వాలన్నది మా నాన్న కోరిక. కానీ, కుటుంబ పరిస్థితుల కారణంగా ఆయన వ్యాపారిగా స్థిరపడాల్సి వచ్చింది. అందుకే నాన్న నన్ను ఐపీఎస్‌గా చూడాలనుకున్నారు. నాన్న కోరిక నెరవేర్చాలని నేను ఫిక్సయ్యాను. నాన్న, అన్నయ్య ఎంతో ప్రోత్సహించారు. ఇంజినీరింగ్‌లో కంప్యూటర్ సైన్స్ తర్వాత నా దృష్టంతా ఐపీఎస్ ప్రిపేర్ అవడంపైనే పెట్టాను. కొన్నాళ్లు శిక్షణ తీసుకున్నాను. కొంత సొంతంగా ప్రిపేర్ అయ్యాను. ఐదుసార్లు విఫలమయ్యాను. అయినా పట్టు వదల్లేదు. చివరిగా ఆరో ప్రయత్నంలో ఐపీఎస్ సాధించాను. ఓడిన ప్రతీసారి.. కొత్తపాఠం నేర్చుకున్నాను. చేసిన తప్పు మళ్లీ చేయకుండా.. ప్రతి దశలోనూ మరింత కష్టపడ్డాను. ఐపీఎస్ అయ్యి నాన్న కల నెరవేర్చాను. ఓ కూతురిగా ఇంతకంటే గొప్ప అనుభూతి ఇంకేం ఉంటుంది. ఈ ప్రయాణంలో మా ఆయన కూడా అండగా నిలిచారు. ఆయన కూడా ప్రభుత్వ ఉద్యోగిగానే ప్రజలకు సేవ చేస్తున్నారు.

తెలంగాణ సంస్కృతి అంటే ఇష్టం..

నాకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పట్ల చాలా అవగాహన ఉంది. ఇక్కడ మరింత నేర్చుకోవడానికి అవకాశం దొరుకుతుంది. హైదరాబాద్ బెస్ట్ మెట్రోపాలిటిన్ సిటీ. చాలా అభివృద్ధి చెందింది. ఇక్కడ విభిన్న సంస్కృతుల వారు జీవిస్తున్నారు. పెద్దపెద్ద ఐటీ కంపెనీలు ఉన్నాయి. మంచి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేశారు. దేశంలో తెలంగాణ అంటే మంచి పేరుంది. అట్లాంటి రాష్ట్రానికి నన్ను కేటాయించడం ఆనందంగా ఉంది. ఇక్కడి సంస్కృతులు ఇప్పుడిప్పుడే నేర్చుకుంటున్నా. తెలుగు కూడా నేర్చుకుంటున్నా. మా ట్రైనీలతో తెలుగులో మాట్లాడే ప్రయత్నం చేస్తున్నా. త్వరలోనే పూర్తిస్థాయి తెలుగు అమ్మాయిలా కనిపిస్తా. పాత చట్టాలు, కొత్త క్రిమినల్ చట్టాలపై మాకు చక్కని శిక్షణ ఇచ్చారు. వాటిపై పూర్తిస్థాయిలో అవగాహన ఏర్పడింది.



ప్రస్తుతం తెలంగాణలో సమర్థులైన మహిళా ఐపీఎస్‌లు ఉన్నారు. ముగ్గురు డీజీపీ ర్యాంకు సైతం పొందారు. ఆడపిల్లలు ఎవరైనా ఐపీఎస్ వైపు రావాలనుకుంటే తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. పిల్లల కష్టాన్ని గౌరవించాలి. ఆ కష్టం ఎప్పుడూ వృథాపోదు.. తప్పకుండా ఫలితాన్ని పొందుతారు. ఇది నేను నేర్చుకున్న సత్యం. సైబర్ నేరాలు తెలంగాణలో ఎక్కువగా జరుగుతున్నాయి. వాటిని నియంత్రించడంలో నావంతు పాత్ర పోషిస్తా. సైబర్ క్రైమ్స్ నివారణకు మాకందరికీ ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. డ్రగ్స్ నియంత్రణకు కూడా నా ప్రణాళికలు అమలు చేస్తా.



మనవాళ్లకు సేవ చేసే భాగ్యం..



మాది ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా మహానంది. ప్రాథమిక విద్య నంద్యాలలో జరిగింది. ఇంటర్, డిగ్రీ హైదరాబాద్‌లో పూర్తిచేశాను. 2019లో బీఏ హిస్టరీ పూర్తయింది. 2020లో ఐపీఎస్ కోసం మొదటి ప్రయత్నం చేశాను కానీ లక్ష్యం చేరుకోలేదు. 2021లో ఐపీఎస్ సాధించాను. నాన్న వంగల సర్వేశ్వర రెడ్డి వ్యవసాయదారుడు. అమ్మ మల్లీశ్వరి. మా గ్రామంలో బాల్య వివాహాలు ఎక్కువగా జరిగేవి. కొన్ని అసమానతలను కండ్లారా చూశాను. వాటిని రూపుమాపాలని నాకు చిన్నప్పట్నుంచే ఉండేది. సామాజిక రుగ్మతలు రూపుమాపాలంటే.. అధికారం చేతిలో ఉండాలి. అందుకే ఐపీఎస్ అవ్వాలనుకున్నా. శిక్షణలో చాలా కష్టపడ్డాను. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా.. వాటిని అధిగమించాను. శిక్షణలో చట్టాలపై పూర్తి అవగాహన వచ్చింది. వాటి ఫలాలను పేదలకు అందించాలన్నది నా సంకల్పం. ఐపీఎస్‌గా మా రాష్ట్రానికే వెళ్లడం ఆనందంగా ఉంది. నా ప్రజలకు సేవ చేసుకునే అదృష్టం దక్కింది. ఎందుకంటే ఏపీలో పరిస్థితులు ఎలా ఉంటాయో నాకు బాగా తెలుసు. వాటిని ఎలా అధిగమించాలో కూడా నాకొక అవగాహన ఉంది. నేరాలను అరికట్టడంలో నావంతు పాత్ర, నా మార్క్ కచ్చితంగా కనిస్తుంది.

• **మనీషా రెడ్డి వంగల,** ఆంధ్రప్రదేశ్ కేడర్

... రవికుమార్ తోటపల్లి   📷 ఉప్పరి శివకుమార్

కిరణ్‌బేడీ నాకు ఆదర్శం..



మాది హర్యాన. ఢిల్లీ జేఎన్‌యూలో మాస్టర్స్ చేశాను. గతంలో నేను ఐపీఎస్‌కు సెలెక్ట్ అయ్యాను. కానీ మంచి కేడర్ రాలేదు. ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ ఆఫీసర్‌గా పనిచేశాను. అంతకుముందు ఢిల్లీ పోలీసు విభాగంలో ఏసీపీగా నాలుగేండ్లు పనిచేశాను. కొన్ని ప్రయత్నాల తర్వాత ఐపీఎస్‌కు ఎంపికై, మంచి కేడర్ సాధించాను. ఇక్కడ హైదరాబాద్‌లోని జాతీయ పోలీసు అకాడమీలో విజయవంతంగా శిక్షణ పూర్తిచేసుకున్నా. ఐపీఎస్ రావడం కోసం దాదాపు నాలుగేండ్లుగా కష్టపడుతూనే ఉన్నాను. అన్ని ప్రయత్నాల్లో నా బెస్ట్ ఇచ్చాను. ఒక భార్యగా, తల్లిగా, కుటుంబాన్ని చూసుకునే గృహిణిగా.. అన్ని పాత్రలూ పోషించాను. ఐపీఎస్ శిక్షణ చాలా కఠినంగా ఉంటుంది. ఇండోర్, అవుట్‌డోర్‌లలో చెమటోడ్చితేనే ఈస్థాయికి రాగలిగాను. నాకు ఫిట్‌నెస్‌పై అవగాహన ఉండటం, అప్పటికే నేను పోలీసు ఉద్యోగం చేసి ఉండటంతో నాకు శిక్షణ సులభమైంది. గ్రేహౌండ్స్ ట్రైనింగ్‌లోనూ నా బెస్ట్ ఇచ్చాను. మా ఆయన ఐఆర్ఎస్ ఆఫీసర్. ఢిల్లీలోని ఇన్‌కమ్ ట్యాక్స్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. నేను కుటుంబానికి పెద్దదాన్ని. నా తోబుట్టువులు ఇంకా చదువుతున్నారు. వాళ్లకు కూడా సివిల్ సర్వెంట్స్ అవ్వాలని కోరిక. మా అమ్మ ప్రొఫెసర్. నాన్న హర్యానాలో డీఈఓగా విధులు నిర్వర్తిస్తున్నారు. నేను సివిల్స్ వైపు రావడానికి కిరణ్‌బేడీ మేడమ్‌ను ఆదర్శంగా తీసుకున్నా. నా చిన్నప్పుడు మా స్కూల్‌కు ఒకసారి కిరణ్‌బేడీ మేడమ్ వచ్చి.. మాలో స్ఫూర్తి నింపారు. ఎలాగైనా ఐపీఎస్ సాధించాలని అప్పుడే అనుకున్నా. మొత్తానికి సాధించా. ప్రస్తుతం నాకు ఆంధ్రప్రదేశ్ కేడర్ కేటాయించారు. దక్షిణాది ప్రజలు చాలా ప్రేమ పూర్వకంగా ఉంటారు. వారికి సేవ చేయడం గొప్పగా భావిస్తున్నా.

• **దీక్ష,** ఆంధ్రప్రదేశ్ కేడర్

చెల్లి ఐఏఎస్.. నేను ఐపీఎస్..



మాది తమిళనాడులోని కడలూరు. నాన్న వ్యవసాయం చేస్తారు. అమ్మ రాష్ట్ర విద్యాశాఖలో పని చేస్తున్నది. మా చెల్లెలు 2020 బ్యాచ్ ఐఏఎస్. ప్రస్తుతం తమిళనాడు కేడర్ ఐఏఎస్‌గా ఉంది. తనే నాకు స్ఫూర్తి. ఇద్దరం కలిసే ప్రిపరేషన్ మొదలుపెట్టాం. మొదటి ప్రయత్నంలో చెల్లికి రైల్వే జాబ్ వచ్చింది, కానీ వద్దనుకుంది. ఆ తర్వాత రెండో ప్రయత్నంలో ఐఏఎస్ సాధించింది. ఆ స్ఫూర్తితోనే నేను సీరియస్‌గా చదివాను. ఆరో ప్రయత్నంలో ఐపీఎస్ సాధించాను. నేను బీఈ అగ్రికల్చర్, ఇరిగేషన్ ఇంజినీరింగ్ చదివాను. మా అమ్మకు సివిల్ సర్వెంట్ కావాలని చాలా కోరిక. తాను సివిల్స్ చాలాసార్లు ప్రయత్నించింది. అయినా సాధించలేకపోయింది. ఆ కోరికను మా ద్వారా నెరవేర్చుకున్నది. మాకు చక్కగా గైడెన్స్ ఇచ్చేది. మా కాలేజ్ చదువులు పూర్తయిన వెంటనే సివిల్స్‌పై దృష్టిపెట్టాం. మేమిద్దరం సివిల్స్ సాధించడం పట్ల మా అమ్మానాన్నలు చాలా గర్వపడుతున్నారు. ఇక శిక్షణలో చాలా కష్టపడ్డాం. పురుషులతోపాటు 15 కేజీల బరువు వేసుకొని 40 కిలోమీటర్లు నడిచేవాళ్లం. 16 కిలోమీటర్లు పరుగులు తీసేవాళ్లం. 2023 నవంబర్‌లో మొదలైన మా శిక్షణ.. నేటికి విజయవంతంగా పూర్తయింది. గ్రేహౌండ్స్, సీఎస్‌డబ్ల్యూ, ఐటీబీపీ వంటి సంస్థల్లో శిక్షణ తీసుకున్నాం. ఈ ట్రైనింగ్‌తో మాకు విశ్వాసం పెరిగింది.

• **సుష్మిత రామనాథ్,** ఆంధ్రప్రదేశ్ కేడర్

నేటితరం అమ్మాయిలు నోరు కట్టేసుకుంటున్నారు. యుక్త వయసులో.. ముక్తసరిగా తింటున్నారు. 'పోషకాహారం.. ఆరోగ్యప్రదం' అని న్యూట్రిషనిస్టులు ఎంత చెబుతున్నా.. టీనేజర్లు 'లైట్'గా తీసుకుంటున్నారు. అయితే, పిల్లల నుంచి పెద్దలుగా మారే కీలక సమయమిది. ఇప్పుడు తీసుకునే ఆహారం.. నేటి ఆరోగ్యంపైనేకాదు, రేపటి అనారోగ్య సమస్యల నుంచి కూడా అమ్మాయిల్ని కాపాడుతుంది. అంతేకాకుండా.. ఈ సమయంలో వారిలో ఆకలి కూడా పెరుగుతుంది. అందువల్ల మంచి పోషక విలువలున్న ఆహారాన్ని ఎంచుకుంటేనే ఆరోగ్యానికి మంచిది.

యుక్త వయసు.. ముక్తసరి వద్దు!



కాల్షియం : ఎముకలు గట్టిపడే దశ ఇది. యుక్త వయసులో వాటి ద్రవ్యరాశి గరిష్ఠంగా 45 శాతానికి చేరుకుంటుంది. ఈ సమయంలో రోజుకు 1,135 మిల్లీగ్రాముల కాల్షియం అవసరం పడుతుంది. అమెరికన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ సిఫారసు ప్రకారం.. పాలు, జున్ను, పెరుగు, తృణధాన్యాలను రోజూవారీ ఆహారంలో భాగం చేసుకోవాలి.

ఐరన్ : ఈ వయసులో నెలసరి వల్ల అమ్మాయిలు రక్తం ఎక్కువగా కోల్పోతారు. ఐరన్‌లోపం ఉంటే.. రక్తహీనతకు దారితీస్తుంది. కొన్ని సందర్భాల్లో ఇది ప్రాణాంతకంగానూ మారుతుంది. కౌమారదశలో ఉన్న ఆడపిల్లలకు కనీసం 15 మి.గ్రా. ఐరన్ అవసరం అవుతుంది. అందుకోసం ఐరన్ అధికంగా లభించే లివర్, టూనా చేప, చిక్కుళ్లు, సోయా, పాలకూర, బ్రకోలీ లాంటివి ఎక్కువగా తినడం మంచిది.

జింక్ : ఈ దశలో శరీరంలో జింక్ లోపిస్తే.. ఎదుగుదల కుంటుపడుతుంది. జుట్టు రాలడం, మొటిమలు రావడం లాంటి సమస్యలూ ఎదురవుతాయి. జింక్‌లోపం.. మెదడు పనితీరుపైనా ప్రభావం చూపుతుంది. అందుకే.. కావాల్సినంత 'జింక్' మీ శరీరంలోకి చేరాలంటే.. తృణధాన్యాలు, చిక్కుళ్లు, చేపలను ఎక్కువగా తీసుకోవాలి.

క్యాలరీలు : కౌమార దశలో అమ్మాయిల శరీరంలో అనేక మార్పులు సంభవిస్తుంటాయి. వీరు ఆరోగ్యంగా పెరగాలంటే.. ఎక్కువ క్యాలరీలు ఉండే ఆహారం తీసుకోవాలి. 10 నుంచి 14 ఏళ్ల అమ్మాయిలకు రోజుకు 2,200 క్యాలరీలు, 15 నుంచి 18 ఏళ్ల వారికి 2,400 క్యాలరీల శక్తి అవసరం పడుతుంది. ఈ శక్తిని పొందడానికి తక్కువ కొవ్వు ఉండే మాంసాహారం, పాల ఉత్పత్తులు, తృణధాన్యాలు, కూరగాయలు, పండ్లను ఆహారంలో భాగం చేసుకోవాలి.

ప్రొటీన్ : చలాకీగా ఉండాల్సిన బాలికలు నీరసంగా ఉంటున్నా, చిన్నచిన్న పనులకే అలసిపోతున్నా.. ప్రొటీన్ లోపం ఉన్నట్టే! 14 నుంచి 18 ఏళ్ల వయసు గల అమ్మాయిలకు సగటున 45 నుంచి 60 గ్రాముల ప్రొటీన్ అవసరం. లేకుంటే, రోగ నిరోధక శక్తి తగ్గిపోవడం, కండరాల బలహీనత, బరువు తగ్గడం లాంటి సమస్యలు ఎదురవుతాయి. వీటి నుంచి తప్పించుకోవడానికి తరచుగా చికెన్, గుడ్లు, బాదంతోపాటు పాల ఉత్పత్తులను తీసుకోవాలి.

విటమిన్లు : విటమిన్ ఎ, బి6, ఇ, డి, సి, ఫోలిక్ యాసిడ్ లాంటివీ శరీరానికి సరిపడా అందేలా చూసుకోవాలి. అందుకోసం రోజువారీ ఆహారంలో మార్పులు చేసుకోవాలి.

రోమాలు మాయం!

అవాంఛిత రోమాలు.. అతివల అందానికి శాపంగా మారుతాయి. వారిని ఆత్మన్యూనతకు గురిచేస్తాయి. వ్యాక్సింగ్ చేసినా.. వారంలోనే యథాస్థితికి వచ్చేస్తాయి. ఇలా బ్యూటీపార్లర్లలో వేలకువేలు చదివించకుండా.. వంటింటి చిట్కాలతోనే వాటిని చిటికెలో పోగొట్టుకోవచ్చు.



- పాలను కాచి చల్లార్చి.. అందులో కొంచెం పటికబెల్లం పొడి, పసుపు, కాఫీపొడి, గోధుమపిండిని కలిపి పేస్ట్‌లా చేసుకోవాలి. దీన్ని ముఖానికి అప్లయి చేసి.. పూర్తిగా ఆరిన తర్వాత మెల్లిగా వెంట్రుకలకు వ్యతిరేక దిశలో స్క్రబ్ చేస్తూ కడిగేసుకోవాలి.
- పొప్పడిపండు గుజ్జులో పసుపు కలిపి.. మాస్క్‌లా చేసుకోవాలి. దీన్ని ఫేస్‌ప్యాక్ వేసుకొని, చల్లటి నీటితో శుభ్రం చేసుకుంటే.. రోమాలు మాయం అవుతాయి.
- పంచదార, నిమ్మరసం.. ఈ రెండిటినీ కలిపి స్క్రబ్‌లా వాడుకోవచ్చు. ముఖంపై ఉన్న వెంట్రుకలను ఇట్టే తొలగించుకోవచ్చు.
- కోడిగుడ్డు తెల్లసొన, పంచదార, మొక్కజొన్న పిండిని కలిపి ముఖానికి రాసుకున్నా.. అవాంఛిత రోమాలు తొలగిపోతాయి.
- పసుపులో కొంచెం చందనం, నిమ్మరసం, గోధుమపిండి, కొబ్బరినూనె కలిపి పేస్ట్‌లా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసుకుంటే.. అవాంఛిత రోమాలు తగ్గుతాయి.
- బియ్యం పిండిలో కొంచెం పసుపు, శనగపిండి, పాలు కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లయి చేసినా.. మంచి ఫలితాలు కనిపిస్తాయి.

మీరే అని గ్యారెంటీ ఏంటి?

హాట్ ఫీచర్

ఒకప్పుడు పర్సు.. సూట్‌కేస్.. లాంటివి పోతాయేమోనని ఎప్పటికప్పుడు చెక్ చేసుకునే వాళ్లం. ఇప్పుడు? ఎప్పటికప్పుడు జేబు చెక్ చేసుకుంటున్నాం.. ఫోన్ ఉందో? లేదో? అని. ఇంతలా స్మార్ట్‌ఫోన్ ప్రతి ఒక్కరి జీవితంలో చాలా ముఖ్యమైన వస్తువులా మారిపోయింది. అందుకే స్మార్ట్‌ఫోన్ సెక్యూరిటీ విషయంలో తయారీ సంస్థలు కూడా ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతున్నాయి. ఓఎస్‌లో అందుకు తగిన స్మార్ట్ ఫీచర్లను జోడిస్తున్నాయి. త్వరలో అందుబాటులోకి రానున్న 15 వెర్షన్‌లోనూ ఫోన్ సెక్యూరిటీకి ఆండ్రాయిడ్ పెద్దపీట వేసింది. 'ఐడెంటిటీ చెక్' ఫీచర్‌ని పరిచయం చేయనుంది. ఐఓఎస్‌లో ఉన్న 'స్టోలెన్ డివైస్ ప్రొటెక్షన్' లాంటిదే ఈ ఫీచర్. ఇది ఓ నిఘా వ్యవస్థలా పని చేస్తుంది. వినియోగదారులు ఫోన్‌ని రోజూ ఏయే లొకేషన్స్‌లో వాడుతున్నారు? ఏయే అవసరాలకు ఉపయోగిస్తున్నారు? ఏ వేళల్లో ఎక్కువగా యూజ్ చేస్తున్నారు?... లాంటి అనేక విషయాల్ని నిరంతరం ట్రాక్ చేస్తుంది. ఎప్పుడైనా అనుకోకుండా ఫోన్ ఏదైనా కొత్త లొకేషన్‌ని డిటెక్ట్ చేస్తే.. తక్షణం అలర్ట్ అవుతుంది. వెంటనే యూజర్ ఎవరనేది తెలుసుకునేందుకు ఫోన్ లాక్ చేస్తుంది. యూజర్ బయోమెట్రిక్ లేదా ఫేస్ డిటెక్షన్‌ని అడుగుతుంది. వచ్చిన ఇన్‌పుట్‌ని ప్రాసెస్ చేసి యూజర్ వెరిఫికేషన్ చేశాకే.. ఫోన్ అన్‌లాక్ అవుతుంది. ఇదెంత స్ట్రాంగ్‌గా పని చేస్తుందంటే.. పిన్ నెంబర్ ఎంటర్ చేశాక కూడా.. 'ఐడెంటిటీ చెక్' తర్వాతే అన్‌లాక్ అవుతుంది. దీంతో ఎవరైనా ఫోన్ దొంగిలిస్తే.. డేటా ఎవరి కంటా పడకుండా జాగ్రత్తపడొచ్చు అన్నమాట. మరో విషయం ఏంటంటే.. కొత్త వెర్షన్ ఆండ్రాయిడ్ 15లో కస్టమైజేషన్‌కు అధిక ప్రాధాన్యమిస్తూ ఫీచర్లను అందుబాటులోకి తెస్తున్నారట. దీంతో యూజర్లు వారివారి అవసరాలకు తగినట్టుగా ఓఎస్‌లో మార్పులు చేసుకోవచ్చు.




కల్యాణి పసిడి పరుగు



తెలంగాణ జూనియర్ అథ్లెటిక్స్ టోర్నీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఉస్మానియా యూనివర్సిటీ(ఓయూ) వేదికగా జరుగుతున్న 10వ తెలంగాణ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర అథ్లెట్లు అద్భుత ప్రదర్శన కనబరిచారు. గురువారం మొదలైన టోర్నీలో బాలికల అండర్-20 800మీటర్ల రేసులో కల్యాణి 2:35:09సెకన్ల టైమింగ్‌తో పసిడి పతకంతో మెరిసింది. ఇదే విభాగంలో టబు(కొత్తగూడెం), పూజ(నిర్మల్) వరుసగా రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. బాలుర అండర్-18 లాంగ్‌జంప్‌లో నల్లగొండకు చెందిన సపావత్ దాతు 6.69మీటర్లు దూకి స్వర్ణం ఖాతాలో వేసుకున్నాడు. అశోక్(6.67మీ), సుబ్బు(6.13మీ) రజత, కాంస్య పతకాలు దక్కించుకున్నారు. తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్, సాట్స్ సంయుక్తంగా ఈ టోర్నీ నిర్వహిస్తున్నాయి.

క్వార్టర్స్‌కు మాళవిక



చెంగ్జౌ: చైనా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత యువ షట్లర్ మాళవిక బన్సోద్ క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో మాళవిక.. 21-17, 19-21, 21-16తో క్రిస్టీ గిల్మోర్ (స్కాట్లాండ్)ను ఓడించి క్వార్టర్స్‌కు అర్హత సాధించింది. తొలి రౌండ్‌లోనే ప్రపంచ ఏడో ర్యాంకర్ మరిస్కను చిత్తుచేసిన మాళవిక.. తాజాగా 25వ ర్యాంకర్‌నూ మట్టికరిపించింది. కాగా బ్యాడ్మింటన్ సూపర్ 1000 టోర్నీలో క్వార్టర్స్ చేరడం మాళవిక కెరీర్‌లో ఇదే ప్రథమం కావడం విశేషం. క్వార్టర్స్‌లో ఆమె జపాన్ షట్లర్ యమాగుచితో తలపడనుంది.

సీఎం కప్ సన్నాహాలు

క్రీడా సంఘాలతో సాట్స్ చైర్మన్ సమావేశం



హైదరాబాద్, ఆట ప్రతినిధి: సీఎం కప్-2024 కోసం రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (సాట్స్) సన్నాహాలు మొదలుపెట్టింది. త్వరలో నిర్వహించబోయే టోర్నీ కోసం క్రీడా సంఘాల ప్రతినిధులతో సాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి గురువారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. టోర్నీ విజయవంతం కోసం క్రీడా సంఘాల సహకారం అవసరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'గ్రామీణ యువ క్రీడా ప్రతిభను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో సీఎం కప్ నిర్వహిస్తున్నాం. మొత్తం నాలుగు అంచెల్లో(గ్రామీణ, మండల, జిల్లా, రాష్ట్ర) పోటీలు నిర్వహిస్తాం. ఇందుకోసం సాంకేతికంగా, నిర్వహణ పరంగా క్రీడా సంఘాల మద్దతు అవసరం. టోర్నీలో పారా క్రీడాంశాలకు కూడా తగిన ప్రాధాన్యమిస్తాం' అని అన్నారు. ఈ కార్యక్రమంలో సాట్స్ ఎండీ సోనీబాలదేవి, డీడీలు చంద్రారెడ్డి, రవీందర్, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆదుకున్న అశ్విన్

సొంతగడ్డపై శతక గర్జన

హసన్ ధాటికి టాపార్డర్ కకావికలం

రాణించిన జడేజా, జైస్వాల్

భారత్, బంగ్లా తొలి టెస్టు



జడేజా (86*)



అశ్విన్ (102*)

6- టెస్టులలో అశ్విన్ శతకాలు. చెన్నైలో రెండోది. 2021లో ఇంగ్లండ్‌పై ఇదే వేదికలో సెంచరీ చేశాడు.

చెన్నై వేదికగా భారత్, బంగ్లాదేశ్ తొలి టెస్టు పోరు రసవత్తరంగా సాగుతున్నది. టాస్ గెలిచిన బంగ్లా ఊహించని రీతిలో భారత్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. కెప్టెన్ నమ్మకాన్ని వమ్ము చేయని హసన్..కెప్టెన్ రోహిత్‌శర్మ, శుభ్‌మన్‌గిల్, విరాట్ కోహ్లీని ఔట్ చేసి ఆదిలోనే కోలుకోలేని దెబ్బ కొట్టాడు. యశస్వి జైస్వాల్, పంత్ బ్యాటింగ్‌తో గాడిలో పడ్డ టీమ్‌ఇండియాను అశ్విన్, జడేజా ఒడ్డున పడేశారు. లోకల్ హీరో అశ్విన్..బంగ్లా బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ అజేయ సెంచరీతో చెలరేగితే జడేజా బ్యాటు ఝులిపించడంతో భారత్ 339 పరుగుల మార్క్ అందుకుంది. 144 పరుగులకే 6 వికెట్లు కోల్పోయిన భారత్ వీరిద్దరి బ్యాటింగ్‌తో పోరాడే స్కోరు అందుకుంది. శుక్రవారం ఇదే జోరు కొనసాగితే.. భారత్‌కు భారీ స్కోరు సాధ్యమైనట్లే.

చెన్నై: స్వదేశంలో బంగ్లాదేశ్‌తో చెన్నైలోని చెపాక్ స్టేడియం వేదికగా జరుగుతున్న తొలి టెస్టులో 'లోకల్ బాయ్' రవిచంద్రన్ అశ్విన్ (112 బంతుల్లో 102 నాటౌట్, 10 ఫోర్లు, 2 సిక్సర్లు) శతక గర్జన చేసి భారత్‌ను ఆదుకున్నాడు. బంగ్లా యువ పేసర్ హసన్ మహ్మూద్ (4/58) ధాటికి కకావికలమైన భారత స్కోరు బోర్డును మరో స్పిన్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా (117 బంతుల్లో 86 నాటౌట్, 10 ఫోర్లు, 2 సిక్సర్లు)తో కలిసి పటిష్ట స్థితికి చేర్చాడు. టాపార్డర్ బ్యాటర్లు రోహిత్ శర్మ (6), విరాట్ కోహ్లీ (6), శుభ్‌మన్ గిల్ (0), కేఎల్ రాహుల్ (16) దారుణంగా విఫలమైన చోట చెపాక్ పిచ్‌పై సంపూర్ణ అవగాహన కలిగిన భారత స్పిన్ ద్వయం.. అజేయమైన ఏడో వికెట్‌కు 195 పరుగులు జోడించింది. అశ్విన్, జడ్డూ రాణించడంతో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 80 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 339 పరుగులు చేసింది.

హసన్ ధాటికి విలవిల..

అందరూ ఊహించినట్టుగా చెపాక్‌లో స్పిన్నర్లు మాయ చేస్తారనుకుంటే అందుకు పూర్తి భిన్నంగా బంగ్లా పేసర్ హసన్ రోహిత్ సేనకు ఊహించని షాకిచ్చాడు. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు వచ్చిన టీమ్‌ఇండియాను ఆరంభ ఓవర్లలో అతడు ముప్పుతిప్పలు పెట్టాడు. తొలి సెషన్‌లో అతడి గణాంకాలే (5 ఓవర్లు 2 మెయిడిన్లు 6 పరుగులు 3 వికెట్లు) ఇందుకు నిదర్శనం. వ్యక్తిగత స్కోరు 1 వద్ద ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్న కెప్టెన్ రోహిత్.. హసన్ వేసిన ఇన్నింగ్స్ ఐదో ఓవర్లో బంగ్లా సారథి శాంతోకు క్యాచ్ ఇవ్వడంతో భారత వికెట్ల పతనం మొదలైంది. ఆ తర్వాత అతడు వరుస ఓవర్లలో.. గిల్, కోహ్లీనీ పెవిలియన్‌కు పంపించాడు. దీంతో భారత్ 34 పరుగులకే 3 కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ క్రమంలో యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్ (118 బంతుల్లో 56, 9 ఫోర్లు), రిషభ్ పంత్ (52 బంతుల్లో 39, 6 ఫోర్లు)తో కలిసి భారత్‌ను ఆదుకునే యత్నం చేశాడు. నాలుగో వికెట్‌కు ఈ ఇద్దరూ 62 పరుగులు జోడించారు. టాపార్డర్ ఇబ్బందిపడ్డా ఈ ఇద్దరు మాత్రం సంయమనంతో ఆడుతూ స్కోరు బోర్డును ముందుకు నడిపించారు. లంచ్ సమయానికి భారత స్కోరు 88/3గా ఉంది. లంచ్ తర్వాత కొద్దిసేపటికే హసన్.. పంత్‌ను ఔట్ చేసి భారత్‌ను మరోసారి ఒత్తిడిలోకి నెట్టాడు. అర్ధ సెంచరీ తర్వాత జైస్వాల్.. నహీద్ రాణా బౌలింగ్‌లో షద్మాన్‌కు క్యాచ్ ఇవ్వగా రాహుల్‌ను మెహిది హసన్ మిరాజ్ బోల్తా కొట్టించడంతో భారత్ పీకల్లోతు కష్టాల్లో పడింది.

ఆదుకున్న 'లోకల్ బాయ్స్'

అత్యంత కఠిన పరిస్థితుల్లో క్రీజులోకి వచ్చిన అశ్విన్, జడేజా ఆరంభంలో కొద్దిసేపు ఆచితూచి ఆడారు. చెన్నైలోనే పుట్టి పెరిగి చిదంబరం పిచ్ స్వభావంపై పూర్తి అవగాహన ఉన్న అశ్విన్, దశాబ్దికి పైగా ఇక్కడ ఐపీఎల్ ఆడుతున్న (సీఎస్కేకు) జడ్డూ క్రీజులో కుదురుకునేదాకా ఓపిక పట్టారు. జడ్డూ నెమ్మదిగా ఆడినా అశ్విన్ వన్డే తరహా ఆట ఆడుతూ స్కోరుబోర్డును పరుగులు పెట్టించాడు. టాపార్డర్‌ను ఇబ్బందిపెట్టిన హసన్, నహీద్‌తో పాటు స్పిన్నర్లు షకిబ్, మిరాజ్, తైజుల్‌ను భారత స్పిన్ ద్వయం సమర్థవంతంగా ఎదుర్కొంది. టీ విరామానికి క్రీజులో కుదురుకున్న అశ్విన్.. ఆ తర్వాత వేగం పెంచాడు. షకిబ్ 53వ ఓవర్లో స్లాగ్ స్వీప్‌తో సిక్సర్ అయితే చూసి తీరాల్సిందే. 58 బంతుల్లో అశ్విన్ అర్ధ సెంచరీ పూర్తవగా జడేజా 73 బంతుల్లో దానిని పూర్తిచేశాడు. ఆఖరి సెషన్‌లో ఈ ఇద్దరూ మరింత దూకుడు పెంచారు. మిరాజ్ 73వ ఓవర్లో కవర్స్ మీదుగా సిక్సర్ బాదిన అశ్విన్.. 90ల లోకి చేరాడు. షకిబ్ 78వ ఓవర్లో మూడో బంతికి సింగిల్ తీసి టెస్టుల్లో ఆరో శతకాన్ని పూర్తిచేశాడు. ఒక దశలో 144/6గా ఉన్న భారత స్కోరు.. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 339/6కు చేరిందంటే అది ఈ ఇద్దరి చలవే. అశ్విన్, జడ్డూ క్రీజులో ఉండటంతో రెండో రోజు భారత్ 400 ప్లస్ స్కోరుపై కన్నేసింది.

సంక్షిప్త స్కోర్లు

భారత్: 80 ఓవర్లలో 339/6 (అశ్విన్ 102 నాటౌట్, జడేజా 86 నాటౌట్, జైస్వాల్ 56, హసన్ మహ్మూద్ 4/58)

89 ఏండ్ల రికార్డు బద్దలు



టీమ్‌ఇండియా యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ 89 ఏండ్ల టెస్టు రికార్డును తిరగరాశాడు. సుదీర్ఘ టెస్టు క్రికెట్ చరిత్రలో తొలి 10 ఇన్నింగ్స్‌లో 750 పరుగులకు పైగా సాధించిన తొలి బ్యాటర్ జైస్వాల్ అరుదైన రికార్డు సొంతం చేసుకున్నాడు. 2023లో వెస్టిండీస్‌పై అరంగేట్రం చేసిన జైస్వాల్ కొత్త రికార్డుల వేటలో దూసుకెళుతున్నాడు. బంగ్లాదేశ్‌తో తొలి టెస్టులో అర్ధ సెంచరీ ద్వారా 1935లో వెస్టిండీస్ బ్యాటర్ జార్జ్ హెడ్లీ(747 పరుగులు) నెలకొల్పిన రికార్డును జైస్వాల్ బద్దలు కొట్టాడు. బంగ్లాతో మ్యాచ్‌కు ముందు 9 ఇన్నింగ్స్‌లో 712 పరుగులతో ఉన్న ఈ యువ క్రికెటర్ అర్ధసెంచరీతో ఈ ఫీట్ అందుకున్నాడు.



కోహ్లీ లెఫ్ట్‌హ్యాండ్ బ్యాటర్!

భారత్, బంగ్లాదేశ్ టెస్టు మ్యాచ్ ప్రసారం చేస్తున్న స్పోర్ట్స్-18లో పప్పులో కాలేసింది. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీని లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ అంటూ పేర్కొంటూ ప్రసారం చేసింది.

పసిడి వేటలో భారత్

బుడాపెస్ట్: ప్రతిష్ఠాత్మక 45వ చెస్ ఒలింపియాడ్‌లో భారత్ పసిడి పతక వేటలో దూసుకెళుతున్నది. గురువారం ఇరాన్‌తో జరిగిన ఎనిమిదో రౌండ్‌లో భారత్ 3.5-0.5 తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో మరో రెండు రౌండ్లు మిగిలున్న టోర్నీలో టీమ్‌ఇండియా 16 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నది. ప్రపంచ నంబర్‌ఫోర్ ప్లేయర్ ఇరిగేసి అర్జున్ మరోమారు సత్తాచాటాడు. టోర్నీలో అపజయమెరుగని అర్జున్ 1-0తో దన్శేవర్ బర్దియాపై అలవోక విజయం సాధించాడు. నల్లపావులతో బరిలోకి దిగిన అర్జున్ భారత్ గెలుపులో కీలకమయ్యాడు. మిగతా గేముల్లో గుకేశ్, విదిత్ వియాలు సాధించగా, ప్రజ్ఞానంద డ్రా చేసుకున్నాడు.

దీటుగా బదులిస్తున్న కివీస్

గాలె: శ్రీలంకతో గాలే వేదికగా జరుగుతున్న మొదటి టెస్టులో పర్యాటక న్యూజిలాండ్ దీటుగా బదులిస్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో లంకేయులను 305 పరుగులకు ఆలౌట్ చేసిన కివీస్.. రెండో రోజు బ్యాటింగ్‌లోనూ అదరగొట్టింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆ జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 72 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 255 పరుగులు చేసింది. ఓపెనర్ టామ్ లాథమ్ (70), కేన్ విలియమ్సన్ (55) అర్ధ సెంచరీలతో మెరిశారు. డారెల్ మిచెల్ (41 నాటౌట్), టామ్ బ్లండెల్ (18) క్రీజులో ఉన్నారు. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో కివీస్ ఇంకా 50 పరుగులు వెనుకబడి ఉంది.

శశావత్ శతకం

అనంతపూర్: దులీప్ ట్రోఫీ చివరి దశ మ్యాచ్‌లలో భాగంగా గురువారం మొదలైన ఇండియా 'ఏ' వర్సెస్ ఇండియా 'సీ' మ్యాచ్‌లో.. 'ఏ' జట్టు మిడిలార్డర్ బ్యాటర్ శశావత్ రావత్ సెంచరీ (122 బ్యాటింగ్)తో మెరిశాడు. అతడికి అండగా ములానీ (44) రాణించడంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి 'ఏ' 224/7 పరుగులు స్కోరు చేసింది. ఇండియా 'బీ' వర్సెస్ 'డీ' మ్యాచ్ విషయానికొస్తే మొదట బ్యాటింగ్ చేస్తున్న 'డీ' జట్టు.. 77 ఓవర్లలో 306/5 పరుగులు చేసిం ది. సంజూ శాంసన్ (89 బ్యాటింగ్) శతకం దిశగా సాగుతుండగా పడిక్కల్ (50), కేఎస్ భరత్ (52), రికీ భుయ్ (56) అర్ధసెంచరీలు చేశారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.